ఆంధ్రభూమి

సంపుటి 58 సంచిక 106 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | www.andhrabhoomi.net | సోమవారం 15 జనవరి, 2018 | 20 పేజీలు | ధర: ₹3.00

శుభోదయం

కలియుగం - 5119

శాలివాహన శకం - 1939

శ్రీ చాంద్రమాన హేమలంబ నామ సం॥ ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, తిథి: చతుర్దశి రా.తె.4.42; నక్షత్రం: మూల సా.4.34; వర్జ్యం: మ.2.47 నుండి 4.34 తి. రా.తె.3.15 నుండి 4.59వరకు;
విశేషాలు: సంక్రాంతి, ఉత్తరాయణ పుణ్యకాలము, మాసశివరాత్రి
దుర్ముహూర్తం: మ.12.24 నుండి 01.12 వరకు, తిరిగి మ.02.48 నుండి 03.36 వరకు;
రాహుకాలం: ఉ.7.30 నుండి 9.00 వరకు



పగటి వెలుగులు పెంచుతూ పండుగొచ్చు
మకర సంక్రాంతి మెండుగా మనలజేర
పగల చీకట్లు తగ్గగా భయముపోయి
హాయి హాయిగ అందరూ అవధరింత్రు

పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు మకర సంక్రాంతి శుభాకాంక్షలు.

- చీఫ్ ఎడిటర్

సంక్రాంతి సందర్భంగా ఆంధ్రభూమి కార్యాలయానికి జనవరి 15, 2018 సోమవారం సెలవు. కావున మంగళవారం సంచిక వెలువడదు. పునర్దర్శనం జనవరి 17, 2018 బుధవారం సంచికతో..

- యాజమాన్యం



8

కోహ్లీ పోరాటం

భారత్ 5 వికెట్లకు 183

దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు





కమిటీ ముగ్గులోకి పంచాయతీ

రాజ్యాంగం ప్రకారం అందని అధికారాలు ● నీరసించిన 73వ సవరణ ● లబోదిబోమంటున్న సర్పంచ్‌లు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు అధికారాలు, బాధ్యతలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం 1992 లో చేసిన 73 వ రాజ్యాంగ సవరణను తెలుగు రాష్ట్రాలు అమలు చేయక పోవడంతో గ్రామ పంచాయతీలు బలహీనం గానే కొనసాగుతున్నాయి. పంచాయితీలకు అన్ని అధికారాలు ఇస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వాలు 25 ఏళ్లనుండి చెబుతున్నప్పటికీ, అమలు జరగడం లేదు.



పంచాయతీరాజ్ మంత్రి జూపల్లి కృష్ణారావు నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం పంచాయతీ వ్యవస్థ పటిష్టం కోసం కొన్ని సిఫార్సులు చేసింది. ఈ ఉపసంఘం చేసిన సిఫార్సుల కంటే 73 వ రాజ్యాంగ సవరణ ప్రకారం పంచాయతీలకు సంక్రమించాల్సిన అధికారాలే ఎక్కువగా ఉన్నాయి. వాస్తవంగా కేంద్రం చేసిన చట్టం 1993 ఏప్రిల్ 24 నుండి అన్ని రాష్ట్రాల్లో అమల్లోకి రావాలి. ఇందుకోసం ఆ యా రాష్ట్రప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకోవాల్సి ఉన్నా తెలుగు రాష్ట్రాలు పెద్దగా పట్టించుకోలేదు. 1993 తర్వాత ఇప్పటి వరకు పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టం కోసం కొన్ని జీఓలు జారీ చేసినప్పటికీ, అవి అమల్లోకి రాలేదు.

రాజ్యాంగ పరంగా పంచాయతీలకు ఈ అధికారాలన్నీ కట్టబెట్టాల్సి ఉన్నప్పటికీ, పాలనలో ఎవరు ఉన్నప్పటికీ, అధికారాలను ఇవ్వడం లేదు. ఈ అధికారాలన్నీ రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోనే ఉండాలని గత 25 సంవత్సరాల నుండి పనిచేసిన ముఖ్యమంత్రులు భావిస్తూ వస్తున్నారు.

నిధుల కొరత

గ్రామపంచాయతీలకు నాలుగు రకాలుగా నిధులు లభిస్తాయి. పన్నుల రూపంలో ప్రజల నుండి వసూలు చేసే నిధులు కాకుండా, కేంద్రం సెంట్రల్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా ఇచ్చే నిధులు, కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాలు (జాతీయ ఉపాధి పథకం తరహా పథకాలు), రాష్ట్ర ఆర్థిక కమిషన్ చేసే సిఫార్సులకు అనుగుణంగా లభించాల్సిన నిధులతో పంచాయతీలు వేర్వేరు పనులు - మిగతా 7వ పేజీలో

73 వ రాజ్యాంగ సవరణతో రాజ్యాంగంలో 11 వ షెడ్యూల్‌ను (ఆర్టికల్ 243జి) రూపొందించారు. ఈ షెడ్యూల్‌లో పేర్కొన్న ప్రకారం పంచాయతీలకు ఇవ్వాల్సిన అధికారాలివి.

- వ్యవసాయం, వ్యవసాయ విస్తరణ.
- భూ అభివృద్ధి, భూసంస్కరణల అమలు, భూసారపరిరక్షణ.
- చిన్ననీటి వనరులు, నీటి యాజమాన్యం, వాటర్‌షెడ్ అభివృద్ధి.
- పశుసంవర్ధకం, పాడి, కోళ్ల పెంపకం.
- మత్స్యాభివృద్ధి.
- సామాజిక అటవీపెంపకం.
- అటవీఉత్పత్తులు.
- చిన్నతరహా పరిశ్రమలు, ఆహారపరిశ్రమలు.
- ఖాదీ గ్రామీణ పరిశ్రమలు.
- గ్రామీణ గృహనిర్మాణం.
- తాగునీరు.
- గ్రాసం, ఇంధనం.
- రోడ్లు, బ్రిడ్జిల నిర్మాణం.
- గ్రామీణ విద్యుత్తు, విద్యుత్తు సరఫరా.
- ప్రత్యామ్నాయ ఇంధన వనరులు.
- పేదరిక నిర్మూలన పథకాలు.
- విద్య (ప్రాథమి, సెకండరీ).
- సాంకేతిక శిక్షణ, వృత్తి విద్య.
- అనియత విద్య, వయోజన విద్య.
- గ్రంథాలయాలు.
- సాంస్కృతిక కార్యక్రమాలు.
- మార్కెట్లు, సంతలు.
- ఆరోగ్యం, పారిశుద్ధ్యం.
- కుటుంబ సంక్షేమం.
- మహిళా, శిశుఅభివృద్ధి.
- సామాజిక సంక్షేమం, దివ్యాంగుల సంక్షేమం.
- ఎస్‌సి, ఎస్‌టి, బిసి సంక్షేమం.
- రేషన్ దుకాణాలు.
- సామాజిక ఆస్తుల నిర్వహణ.

బంధానికి బలం



స్నేహం వెల్లి విరిసింది. మైత్రి క్రాంతి దేదీప్యమైంది. భారత్‌తో తమ సాన్నిహిత్యానికి మరింత బలాన్నిస్తూ ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఆరు రోజుల పర్యటనార్థం ఢిల్లీ చేరుకున్నారు. ప్రొటోకాల్‌ను సైతం లెక్కచేయకుండా ప్రధాని మోదీ ఎదురేగి గాఢాలింగనంతో నెతన్యాహుకు ఘన స్వాగతం పలికారు. ఇజ్రాయెల్ ప్రధాని పర్యటన ప్రత్యేకం, చారిత్రకమని శ్లాఘిస్తూ మోదీ ట్వీట్ చేశారు.

ఆలింగనాలపై కాంగ్రెస్ ఎగతాళి

- నరేంద్ర మోదీ కౌగిలింతల వీడియో విడుదల 5

కుల గొబ్బెమ్మల వేడుక!

● కులాల వారీగా భేటీలు, హామీలు ● టీఆర్‌ఎస్, కాంగ్రెస్ వ్యూహాత్మక అడుగులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: ఏ కులమైనా పూర్తిగా ఒకే పార్టీకి ఓట్లు వేస్తుందా? అంటే చెప్పడం కష్టం. కానీ గంప గుత్తగా ఒకే పార్టీకి ఓట్లు పడకపోయినా, మెజారిటీ ఓట్లు పడేందుకు అవకాశం ఉంటుంది. అంటే ఆయా పార్టీలు ఇచ్చే హామీలు, ఆ పార్టీలకు నాయకత్వం వహిస్తున్న నేతల పిలుపులు, సూచనలు కొంత వరకు పని చేస్తాయని చెప్పవచ్చు. అందుకే వివిధ పార్టీల నేతలు ఎన్నికలకు ముందు కుల సంఘాల నేతలతో మంతనాలు జరుపుతుంటారు. ఎన్నికలకు ఇంకా సంవత్సరన్నర కూడా పూర్తిగా లేనందున, ఇప్పటికే టిఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతలు వివిధ కుల సంఘాలను ఆకర్షించేందుకు పోటీ పడుతున్నారు. ఇందులో భాగంగానే ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు వివిధ కుల సంఘాల ముఖ్య నేతలను పిలిపించుకుని హామీల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యంగా యాదవుల నుంచి ఒకరికి రాజ్యసభ టిక్కెట్ ఇస్తానని ప్రకటించడం చర్చనీయాంశమైంది. యాదవులకు ఇస్తే మరి మా సంగతేమిటీ? అని రెడ్డిలు, గొల్ల, కురమలు తదితర సంఘాల నేతలు ముఖ్యమంత్రిని కోరుతున్నారు.

దీంతో ముఖ్యమంత్రి ఇటీవల రెడ్డి కుల నాయకులతో సమావేశమై రెడ్డి భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు, నిర్మాణానికి కొంత డబ్బు ఇస్తానని ప్రకటించడంతో మిగతా కులాలు ఆశలు పెంచుకుంటున్నాయి. ఇలాఉండగా ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ నేతలు కూడా కులాల వారీగా సభలు, సమావేశాలు నిర్వహించడం ప్రారంభించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత కార్మికులకు సబ్సిడీ మొత్తాన్ని పెంచి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దళితులను ఆకర్షించేందుకు ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అరెస్టుపై రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసేందుకు వెళ్ళి అక్కడ ఆయనతో వాగ్వావాదానికి దిగారు. నేరెళ్ళ ఘటనపైనా గవర్నర్‌ను కలిసారు. ఖమ్మం ఘటనపై నేరుగా రాష్ట్రపతిని కలిసి ఫిర్యాదు చేశారు.

గౌడ్‌లను ఆకర్షించేందుకు చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తును గీత కార్మికుడు మరణిస్తే, వారి కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇస్తామని తాజాగా టి.పిసిసి అధ్యక్షుడు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రకటించారు. మత్స, పద్మశాలి కుల నేతలతో వేర్వేరుగా మంతనాలు జరిపారు. మైనారిటీలకు, గిరిజనులకు 12 శాతం చొప్పున రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీ ఇచ్చిన టిఆర్‌ఎస్ ఆ హామీని నిలబెట్టుకోలేకపోయిందని ప్రభుత్వాన్ని ఎండగడుతున్నది. బిసి, ఎస్‌సి, ఎస్‌టి కులాలను ఆకర్షించేందుకు ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నది.

పాక్‌పై ఉక్కు పిడికిలే : ఆర్మీ చీఫ్ రావత్ 5

ఖైదీల శ్రమైక క్రాంతి

● ఫర్నిచర్ నాణ్యతలో ఎవరికీ తీసిపోరు.. ● అద్భుత సృష్టికి అపూర్వ ఆదరణ



ఫర్నిచర్ తయారీలో నిమగ్నమైన ఖైదీలు




పాఠశాలలో విద్యార్థుల కోసం అమర్చినట్లుగా కనిపిస్తున్న బెంచీలు

ఆంధ్రభూమి బ్యూరో

సంగారెడ్డి, జనవరి 14: ఖైదీలం అయితేనేం... ఫర్నిచర్ తయారీలో ఎవరికీ తీసిపోం అంటున్నారు వారు.. తమ చేతిచలువతో అద్భుతమైన ఫర్నిచర్‌ను తయారు చేయడమే కాకుండా ఏకంగా కోట్లలో ఆర్డర్ సంపాదించారంటే మాటలేం కాదు.. ఇందుకు జైలు అధికారుల ప్రోత్సాహం కూడా మరువలేనివంటారు వారు. వీరంతా సంగారెడ్డి జిల్లా కంది గ్రామంలోని ఖైదీల కథ. ఒకటి కాదు.. రెండు కాదు.. రకరకాల వ్యాపారాలపై దృష్టి సారించిన తెలంగాణ జైళ్ల శాఖ అనతికాలంలోనే అబ్బురపరిచే ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది. ఇందులో సంగారెడ్డి జైలు అధికారులు తామేమీ తక్కువ కాదన్నట్టుగా వివిధ వ్యాపారాలపై దృష్టిని కేంద్రీకరించారు. నర్సరీల్లో మొక్కలు పెంచడం, ఇటుకల తయారీ, సిమెంటు రింగులు, చేనేత వస్త్రాల విక్రయం, ఫినాయిల్ తదితర వాటిని ఖైదీల ద్వారా తయారు చేయించి విక్రయిస్తూ వ్యాపారాన్ని లాభసాటిగా నిర్వహిస్తున్నారు. గత ఏడాది జనవరిలో ప్రారంభించిన స్టీలు సామాగ్రి తయారీలో అద్భుత విజయాన్ని సాధించారు. ప్రారంభించిన ఏడాదిలోనే 82 లక్షల టర్నోవర్ చేశారంటే అధికారుల నిబద్ధతకు నిదర్శనంగా - మిగతా 7వ పేజీలో

కంచి శంకరాచార్యకు అస్వస్థత

చెన్నై తోరూరు ఆసుపత్రికి తరలింపు



ఆంధ్రభూమి బ్యూరో

తిరుపతి, జనవరి 14: కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి ఆదివారం రాత్రి అస్వస్థతకు గురైనట్లు సమాచారం. దీంతో ఆయనను మఠం నిర్వాహకులు తక్షణం చెన్నైలోని రామచంద్ర ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది. రాత్రి ఏడుగంటల సమయంలో మఠంలో ఉండగానే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారని తెలిసింది. దీంతో ఆయనను చెన్నై శివారులోని తోరూరు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.





సంక్రాంతి పండగకు నగరవాసులు చాలామంది పల్లెలకు పయనమవ్వడంతో ఆదివారంనాడు బోసిపోయి కనిపిస్తున్న బేగంపేటలోని గ్రీన్‌ల్యాండ్ (పైన), ఎల్బీ స్టేడియం పరిసరాలు (కింద)

సంక్రాంతి రద్దీ మాకో సవాల్

◆ 147 ప్రత్యేక రైళ్లు, 195 అదనపు కోచ్‌ల ఏర్పాటు

◆ ద.మ. రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ వెల్లడి





సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కల్పించిన ఏర్పాట్లను స్వయంగా అడిగి తెలుసుకుంటున్న దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ (పైన), సంక్రాంతి రోజు కూడా కిటకిటలాడుతున్న సికిందరాబాద్ రైల్వే స్టేషన్ (కింద)

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: సంక్రాంతి రద్దీకి అనుగుణంగా ప్రత్యేక రైళ్లను నడిపి విజయవంతంగా ప్రయాణీకులకు వారి గమ్యస్థానాలకు చేర్చగలిగామని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. సంక్రాంతి రద్దీని సవాల్‌గా తీసుకుని తమ రైల్వే నెట్ వర్క్ పని చేసిందని కొనియాడారు. అన్ని విభాగాలు నిత్యం పర్యవేక్షించడం వల్ల ప్రత్యేక రైళ్లను సకాలంలో నడిపి సంక్రాంతి పండుగను ఆనందదాయకంగా జరుపుకునేందుకు దోహదపడ్డామని తెలిపారు. ఆయన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ప్రయాణీకుల నుంచి రైల్వే చేసిన ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి కూడా సురక్షిత ప్రయాణ ఏర్పాట్లు చేశామని వెల్లడించారు. జనవరి 1 నుంచి జనవరి 20 వరకు సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ స్టేషన్ల నుంచి ఎపి, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు వెళ్లడం, తిరిగి రావడం కోసం 174 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. దీనికి తోడు అదనంగా నిత్యం నడిచే రైళ్లకు అదనంగా 195 కోచ్‌లను ఏర్పాటు చేశామని చెప్పారు. అంతేకాకుండా మకర సంక్రాంతి సందర్భంగా శబరిమల ప్రయాణానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఎగువ, దిగువనకు కలిపి మొత్తం 156 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్, కాకినాడ, నర్సాపూర్, మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, ఔరంగాబాద్, నాందేడ్, నిజామాబాద్, అకోలా, ఆదిలాబాద్, సిర్పూర్ కాగజ్‌నగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం, కొల్లాం, కోచువెల్లి, తిరుపతి పట్టణాల నుంచి ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు తెలిపారు. ఈ రెండు రకాల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ ప్రత్యేక రైళ్లను నడపడంలో డిఆర్ఎంలు, అదనపు డిఆర్ఎంలు నిత్యం పర్యవేక్షించడం వల్ల సాధ్యమైందని అన్నారు. సాధారణంగా ప్రతి రోజు దక్షిణ మధ్య రైల్వే పరిధిలో 10.2 లక్షల మంది ప్రయాణిస్తుంటారని స్పష్టం చేశారు.

జనవరి 1 నుంచి ఈ సంఖ్య రోజుకు మరో 60 వేల మందికి చేరిందని తెలిపారు. సంక్రాంతి సీజన్‌లో మొత్తం రోజుకు ప్రయాణించే వారి సంఖ్య 12 లక్షలకు పైగా ఉంటుందని అంచనా వేశారు. ఈ ప్రయాణీకుల రద్దీ భారం హైదరాబాద్, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లపైనే పడింది. సుమారుగా 50 శాతం అదనపు రద్దీ సంక్రాంతి పండుగ వల్లే ఏర్పడిందని వెల్లడించారు.

ఈ రద్దీకి అనుగుణంగా టిక్కెట్ బుకింగ్ కౌంటర్లు పెంచడంతో పాటు ఆటోమేటిక్ టిక్కెట్ వెండింగ్ మిషన్లు (ఎటివిఎం)లను ఏర్పాటు చేయడం, విచారణ కౌంటర్లు అదనంగా పెంచడం, 24 గంటలు అధికారులు స్వీయ పర్యవేక్షణ చేపట్టడం వల్ల సాఫీగా సంక్రాంతి రద్దీని ఎదుర్కొనగలిగామని జిఎం వెల్లడించారు. ఫ్లాట్ ఫాం టిక్కెట్ ధర రూ.10 నుంచి 20 వరకు తాత్కాలికంగా పెంచడం వల్ల కూడా ఫ్లాట్‌ఫాంలపై రద్దీని నివారించగలిగామని తెలిపారు. దీనికి తోడు రైల్వే స్టేషన్లు, రైళ్లలోనూ అనునిత్యం శుభ్రత పాటించడం వంటి సేవలను నిరంతరం అందించామని తెలిపారు.

కాకినాడ టౌన్, నర్సాపూర్ నుంచి ప్రత్యేక రైళ్లు

సంక్రాంతి పండుగకు వెళ్లిన వారు తిరుగు ప్రయాణానికి వీలుగా కాకినాడ టౌన్, నర్సాపూర్ నుంచి రెండు రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే ప్రకటించింది. ఈ నెల 17న కాకినాడ టౌన్ నుంచి సికింద్రాబాద్‌కు సువిధ ప్రత్యేక రైలును నడుపుతున్నట్లు ప్రకటించింది. అలాగే నర్సాపూర్ నుంచి ఈ నెల 16న ప్రత్యేక రైలు హైదరాబాద్‌కు బయలు దేరుతుందని తెలిపింది.

ఇక చిల్లర సమస్యకు చెక్

◆ హైదరాబాద్, వరంగల్ నగరాల్లో సిటీ బస్సు చార్జీల హేతుబద్ధీకరణ

◆ నేటి నుంచి చార్జీల్లో స్వల్ప హెచ్చుతగ్గులు ★ ఆర్టీసీ ఎండీ రమణారావు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: నగర ఆర్టీసి బస్సు సర్వీసుల్లో కండక్టర్లు, ప్రయాణీకుల మధ్య తరచూ తలెత్తే చిల్లర సమస్యకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిఎస్ఆర్టీసి) స్వస్తి పలికింది. నగర బస్సుల్లో టిక్కెట్ల ధర తక్కువగా ఉంటుంది. స్టేజిలను బట్టి కనీస ధర ప్రకారం రూ.6, రూ.8గా ప్రారంభమై ఆ తర్వాత కిలో మీటర్లను బట్టి ఒకటి, రెండు రూపాయలు పెరుగుతూ ఉండే విధంగా సంస్థ లెక్క గట్టి చార్జీలను నిర్ణయించి అమలు చేస్తుంది. ఈ పరిస్థితిలో ఓ గమ్యస్థానానికి టిక్కెట్ ధర రూ.9 అయితే, ప్రయాణీకుడు రూ.10 నోటు ఇస్తే తిరిగి రూపాయి ఇచ్చేందుకు చిల్లర లేకపోవడంతో మరో రూపాయి ఇవ్వమని చెప్పి, తిరిగి రెండు రూపాయలు ఇవ్వడం జరుగుతుంది. అలా ఇవ్వకపోతే ఒక్కోసారి ప్రయాణీకుడు రూపాయి వదులుకోవాల్సి వస్తుంది. ఇక 11, 12 రూపాయలు టిక్కెట్ ధర ఉంటే కండక్టర్‌కు రూ.20 నోటు ఇస్తే రెండు రూపాయలు ఇవ్వాలని ప్రయాణీకుడిని అడగడం, చిల్లర లేకపోతే దిగిపోమని చెప్పడం,లేదా రూపాయో, రెండు రూపాయలో తక్కువ ఇవ్వడం, ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడం వంటివి తరచు సిటీ సర్వీసుల్లో జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో సిటిజన్ వెల్ఫేర్ కౌన్సిల్ చేసిన విజ్ఞప్తి మేరకు, పత్రికల్లో వచ్చిన వివిధ కథనాలతో స్పందించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు టిఎస్ఆర్‌టిసి ఎండి జివి రమణారావు ఎపిలోని విశాఖ, విజయవాడ నగరాల్లో అధ్యయనం చేయించారు. అక్కడ అమలు చేస్తున్న విధానంలో ఇక్కడ అమలు చేసి చిల్లర సమస్యకు ముగింపు పలికారు. ఈ నెల 15 నుంచి హైదరాబాద్ సిటీ, వరంగల్ సిటీల్లో ఈ చార్జీల హేతుబద్ధీకరణ అమలు చేసేందుకు నిర్ణయించినట్లు ఎండి రమణారావు వెల్లడించారు. నగర ఆర్డీనరీ సర్వీసులో ప్రస్తుత టిక్కెట్ చార్జి రూ.7 ఉంటే రూ.5 తీసుకోవడం, రూ.8 ఉంటే రూ.10 తీసుకోవడం, రూ.9 ఉంటే రూ.10 తీసుకోవడం, రూ.10 ఉంటే రూ.10, రూ.11 ఉంటే రూ.10, రూ.13 ఉంటే రూ.15, రూ.15 ఉంటే రూ.15, రూ.16 ఉంటే రూ.15, రూ.17 ఉంటే రూ.15, రూ.18 ఉంటే రూ.20, రూ.19 ఉంటే రూ.20



ఇలా వసూలు చేయడం ద్వారా చిల్లర ఇబ్బందిని పరిష్కరించేందుకు నిర్ణయించినట్లు ఎండి వెల్లడించారు. ఇదే విధంగా మెట్రో ఎక్స్‌ప్రెస్, మెట్రో డీలక్స్ బస్సుల్లో కూడా చిల్లర కోసం టిక్కెట్ ధరల్లో అవసరాన్ని బట్టి స్వల్ప మార్పులు చేశారు. ఈ మేరకు కొత్తగా నిర్ణయించిన టిక్కెట్ చార్జీలు 15వ తేదీ నుంచి హైదరాబాద్, వరంగల్ నగర సర్వీసుల్లో అమల్లోకి రానున్నాయి.

నత్తనడకన ‘ఎంసెట్ దర్యాప్తు కేసు’

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: తెలంగాణ రాష్ట్రంలో సంచలనం కలిగించిన 2016 ఎంసెట్ మెడిసిన్ పేపర్-2 లీకేజీ కేసు రెండేళ్లగా నత్తనడక సాగుతోంది. ఈ కేసులో ఇంకా అరెస్టు కావాల్సిన 19 మంది కోసం సిఐడి అధికారులు గాలిస్తున్నారు. అరెస్టులు పూర్తి కాకపోవడంతో చార్జిషీట్లు దాఖలు కాలేదు. దీంతో ఈ కేసును త్వరగా కొలిక్కి తెచ్చేందుకు దర్యాప్తు విభాగం సిఐడి పని చేస్తోంది. ఎంసెట్ 2 మెడికల్ ప్రశ్నపత్రం లీక్ చేసిన కీలక వ్యక్తి శివబహదూర్ సింగ్‌తో సహ 49 మంది నిందితులను అరెస్టు చేశారు. మిగిలిన వారికి కోసం సిఐడి బృందాలు ఇతర రాష్ట్రాల్లో గాలిస్తున్నాయి. 2016 జూలై 9న ఎంసెట్‌ను హైదరాబాద్ జెఎన్‌టియు నిర్వహించింది. ఫలితాలను జూలై 14న ప్రకటించింది. పేపర్‌ను లీక్ చేసి అక్రమంగా చాలా మందికి ర్యాంకులు రావడం, కష్టపడి చదివిన వారికి ర్యాంకులు రాకపోవడంపై గందరగోళం నెలకొన్న పరిస్థితిలో పేపర్‌ను భారీ స్థాయిలోనే లీక్ చేసినట్లు తేలింది. దీంతో ర్యాంకులు మొత్తం తల్లకిందులు కావడంతో తీవ్ర సంచలనం రేకిత్తించింది. తీగలాగితే డొంక కదిలినట్లు దీని వెనుక భారీ కుంభకోణం బయటపడింది. ఈ గందరగోళానికి తెరదించుతూ జూలై 25న సిఐడి దర్యాప్తు చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించడంతో కేసు నమోదు చేశారు. పరీక్షకు ముందే దేశ వ్యాప్తంగా ఐదు నగరాల్లో కొందరు విద్యార్థులతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు బేరసారాలు జరిపి మెడిసిన్ ప్రశ్నపత్రం జవాబులు ఇచ్చి వారితో ప్రాక్టీస్ చేయించినట్లు సిఐడి తన విచారణలో తేల్చింది. ఈ క్రమంలో ఇంకా నిందితులు పరారీలో ఉండడంతో పాటు కొన్ని ఫోరెన్సిక్ నివేదికలు ఇంకా రావాల్సి ఉంది. ఈ నివేదికలు వచ్చిన తర్వాత, నిందితులను పట్టుకుని అరెస్టు చేసి సమగ్రంగా చార్జిషీట్ దాఖలు చేయాలని సిఐడి అధికారులు యోచిస్తున్నారు. మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిందితులను జైలు ఊచలు లెక్కపెట్టించేందుకు సిఐడి విచారణలో నిమగ్నమై ఉంది. అయితే ఈ కేసులో జాప్యం ఎక్కువ జరుగుతోందని, దీంతో నిందితులు దర్జాగా తప్పించుకునే అవకాశం ఉందని విమర్శలు వస్తున్నాయి. ఢిల్లీలో ముద్రించిన సమయంలోనే ప్రశ్నపత్రం లీకై, దళారుల చేతికి చిక్కి ఆ తర్వాత విద్యార్థుల చెంతకు చేరాయి. దీనిలో ఎవరి పాత్ర ఏ మేరకు ఉందనే కోణంలో సిఐడి దర్యాప్తు చేస్తూనే ఉంది. జెఎన్‌టియు అధికారుల ప్రమేయం ఎంత వరకు ఉందనేది నిర్ధారణ జరిగితే ఆ తర్వాత వారిపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం నుంచి సిఐడి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. ఈ కేసులో ఎంతటి వారినైనా వదిలిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్‌లో మళ్లీ ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కూడా సిఐడికి స్పష్టం చేయడంతో పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ఈ కేసులో కీలక నిందితులు ఇప్పటికే అరెస్టు కాగా, మిగిలిన వారంతా దళారులేనని చెబుతున్నారు. డబ్బు చెల్లించి ప్రశ్నపత్రం కొనుగోలు చేసినందున విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సైతం సిఐడి అప్పట్లో ప్రశ్నించిన సంగతి తెలిసిందే. విద్యార్థులు, తల్లిదండ్రులను ఈ కేసులో సాక్ష్యులుగా పేర్కొని సిఐడి విచారణ ముమ్మరం చేసింది. మిగిలిన నిందితులను అరెస్టు చేసిన తర్వాతే చార్జిషీట్లు దాఖలు చేసేందుకు సిఐడి కృషి చేస్తోంది, దీని వల్ల కొంచెం ఆలస్యం తప్పనిసరిగా భావిస్తున్నారు.

◆ ఇప్పటికీ పరారీలోనే 19 మంది నిందితులు, గాలిస్తున్న సీఐడీ

◆ 2016లో కేసు నమోదైనా చార్జిషీట్లేవీ?

మీవి ఉత్తరకుమార ప్రగల్భాలు

◆ చర్చకు రమ్మని తోక ముడిచారు

◆ టీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: టిఆర్ఎస్ నాయకులు ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారని టి.పిసిసి ఉపాధ్యక్షుడు మల్లు రవి విమర్శించారు. విద్యుత్తు వెలుగుల వెనక మతలబు ఉందంటూ తమ పార్టీ నాయకుడు, ఎమ్మెల్యే రేవంత్ రెడ్డి ఆధారాలతో గన్ పార్కులోని అమర వీరుల స్థూపం వద్ద కూర్చుంటే టిఆర్ఎస్ నాయకులు గానీ, రాష్ట్ర మంత్రి కె. తారక రామారావు గానీ హాజరుకాలేదని మల్లు రవి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రేవంత్ రెడ్డిని ఉద్దేశించి చిప్పకూడు తిన్నాడని మంత్రి కేటీఆర్ మాట్లాడడం భావ్యం కాదని ఆయన తెలిపారు. రేవంత్ రెడ్డి కేవలం నిరాధారమైన ఆరోపణలు చేశారని చెబుతున్న టిఆర్ఎస్ నాయకులు విద్యుత్తు కొనుగోళ్లపై బహిరంగ చర్చకు ఎందుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. టిఆర్ఎస్ నాయకులు ఆ అంశం నుంచి తప్పించుకోవడానికి అనవసరమైన అంశాలను ముందు పెడుతున్నారని, వారికి చిత్తశుద్ధి ఉంటే బహిరంగ చర్చకు రావాలని మల్లు రవి తెలిపారు.

అప్పుడు కల్లు బంద్ చేయించి..ఇప్పుడు మొసలి కన్నీరా?

కాంగ్రెస్‌పై టీఆర్ఎస్ ధ్వజం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: హైదరాబాద్ నగరంలో కల్లు దుకాణాల గత రద్దుకు కారణమైన కాంగ్రెస్సే అధికారం కోల్పోగానే తిరిగి గీత కార్మికులపై మొసలి కన్నీరు కారుస్తుందని టిఆర్ఎస్ పార్టీ ధ్వజమెత్తింది. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జంట నగరాలలో కల్లు దుకాణాలను మూయించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా కల్లును నిషేధించడానికి కుట్ర పన్నిన విషయాన్ని గీతా కార్మికులు మరిచిపోలేదని టిఆర్ఎస్ మండిపడింది.

టిఆర్ఎస్ శాసనసభ పక్షం కార్యాలయంలో ఆదివారం మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే వి శ్రీనివాస్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ, జంట నగరాల్లో కల్లు దుకాణాల నిషేదానికి కారణమైన కాంగ్రెస్ పార్టీకి ఇప్పుడు గీతా కార్మికులపై ఎక్కడా లేని ప్రేమ గుర్తుకొచ్చిందని ఏద్దేవా చేసారు.

టిపిసిసి అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తాము అధికారంలోకి వస్తే గీతా కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని, గతంలో కల్లును ఎందుకు నిషేదించారో చెప్పాలని శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేసారు.

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సొంత జిల్లా నల్లగొండలో అత్యధికంగా తాటి, ఈత చెట్లు ఉన్నప్పటికీ కాంగ్రెస్ హయాంలో ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు.

తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే కల్లు గీతా కార్మికులు ప్రమాదవశాత్తు చనిపోతే వారి కుటుంబాలకు ఇచ్చే ఎక్స్‌గ్రేషియాను రూ. 6 లక్షలకు పెంచిందని శ్రీనివాస్‌గౌడ్ గుర్తుచేసారు. కాంగ్రెస్ నాయకుల కల్లబొల్లి మాటలను గీతా కార్మికులు నమ్మవద్దని ఆయన పిలుపునిచ్చారు.

ఎవరు ఉండేనో.. ఎవరు ఊడేనో..

◆ సంక్రాంతి తర్వాత పీసీసీ ప్రక్షాళన!

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: సంక్రాంతి తర్వాత రాష్ట్ర కాంగ్రెస్ కార్యవర్గాన్ని ప్రక్షాళన చేయనున్నట్లు టి.పిసిసి అధ్యక్షుడు ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి సంకేతాలు ఇవ్వడంతో కార్యవర్గంలోని కొంత మంది నేతల్లో గుబులు ఆరంభమైంది. మరోవైపు కొత్తగా తమకు స్థానం లభిస్తుందని సీనియర్ నాయకులు ఆశిస్తున్నారు. ఎఐసిసి నూతన అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన రాహుల్ గాంధీ దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అధ్యక్షులు తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకూ కొనసాగుతారని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇలాఉండగా కింది స్థాయిలో అవసరమైన మార్పులు చేసుకోవడానికి, ఖాళీలు ఉంటే భర్తీ చేసుకునేందుకు అధ్యక్షులకు అవకాశం కల్పించారు. దీంతో సంక్రాంతి తర్వాత రాష్ట్ర కాంగ్రెస్‌ను ప్రక్షాళన చేయాలని ఉత్తమ్‌కుమార్ రెడ్డి భావిస్తున్నారు. చాలా కాలంగా పార్టీ కోసం అంకితమైన భావంతో పని చేస్తున్న వారు పార్టీలో స్థానం కోసం ఆశిస్తుండగా, టి.టిడిపి నుంచి వలస వచ్చిన నేతలూ కార్యవర్గంలో స్థానాన్ని ఆశిస్తున్నారు. టి.టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని వదులుకుని కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే ఎ. రేవంత్ రెడ్డికి తప్పకుండా గౌరవ ప్రదమైన స్థానం లభిస్తుందన్న ధీమాతో ఆయన అనుచరులు ఉన్నారు. టి.టిడిపి వర్కింగ్ ప్రెసిడెంట్ వదులుకున్నందున, కాంగ్రెస్‌లో కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ లభిస్తుందని వారు చెబుతున్నారు. ఆ పార్టీ హామీ లభించిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరినట్లు వారు అంటున్నారు. మరోవైపు రేవంత్‌తో వచ్చిన మాజీ ఎమ్మెల్యేలు సీతక్క, వేం నరేందర్ రెడ్డి, బోడ జనార్ధన్ తదితరులకు సరైన స్థానం కల్పించాల్సి ఉంటుంది. రేవంత్ రెడ్డి కూడా తన వెంట వచ్చిన ముఖ్యులకు సముచిత స్థానం కల్పించాలన్న పట్టుదలతో ఉన్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చిన నాయకులకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తే, పాత వారికి కోపం వస్తుంది. తమ అవకాశాలను ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి దక్కిందన్న భావన తప్పకుండా ఏర్పడుతుంది. దీంతో పార్టీలో విభేదాలు ప్రారంభమవుతాయి. ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికి పార్టీలో సరైన గుర్తింపునివ్వకపోతే భవిష్యత్తులో ఇతర పార్టీలకు చెందిన నాయకులు వలస రాకుండా ఆగిపోతారు. కాబట్టి ఆ తేడాలు రాకుండా కార్యవర్గాన్ని జాగ్రత్తగా కూర్పు చేయాల్సి ఉంటుంది. ఇది కత్తి మీద సాము వంటిదే.

దావోస్‌కు కేటీఆర్ పతంగ్

◆ 23న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సభకు..

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట తారక రామారావు ఆదివారం విదేశీ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ నెల 23 నుంచి 26 వరకు దావోస్‌లో జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ సదస్సులో పాల్గొంటారు. ఆ లోగా దక్షిణ కొరియా, జపాన్ దేశాల్లో కెటిఆర్ పర్యటించి అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశమై తెలంగాణలో పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనకు ఆహ్వానిస్తారు. తెలంగాణ ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన పారిశ్రామిక విధానంలో (టిఎస్-ఐపాస్) కల్పించిన రాయితీలు, ప్రోత్సహకాలపై మంత్రి కెటిఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయనున్నారు.

ఉచిత పెట్టుబడి..అంత వీజీ కాదు!

◆ చెక్కులు ఇచ్చినా బ్యాంకుకు వెళ్లక తప్పదు

◆ మళ్లీ పాత బకాయిలు జమ చేసుకునే అవకాశం

◆ నగదు చెల్లిస్తే అవకతవకలకు ఆస్కారం ◆ చెల్లింపుపై సర్కార్ మల్లగుల్లాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: వ్యవసాయానికి రైతులకు ఉచితంగా పెట్టుబడిని సమకూర్చాలనే ప్రభుత్వ నిర్ణయం మంచిదే అయినప్పటికీ ఈ పెట్టుబడిని అందించడం ఎలా? అనే అంశంపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి అభిప్రాయ సేకరణ జరుపగా చెక్కుల రూపంలో ఇస్తే సరిపోతుందనే మెజార్టీ అభిప్రాయం వ్యక్తం అయిందని దీనిపై ఏర్పాటు చేసిన మంత్రి వర్గ ఉప సంఘం ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ సిఫారసులను ముఖ్యమంత్రి ఆమోదించాకే తుది నిర్ణయం జరుగుతుంది. ఈ ఖరీఫ్ నుంచే రైతులకు సీజన్‌కు ఎకరానికి రూ.4 వేల చొప్పున ఉచిత పెట్టుబడిని అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుణ మాఫీ పథకం కింద ఒక్కో రైతు కుటుంబానికి లక్ష రూపాయాల మేరకు చెల్లించడానికి ప్రతీ ఏటా నాలుగు వేల కోట్ల చొప్పున చెల్లిస్తూ రూ.16 వేల కోట్లను బ్యాంకులకు చెల్లించి రుణ విముక్తి చేసిన విషయం తెలిసిందే. రుణ మాఫీ పథకం ముగియడంతో మరో రూపంలో రైతులను ఆదుకునేందుకు ప్రతీ సీజన్‌కు ఎకరాకు రూ. 4 వేల చొప్పునా ఏడాదికి రూ. 8 వేలు చెల్లించడానికి సుమారు రూ. 5 వేల కోట్లు ఖర్చు అవుతుందని లెక్క కట్టింది. భూ రికార్డుల ప్రక్షాళన పూర్తి అయ్యాక రాష్ట్రవ్యాప్తంగా 71 లక్షల 40 వేల మంది రైతులు ఉన్నట్టు లెక్క తేలింది. అలాగే వీరి ఆధీనంలో కోటి 42 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా ఇందులో 10 లక్షల ఎకరాలు రాళ్లు, రప్పలు, కొండలు, గుట్టలు ఉండటంతో సాగుకు యోగ్యం కాదనే కూడా భూ రికార్డుల ప్రక్షాళనలో గుర్తించారు. దీనిని మినహాయిస్తే కోటి 32 లక్షల ఎకరాలకు ఉచిత పెట్టుబడి కోసం సీజన్‌కు రూ.5.28 వేల కోట్ల చొప్పున కేటాయించాల్సి ఉంది. దీనికయ్యే వ్యయాన్ని ఈ ఏడాది నుంచి కొత్తగా ప్రవేశపెట్టనున్న వ్యవసాయ బడ్జెట్‌లో నిధులు కేటాయించడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే ఇంత పెద్ద మొత్తంలో డబ్బును భరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నా రైతులకు ఏరకంగా చెల్లించాలనే దానిపై ప్రభుత్వం ఎటు తేల్చుకోలేపోతుంది. చెక్కుల రూపంలో చెల్లిస్తే సరిపోతుందని మంత్రి వర్గ ఉప సంఘం సూచించినంత మాత్రాన అది కూడా అంత సులువు కాదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. పంట రుణ మాఫీకి చెల్లించిన రూ. 16 వేల కోట్లు ఏమాత్రం దుర్వినియోగం కాకుండా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. అలాంటి చర్యలు ఉచిత పెట్టుబడి చెల్లింపులకు కూడా అన్వయిస్తే తప్ప అవకతవకలకు ఆస్కారం ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఉచిత పెట్టుబడిని రుణ మాఫీ చెల్లించినంత ఈజీగా చెల్లించడం సాధ్యం కాదంటున్నారు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాల వివరాలను సేకరించి బ్యాంకులకు ప్రభుత్వం నేరుగా రుణ మాఫీ మొత్తాని చెల్లించగలిగింది. ఉచిత పెట్టుబడి అలా కాదు. రైతుల ఖాతాల్లో ఉచిత పెట్టుబడిని జమ చేస్తే బ్యాంకర్లు పాత బకాయిల కింద వాటిని జమ చేసుకునే ప్రమాదం ఉందని చెక్కులు ఇస్తే సరిపోతుందని మంత్రివర్గ ఉప సంఘం సూచించింది. కానీ వాస్తవానికి చెక్కులు ఇచ్చినా రైతులు వాటిని తమ బ్యాంకు ఖాతాల్లోనే జమ చేసుకోవాల్సి ఉంటుంది. రైతుల ఖాతాల్లో పడిన ఉచిత పెట్టుబడిని మళ్లీ పంట రుణం కావాలంటే తమకు చెల్లించాలని వత్తిడి చేసే అవకాశం లేకపోలేదు. పంట నష్టపరిహారం కింద రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా చెల్లించిన మొత్తాన్ని కూడా చెక్కుల రూపంలోనే ఇచ్చింది. వీటిని రైతులు తమ ఖాతాల్లో జమ చేసుకోగా బ్యాంకర్లు తాము ఇచ్చిన రుణాలపై వడ్డీ కింద వాటిని జమ చేసుకున్న సందర్భాల్లో ఉన్నాయి. ఉచిత పెట్టుబడిని కూడా బ్యాంకర్ల తాము ఇచ్చిన రుణ వాయిదాల కింద కానీ, వడ్డీ కింద కానీ జమ చేసుకునే అవకాశం లేకపోలేదు. ఉచిత పెట్టుబడి పూర్తిగా రైతుకే దక్కాలంటే ఏ విధమైన విధానాన్ని అమలు చేయాలనే దానిపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతుంది. జీరో బ్యాలెన్స్‌తో రైతలందరికీ ‘జన్ ధన్ యోజన’ మాదిరిగా ప్రత్యేక ఖాతాలు తెరిచి ఉచిత పెట్టుబడిని జమ చేయడంతో పాటు వాటిని ఆన్‌లైన్ ద్వారా బ్యాంకర్లు తీసుకోవడానికి అవకాశం లేకుండా చేస్తే తప్ప ప్రభుత్వ ఉద్దేశం నెరవేరే పరిస్థితి ఉండదనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఉచిత పెట్టుబడికి మరో సమస్య కూడా ఎదురయ్యే పరిస్థితి ఉంది. భూమి లేని రైతులు పంటకు ఇంత చొప్పున ‘గుత్త‘ మాట్లాడుకొని సాగు చేస్తారు. ప్రభుత్వం చెల్లించే ఉచిత పెట్టుబడి సాగు చేసే రైతుకు కాకుండా పట్టాదారుకే అందుతుంది. కౌలుతో పాటు ప్రభుత్వం ఇచ్చే ఉచిత పెట్టుబడి కూడా పట్టాదారుకే దక్కుతుంది తప్ప సాగు చేసే రైతన్నకు దక్కదు. దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరదు. అలాగని పట్టాదారుకు కాకుండా కౌలు రైతుకు చెల్లించేందుకు అవకాశం లేదు. ఈ సమస్యను ఏ విధంగా అధిగమించి నిజమైన సాగురైతుకు ప్రభుత్వం మేలు చేయనుందో చూడాలి.

ఏడాదిలోగా రైతులకు
గండిపల్లి, గౌరవెల్లి నీళ్లు

మంత్రి ఈటల రాజేందర్



కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకుంటున్న మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే సతీష్

భీమదేవరపల్లి, జనవరి 14: సాగునీరు లేక అల్లాడుతున్న రైతులు ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, వలసల నివారణకు ఏడాదిలోగా గౌరవెల్లి, గండిపల్లి రిజర్వాయర్‌ల ద్వారా రైతాంగానికి సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్, హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితెల సతీష్ కుమార్ చెప్పారు.

మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదివారం కొత్తకొండ వీరభద్రస్వామిని దర్శించుకున్నారు. కొత్తకొండ వీరన్న సన్నిధిలో నూతనంగా పదిలక్షలతో నిర్మిస్తున్న ఐదుగదులను, పది మరుగుదొడ్లు, పది స్నానపుగదులు, పది లక్షలతో నిర్మాణం పూర్తిచేసిన సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఆరులక్షలతో నిర్మించిన శాలివాహనుల వీరబోనం గద్దె పనులను మంత్రి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ప్రారంభించారు. అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ మెట్టప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలోని రైతుల భూములకు సాగునీరు లేక ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, వలసల నివారణకు తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ నుండి మధ్యమానేరు ద్వారా గౌరవెల్లి రిజర్వాయర్ నింపి సాగునీరు ఇచ్చి రైతులను ఆదుకునేందుకు చర్యలు చేపట్టిందని తెలిపారు. కొత్తకొండ వీరభద్రుడిని దర్శించేందుకు ఆరులక్షల మంది భక్తులు హాజరవుతున్నారని వీరికోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కొత్తకొండ ఆలయ అభివృద్ధికి తనవంతు నిధులు కేటాయిస్తానని చెప్పారు. సమావేశంలో దేవస్థానం చైర్మెన్ మార్పాటి మహేందర్‌రెడ్డి, ఇఓ హరిప్రకాశ్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలోనూ
ఆగని వలసలు

- ◆ వలసల జిల్లాగా పాలమూరుకు మరింత ప్రచారం
- ◆ టీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతుల సతమతం
- ◆ రాబోయే రోజుల్లో కేసీఆర్‌కు తగిన గుణపాఠం తప్పదు
- ◆ రైతు అధ్యయన యాత్రలో జేఏసీ చైర్మన్ కోదండరాం



మహబూబ్‌నగర్ జిల్లా నిడ్జింత గ్రామంలో మాట్లాడుతున్న టీజేఏసీ చైర్మన్ కోదండరాం

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 14 : తెలంగాణ రాష్ట్రం వస్తే పాలమూరు వలస జీవుల బతుకుల్లో మార్పు వస్తాయని అందరం భావించామని ఈ విషయాన్ని ఉద్యమ సమయంలో అందరం చెప్పామని అయితే కొత్త రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పాలకులు మాత్రం వలసలను నివారించడానికి చర్యలు తీసుకోలేదని టీజేఏసీ చైర్మన్ కోదండరాం ఆరోపించారు. కేసీఆర్ పాలనలో పాలమూరు ప్రజల వలసలు ఆగలేదని, విచిత్రంగా వలసల జిల్లాగా మరింత ప్రచారం జరుగుతోందని, ఇది దురదృష్టకరమని ఆయన అన్నారు. రైతు అధ్యయన యాత్రలో భాగంగా ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా మద్దూరు మండలం నిడ్జింత గ్రామంలో రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సులో కోదండరాం మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఏ రాష్ట్రం అయినా రైతులు బాగుంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం నాలుగు కాలాల పాటు ముందుకు పోతుందని అన్నారు. రైతులను విస్మరించిన పార్టీలు, నాయకులు చరిత్రలో ఎవరూ మిగలలేరని హెచ్చరించారు. తాను రైతు అధ్యయన యాత్రతో రాష్ట్రంలోని వివిధ నియోజకవర్గలలో పర్యటిస్తున్నానని రైతులంతా ఒకటే చెబుతున్నారని తమను పాలకులు పట్టించుకోవడం లేదని అంటున్నారని తెలిపారు.

ఇలాగైతే రాష్ట్రాన్ని పాలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో రైతులు తీవ్రంగా సతమతమవుతున్నారనే అంశం తేలిపోయిందని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు సరైన పాలన అందించడంలేదనే భావన ప్రజల్లో వచ్చిందని ఇది కేసీఆర్‌కు మంచిదికాదని పద్ధతి కాదని, ఆయన తన వైఖరి మార్చుకుని ప్రజల అవసరాలను బట్టీ పాలన చేయాలని హితవు పలికారు. ఇలాగైతే రానున్న రోజులో కేసీఆర్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. పాలమూరు, రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పాత డిజైన్‌ను మార్చి కేసీఆర్ చాలా తప్పు చేశారని డిజైన్ మార్చడం సరికాదని ఒక వేళ డిజైన్ మార్చాలనుకుంటే జూరాల ప్రాజెక్టు నుండి కూడా ఓ భాగం కృష్ణాజలాలను తీసుకునే విధంగా ప్రాజెక్టు రూపకల్పన చేసిఉంటే ఇలాంటి సమస్యలు ఉత్పన్నమయ్యేవి కావని తెలిపారు. నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గానికి జూరాల ప్రాజెక్టు అతి సమీపంలో ఉందని ఇక్కడి రైతాంగానికి జూరాల నుండే పాలమూరు డిజైన్ చేసి ఉంటే మేలు జరిగేదని తెలిపారు.

శ్రీశైలం నుండి కృష్ణాజలాలు రావాలంటే ఇప్పట్లో సాధ్యం కావని ప్రభుత్వం శ్రీశైలం ప్రాజెక్టు నుండి కొడంగల్ నియోజకవర్గానికి సాగునీరు అందిస్తామనడం రైతుల చెవ్వులో కేసీఆర్ పూలు పెట్టొదని హితవుపలికారు. రైతులను పిచ్చోళ్లను చేసి రాజకీయాలు చేయొద్దని పాలకులు రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని పక్కన పెట్టిన ముఖ్యమంత్రిపై ఈ ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. నారాయణపేట ప్రాజెక్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం 69 జీఓను కూడా విడుదల చేసి ఏకంగా రూ. 1200 కోట్ల అంచనాలు కూడా రూపొందించిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వమే 80 శాతం నిధులు ఖర్చు పెట్టడమే కాకుండా కృష్ణాజలాల్లోని నికర జలాలను సైతం కేటాయించిందని అన్నారు. ఇలాంటి ప్రాజెక్టును ముఖ్యమంత్రి కేసీఆర్ పక్కన పెట్టడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి భారం లేని ప్రాజెక్టును టీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పుకుని సహకరించి ఉంటే కొడంగల్, నారాయణపేట నియోజకవర్గ ప్రజలకు మేలు జరిగేదని ఇక్కడి వలసలు ఆగిపోయేవని అన్నారు. ఫిబ్రవరి 3,4వ తేదీలలో జేఏసీ స్టీరింగ్ కమిటీ సమావేశం ఏర్పాటు చేసి రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చిస్తామని కోదండరామ్ అన్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని హెచ్చరించారు. ఈ సదస్సులో టీజేఏసీ నాయకులు చంద్రనాయక్, కన్నారావు, రమేష్, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్, సత్యనారాయణ, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

24 గంటల విద్యుత్‌తో ఇబ్బందులు

- ◆ కౌలు రైతులకు సాగుకు సహాయమందించాలి
- ◆ సీఎల్పీ ఉప నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తిప్పర్తి, జనవరి 14: ముఖ్యమంత్రి కేసీఆర్ ఏకపక్షంగా వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఎల్పీ ఉప నేత, నల్లగొండ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం జిమ్మిక్కులు చేస్తుందన్నారు. తొలుత ప్రాజెక్టులు కట్టి చెరువులు నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయని, అప్పుడు 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తే రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కౌలు రైతులకు కూడా పంట పెట్టుబడి అందించాలని, కౌలు రైతుల్లో అధిక శాతం పేద, బడుగు, బలహీన వర్గాల వారే ఉన్నారని, ప్రభుత్వం ఈ విషయమై స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కౌలు రైతుల సాగుకు సహాయంపై అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, ఈ విషయమై అన్ని పార్టీల అభిప్రాయాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు సంవత్సరాలు అధికారంలో ఉండి గ్రామపంచాయతీలకు వచ్చే కేంద్ర ఫండ్‌ను టీఆర్‌యస్ ప్రభుత్వం దుర్వినియోగం చేస్తోందని ఆరోపించారు. తిప్పర్తి చౌరస్తాలో ఆర్‌అండ్‌బీ శాఖ నిధుల నుండి 73లక్షల రూపాయలు మంజూరయ్యాయని, సీసీ రోడ్ల నిర్మాణంతో పాటు పార్క్ నిర్మాణానికి వచ్చే మాసంలో శంకుస్థాపన చేస్తామన్నారు. ఈ సమావేశంలో కనగల్ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లానాయకులు ప్రశాంత్, రమేష్, సుధీర్‌కుమార్, కిన్నెర అంజయ్య, రవి పాల్గొన్నారు.

గెలుపే కమలం లక్ష్యం

ఉద్యమాలతో ప్రజల చెంతకు: బీజేపీ నేత లక్ష్మణ్

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, జనవరి 14: తెలంగాణలో రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా బీజేపీ శ్రేణులు ప్రజాఉద్యమాలతో ముందడుగు వేయనున్నాయని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తెలిపారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు దేశవ్యాప్తంగా మెజార్టీ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తెలంగాణలో సైతం అధికారంలోకి వచ్చేదిశగా 31ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాల్లో పోలింగ్ బూత్ నుండి పార్టీని పటిష్టం చేస్తు గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్ ఎన్నికల వ్యూహాలతో ముందుకెళ్లనున్నామన్నారు. ఈ ఏడాది మొత్తం కూడా టీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజాపోరాటాలను ఉద్ధృతం చేయనున్నామన్నారు. రైతు పోరుబాట సదస్సులను ఈ నెలాఖరు నుండి అన్ని జిల్లాల్లో నిర్వహించడం ద్వారా పల్లె నుండి పార్టీని బలోపేతం చేయనున్నామన్నారు. రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో దళిత అదాలత్‌లు నిర్వహించి కేంద్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమానికి చేపడుతున్న చర్యలతో పాటు టిఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన హామీలను అమలు చేయని వైనాన్ని బిజెపి వివరించనుందన్నారు. రాష్ట్రంలో టీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం కాబోదని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అంతటా ఓడిపోతూ వస్తుందని తెలంగాణలో కూడా మునిగిపోయే నావలా కాంగ్రెస్ సాగుతుందన్నారు. తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదుగుతున్న క్రమంలో ఇటీవల రెండు ఎంపీటీసీ స్థానాలను ఉప ఎన్నికల్లో గెలుపు సాధించామన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద ఐదేళ్లలో ఏటా పది వేల కోట్లు ఖర్చు చేస్తామని చెప్పిన టీఆర్ఎస్ ప్రభుత్వం మూడున్నర ఏళ్లలో అరకొర నిధులు కేటాయించి 40శాతం కూడా ఖర్చు చేయకుండా ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను పక్కదారి పట్టించిందన్నారు. దళితుడిని సీఎం చేస్తానని చెప్పి చేయకపోగా గత డిప్యూటీ సీఎంను తొలగించిన కెసిఆర్ ప్రభుత్వం దళితులకు మూడెకరాల భూపంపిణీలోనూ మోసం చేసిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ స్టాండప్ ఇండియా పేరిట మూడున్నర ఏళ్లలో ఎస్సీ, ఎస్టీ మహిళల కోసం 48వేల మందిని పారిశ్రామికవేత్తలుగా మార్చారన్నారు. అంబేద్కర్ వినియోగించిన భవనాలను స్ఫూర్తి కేంద్రాలుగా మోదీ ప్రభుత్వం తీర్చిదిద్ది అంబేద్కర్ భావజాలాన్ని విస్తృతం చేస్తుందన్నారు. కాంగ్రెస్ మాత్రం గతంలో అంబేద్కర్‌ను పార్లమెంట్‌లోకి రాకుండా రెండు పర్యాయాలు ఓడించిందన్నారు. దళితులను ఓటు బ్యాంకులుగా వాడుకున్న కాంగ్రెస్ ఇన్నాళ్లుగా వారి సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. సీఎం కెసిఆర్ ప్రకటించినట్టుగా లక్షా 12వేల ఉద్యోగాల భర్తీ హామీ అమలుకు బీజేపీ, బీజేవైఎంలు పోరాడుతాయన్నారు. బీసీ, ఎంబీసీలను, ఎస్సీ, ఎస్టీలను ఓటు బ్యాంకులుగా చూసే సంస్కృతిని టీఆర్ఎస్ సైతం అనుసరిస్తూ కాంగ్రెస్ బాటలోనే సాగుతుందన్నారు.



నల్లగొండలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత లక్ష్మణ్

మంత్రి నాయిని, ఎమ్మెల్యే శ్రీనివాస్‌గౌడ్‌లు నేడు టిఆర్ఎస్ మంత్రివర్గంలో తెలంగాణ ద్రోహులున్నారంటూ చేసిన వ్యాఖ్యలు ప్రజల మనోభావాలకు అద్దం పట్టాయన్నారు. ఈ వ్యాఖ్యలను సీరియస్‌గా పట్టించుకోవద్దంటూ ఉద్యమ పార్టీ, రాజకీయ పార్టీలు వేర్వేరు అంటూ ఎంపి గుత్తా సుఖేందర్‌రెడ్డి చెప్పడం అనైతికమన్నారు. త్యాగాలు ఒకరివైతే భోగాలు ఇంకొకరి వన్నట్టుగా టీఆర్ఎస్ ప్రభుత్వం కొనసాగుతోందన్నారు. సుప్రీంకోర్టు జడ్జీ లు ఉన్నత న్యాయస్థానం పనితీరుపై బహిరంగంగా అసం తృప్తి వెళ్లగక్కిన వివాదంతో బీజేపీకి గాని, నరేంద్రమోదీకి, అమిత్‌షాకుగాని సంబం ధం లేదన్నారు. సీపీఐ నేత నారాయణ ఈ వివాదానికి రాజకీయ రంగు పులిమి బిజెపిపై బురద చల్లే ప్రయత్నం చేయడం అనుచితమన్నారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబమూర్తి, మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నరసింహారెడ్డి, చంద్రశేఖర్, కరుణ, రాములు ఉన్నారు.

చిరుతపులి దాడిలో యువకుడికి
తీవ్ర గాయాలు



గాయపడ్డ యువకుడు

ఖానాపూర్ రూరల్, జనవరి 14: నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని ఆక్టోని మాడ ఆదివాసి గూడెంలో చిరుతపులి ఓ యువకుడిపై దాడిచేసి తీవ్ర గాయాలు చేయడం కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. పెంబి గ్రామానికి చెందిన హామ్లెట్ విలేజ్ ఆక్టోని మాడ గ్రామానికి చెందిన ఆత్రం సంతోష్ ఆదివారం ఉదయం 6 గంటలకు దార్గుల ఒర్రెలో యువకులు చేనుల్లోకి వెళ్తుండగా గట్టుపక్క నుండి వస్తున్న చిరుతపులి ముందుగా వెళ్తున్న ఆత్రం సంతోష్‌పై దాడిచేసింది. సంతోష్ రెండు తొడలపై పులి పంజాతో గాయపర్చింది. ఆయన అరుపులకు చేలో పనిచేసేస్తున్న వారందరూ అరుస్తూ రావడంతో చిరుపతపులి గుట్టపక్కనున్న బొరియలోకి వెళ్లింది. గాయపడిన సంతోష్‌ను పెంబి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమచికిత్స చేయించి రూ.5 వేలను ఎఫ్ఆర్‌వో నాగయ్య అందించారు. క్షతగాత్రునికి మెరుగైన వైద్యం కోసం నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సంతోష్‌కు ప్రభు త్వం నుండి ఆర్థిక సహాయం అందేలా చూస్తామని పెంబీ ఎఫ్ఆర్‌వో నాగయ్య తెలియజేశారు.

నిరుద్యోగుల జీవితాలతో
ప్రభుత్వం చెలగాటం

- ◆ ఉద్యోగ నియామకాలు చేపట్టాలి
- ◆ 23న నిరుద్యోగ గర్జన
- ◆ బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్



నిరుద్యోగ గర్జన ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న కృష్ణయ్య, బీజేపీ నేత లక్ష్మణ్

నల్లగొండ టౌన్, జనవరి 14: తెలంగాణ ఉద్యమంలో ముందుండి పోరాడిన నిరుద్యోగుల జీవితాలతో టీఆర్‌యస్ ప్రభుత్వం చెలగాటమాడుతుందని బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. ఈ నెల 23న జిల్లా కేంద్రంలో నిర్వహించే నిరుద్యోగ గర్జన ప్రచార రథాన్ని ఆదివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీ ఆర్‌యస్ ప్రభుత్వం లక్షా 20 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించి కనీసం 20వేల ఉద్యోగాలను కూడా నియామకం చేయకపోవడం సిగ్గు చేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ క్యాలెండర్‌ను విడుదల చేసి ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులకు తక్షణమే నోటిఫికేషన్ జారీ చేసి ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వస్తే తమ బతుకులు మారతాయని తెలంగాణ ఉద్యమంలో తమ ప్రాణాలను సైతం అర్పిస్తే నేడు టీఆర్‌యస్ ప్రభుత్వం తుంగలో తొక్కి అమరవీరుల ఆకాంక్షలను నీరుగారుస్తుందని విమర్శించారు. నల్లగొండ జిల్లా కేంద్రం నుండి నిరుద్యోగ గర్జనను ప్రారంభించి రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉద్యోగాల భర్తీ చేసే వరకు నిరుద్యోగ గర్జనలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి ఉద్యోగ నోటిఫికేషన్లు జారీ చేసి నిరుద్యోగుల బతుకులు మారే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ముందే కూసిన 'రాజకీయ పందెం కోళ్లు'!

- జనంలోకి బాబు, జగన్, పవన్ ◆ జన్మభూమి, సర్కారు పథకాలతో సీఎం ◆ పాదయాత్రతో వైకాపా అధినేత
- ◆ వేగం పెంచుతున్న జనసేనాధిపతి ◆ కేంద్ర పథకాల ప్రచారంతో కమల దళం ◆ ఖాతా తెరిచే పోరాటంలో కాంగ్రెస్


మార్తి సుబ్రహ్మణ్యం

అమరావతి, జనవరి 14: పట్నమంతా పల్లెలోనే ఉంది. రాదార్లన్నీ గ్రామాల వైపే పరుగులు పెడుతున్నాయి. జనమంతా పందెం కోళ్లను చూసే పనిలో ఉంటే, ప్రధాన రాజకీయ పార్టీల అధినేతలంతా జనం మధ్యకు వెళ్లేపనిలో పడ్డారు. ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు జన్మభూమి, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో జనంలోకి వెళుతుంటే.. ప్రధాన ప్రతిపక్ష నేత, వైసీపీ అధినేత వైఎస్ జగన్ పాదయాత్రతో జనక్షేత్రంలో దూసుకెళుతున్నారు. ఇప్పటివరకూ జనసామాన్యానికి దూరంగా ఉంటూ అప్పుడప్పుడూ ఉరుములు, మెరుపులతో గర్జిస్తోన్న జనసేనాధిపతి పవన్ ఫుల్‌టైమర్ అవతారమెత్తేందుకు సిద్ధమవుతున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలే ప్రచారాస్త్రంగా చేసుకుని బీజేపీ జనక్షేత్రంలోకి దిగితే, కనీసం ఒక్క చోటయినా జెండా ఎగరేయాలన్న కసితో కాంగ్రెస్ పోరాడుతోంది. ఆ విధంగా ఎన్నికలకు ఇంకా ఏడాది సమయం ఉన్నప్పటికీ 'రాజకీయ పందెం కోళ్లు' మాత్రం అప్పుడే ఓట్ల బరిలోకి దిగాయి. జీడిపప్పు, పిస్తా, బాదంపప్పుతో పందెం కోళ్లు యుద్ధానికి సిద్ధమయితే, రాజకీయ కోళ్లు హామీలు, తాయిలాలు, నిధులు, నినాదాలతో ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధమవుతున్నాయి. కోళ్ల పందేలు, పొట్టేళ్ల పందేలపై జనం దృష్టి పెడితే.. రాజకీయ పార్టీల కోళ్లు మాత్రం కాళ్లకు కత్తులు కట్టుకుని, ఏడాదికి ముందుగానే ఉత్సాహంగా కదన రంగంలోకి దిగుతున్నాయి. సంక్రాంతి నేపథ్యంలో ఏ పార్టీ కోడి ఏం చేస్తుందో, ఎన్నికల నాటికి 'పుంజు'కునేందుకు చేస్తున్న కసరత్తేమిటో ఓసారి చూడాల్సిందే!



ముందే మేల్కొన్న 'తెలుగు' కోడి


నాలుగేళ్లుగా పిస్తా, బాదం, కసరత్తులతో బలిష్టంగా మారిన తెలుగుదేశం పందెం కోడి ఏడాది ముందుగానే ఉత్సాహంగా కూస్తోంది. నంద్యాల, కాకినాడ ఎన్నికలకు ముందు వరకూ మళ్లీ ఎగరడం సందేహంగానే కనిపించిన 'తెలుగు' కోడి.. ఆ బరిలో ప్రత్యర్థి కోడి రెక్కలు విరిచిన తర్వాత నుంచి సమరోత్సాహంతో దుముకుతోంది. నంద్యాల, కాకినాడ బరులు 'తెలుగు' కోడిలో రానున్న ఎన్నికలపై భరోసా నింపాయి. తనపై బెట్టింగ్ కట్టి చప్పట్లు కొట్టే వారితో పాటు, నడిపించే నాయకుడు అనేక యుద్ధాల్లో ఆరితేరిన వాడైనందున 'తెలుగు కోడి' కయ్యానికి కాలు దువ్వుతోంది. పైగా మూడేళ్ల క్రితం నాటి యుద్ధంలో తనపై గెలిచిన సాటి పందెం కోళ్లలో చాలావరకూ ఇప్పుడు తన వైపే ఉండటంతో 'తెలుగు కోడి' మరింత ఉత్సాహంగా కవ్విస్తోంది. కొత్తగా వేస్తున్న పథకాల ఆహారం తనను వచ్చే సంక్రాంతి తర్వాత జరిగే ఎన్నికల్లో బాహుబలిగా నిలబెడుతుందన్న విశ్వాసంతో ముందుకు సాగుతోంది.




కూతలు ఆపి బరిలోకి జనసేన కోడి

జనసేన కోడికి ఈ పందెం పూర్తిగా కొత్త. ఇప్పటిదాకా ఎవరి భుజం మీదనో నిల్చుని కూయడమే తప్ప సొంత బలం నిరూపించుకుంది లేదు. మిగిలిన వారిని బరిలోపి దింపి, తాను చప్పట్లు కొట్టి ప్రోత్సహించే ప్రేక్షక పాత్రకే పరిమితమైన జనసేన కోడి, ఈసారి బరిలోకి దిగేందుకు కాలుదువ్వుతోంది. అందుకే కూతలతో పాటు జనక్షేత్రంలోకి వచ్చిపోతోంది. ఆది నుంచీ అయోమయం నిండిన ఈ కోడి, రానున్న యుద్ధంలో ఎన్ని బరుల్లో నిలుస్తుంది? దాని పోరాట వ్యూహమేమిటో ఇంకా తెలియలేదు. అప్పుడప్పుడూ పొద్దున్నే లేచి కూయడమే తప్ప, సహజసిద్ధంగా రోజూ కూసే అలవాటు లేని జనసేన కోడి ఈసారి తానూ పందెం కోడినవుతానంటోంది. బలమైన పుంజును కాకుండా బలహీనమైన పుంజులతోనే ఇప్పటివరకూ యుద్ధం చేస్తున్న జనసేన కోడి అసలు బలమేమిటో చూడాలి.

ఎగిరీ ఎగరని కమలం కోడి!



అన్ని బరుల్లోనూ ఎగిరి, బలాఢ్యురాలు కావాలన్న కోరిక బాగా ఉన్నా సొంతగా ఎగిరేంత బలం లేని కమలం కోడి ఈసారి కూడా ఎవరో ఒకరి బలంపై ఎక్కువ బరుల్లో దిగాలన్న ఆశతో ఉంది. ఆశ లావు పీక సన్నం మాదిరిగా బక్కపలచగా ఉన్నప్పటికీ పిస్తా, జీడిపప్పు, బాదంపప్పుతో బలంగా ఉన్న పందెం కోళ్లతో తనను తాను ఊహించుకోవడమే కాదు.. బరులు ప్రతిధ్వనించేలా తొడగొట్టి సవాలు చేస్తోంది. ఎగిరీ ఎగరని బలంతో ఉన్న కమలం కోడి కేంద్ర పథకాలనే ఎక్కువగా కూస్తోంది. తన ప్రదర్శనకు చప్పట్లు కొట్టే వారి సంఖ్య లేకున్నా, బలమైన పుంజులున్నప్పటికీ వాటిని బరిలోకి దిగనీయని ఢిల్లీ యజమాని అయోమయం, అసలు తన పోరాటం ఎలా ఉండాలో తనకే తెలియని గందరగోళంతో బీజేపీ కోడి బరి వైపు ఆశగా చూస్తోంది.



ఖాతా కోసం కాంగ్రెస్ కోడి కష్టాలు!

మూడు పందెం కోళ్లు ఎన్నికల బరిలోకి దిగేందుకు కావలసిన అస్త్రశస్త్రాలు తమ అమ్ములపొదిలో సమకూర్చుకుంటుండగా, పాపం గత యుద్ధంలో ప్రత్యర్థి కోళ్ల కత్తుల దాడితో క్షతగాత్రురాలయి ఇంకా కోలుకోని కాంగ్రెస్ కోడి, కనీసం ఒక్క బరినయినా సొంతం చేసుకుని ఖాతా తెరవాలన్న ఆరాటంతో ఉంది. కష్టాలకు కేరాఫ్ అడ్రసుగా మారిన తన పోరాటంలో చివరివరకూ నిలిచి, అందులో ఎంతమంది బరిలోకి దిగుతారో తనకే తెలియని అయోమయంలో చిక్కి వుంది. బరిలోకి బలవంతంగా దింపాలనుకున్నా ఒక్క పందెం కోడీ దొరకని దయనీయ స్థితిని ఎదుర్కొంటోంది. తనతో మొన్నటివరకూ ఉన్న బలిష్టమైన కోళ్లన్నీ శత్రు శిబిరాల్లోకి ఎగిరిపోతే, మిగిలిపోయిన బక్కపలచని కోళ్లతోనే యుద్ధానికి సిద్ధమవుతోంది.



పోరాడుతున్న వైసీపీ కో'ఢీ'!

చప్పట్లు కొట్టే వారి సంఖ్య తక్కువైనప్పటికీ.. మూడేళ్ల క్రితం తనతో ప్రత్యర్థులపై తొడకొట్టి పోరాడిన సహచర కోళ్లు శత్రు శిబిరానికి ఎగిరిపోయినప్పటికీ ఏమాత్రం నిరుత్సాహపడకుండా వైసీపీ కోడి తొడగొట్టి పోరాడుతోంది. ప్రత్యర్థి తెలుగుకోడి మాటలు, కూతలకు ఏమాత్రం తీసిపోకుండా కాళ్లకు కత్తులు కట్టుకుని తెలుగు కోడిపై కదనానికి కాలు దువ్వుతోంది. పాదయాత్రలతో అలిసిపోకుండా, అదే ఆయుధంగా 'పుంజు'కునేందుకు వైసీపీ పందెం కోడి ఎదురుదాడికి సిద్ధమవుతోంది. ఈసారి మరింత శక్తిని కూడగట్టుకుని మూడేళ్ల క్రితం తానోడిన బరిలోనే తెలుగు కోడిని మట్టికరిపించేందుకు కసరత్తు చేస్తోంది. పోరుబాటలో గతంలో చేసిన పొరపాట్లను దొర్లనీయకుండా ఈసారి కొత్త వ్యూహాలతో వైసీపీ కోడి సమాయత్తమవుతోంది.

ఆంధ్రభూమి
జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ
సోమవారం, 15 జనవరి 2018

వెలుగుల విప్లవం..

సృష్టిగత 'ప్రస్థాన క్రమం'లో సంవత్సరానికోసారి సంభవించే పునరావృత్తి మకర సంక్రాంతి, వెలుగుల విక్రాంతి! కాంతి పథంలో నిరంతరం క్రాంతి సంభవిస్తోంది, భూమి నుండి దర్శించినప్పుడు సాపేక్షం - రిలెటివ్ - గా ఈ 'ఖగోళ క్రాంతి' నెలకోమారు మరింతగా ప్రస్ఫుటిస్తోంది. అందువల్ల, భూమి సూర్యుని చుట్టూ తిరగడం వల్ల, పన్నెండు నెలలలో పన్నెండు సంక్రాంతులు సంభవిస్తున్నాయి! మేష సంక్రాంతి నుంచి మీన సంక్రాంతి వరకు పన్నెండు సంక్రాంతులు ప్రతి సంవత్సరం సంభవిస్తున్నాయి! సృష్టిగత వాస్తవాలు సమాజస్థిత జీవనంగా సహజ వికాసాన్ని సంతరించుకొనడం అనాదిగా భారతజాతి చరిత్ర, ప్రపంచ చరిత్ర, విశ్వవ్యవస్థ.. సృష్టి, సమాజం వేఱువేఱుకాదు. సృష్టిలో సమాజం అవిభాజ్యం అంతర్‌భాగం! ఈ వాస్తవ ధ్యాస ఉన్న భారతజాతి లేదా హైందవజాతి పన్నెండు సంక్రాంతులను గుర్తించగలిగింది! మకర సంక్రాంతి నుంచి కర్కాటక సంక్రాంతి వరకు ఆరునెలల పాటు భూమి మీద ఉత్తరార్ధ గోళంలో పగటి నిడివి పెరుగుతుంది. రాత్రి నిడివి తగ్గుతుంది! దక్షిణార్ధ గోళంలో దీనికి వ్యతిరేకంగా పగటి నిడివి తగ్గి, రాత్రి నిడివి పెరుగుతుంది! కర్కాటక సంక్రాంతి నుంచి మకర సంక్రాంతి వరకు ఆరునెలల పాటు ఉత్తరార్ధ గోళంలో పగటికాల వ్యవధి క్రమంగా తగ్గింది. రాత్రి వ్యవధి పెరిగింది, గత ఆరు నెలలుగా మన దేశంలోవారికి ఉత్తరార్ధ గోళంలోని ఇతర దేశాల వారికి ఇది ప్రత్యక్ష అనుభవం. ఇదే ఆరునెలలలో దక్షిణార్ధ గోళంలో పగటి నిడివి పెరగడం, రాత్రి సమయం తగ్గడం కూడ ప్రత్యక్ష అనుభవం! మకర సంక్రాంతితో ఉత్తరార్ధ గోళంలో మళ్లీ పగటి నిడివి పెరగడం ఆరునెలలు కొనసాగుతుంది.

పగలు వెలుగునకు ప్రతీక, వెలుగు ప్రగతి, వెలుగు సుగతి... రాత్రి చీకటికి ప్రతీక! అందువల్ల వెలుగును కోరే, వెలుగును పూజించే, వెలుగును పెంచే, వెలుగును పంచే భారతీయులు వెలుగు పెరగడానికి ఖగోళ మాధ్యమమైన 'మకర సంక్రాంతి'ని ఉత్సవంగా జరుపుకుంటున్నారు. ఉత్తరార్ధ గోళంలో ఆరునెలల పాటు 'వెలుగు' పెరగడానికి శ్రీకారం మకర సంక్రాంతి.. అందువల్ల వెలుగును కాంక్షించే ఉత్తరార్ధ గోళంలోని ప్రజలందరూ మకర సంక్రాంతిని 'వెలుగుల పండుగ'గా వేడుక చేసుకోవాలి! చేసుకుంటున్న భారతీయులు అనాదిగా ఈ సృష్టిగత సనాతన వాస్తవాన్ని గుర్తించినవారు! పన్నెండు సంక్రాంతులు మానవ లోకానికి సమన్వయం అవుతున్న, వర్తిస్తున్న ఖగోళ వృత్తంపై పన్నెండు శాశ్వత క్రాంతులు... ఏడాదికోసారి పునరావృత్తమౌతున్న కాలచక్రానికి ప్రతీకలు! క్రాంతి విప్లవం, క్రాంతి పరివర్తనం! మకర సంక్రాంతి మహాకాంతుల పరివర్తనం..

అంతరిక్షంలో అసంఖ్యాక నక్షత్రాలు - స్టార్స్ - నక్షత్ర సముదాయ బ్రహ్మాండాలు - గెలాక్సీలు - విస్తరించి ఉన్నాయి. ఇదంతా విశ్వవ్యవస్థ - కాస్మిక్ ఆర్డర్ - ఆద్యంత రహిత తత్త్వం! భూమితోను సౌరకుటుంబంతోను క్రమపద్ధతిలో అనుసంధానమై ఉన్న ఇరవై ఏడు 'నక్షత్రాల'ను భారతీయులు అనాదిగా గుర్తించారు! ఈ నక్షత్రాలు భూమధ్య రేఖకు అటూఇటూ నిర్దిష్టమైన అంతరిక్ష కక్ష్యలలో విస్తరించి ఉన్నాయి. భూమి భ్రమణంవల్ల సాపేక్షంగా ఈ ఇరవై ఏడు నక్షత్రాలు దాదాపు యాబయి మూడు నిముషాల వ్యవధిలో ప్రతి రోజు ఉదయించి అస్తమిస్తున్నాయి. ఇవి 'అశ్వని' నుంచి 'రేవతి' వరకు ఉన్న నక్షత్రాలు! అంటే అశ్వని నక్షత్రం ఉదయించిన తరువాత దాదాపు యాబయి మూడు నిమిషాలకు భరణి నక్షత్రం ఉదయిస్తోంది. ఇలాగే రేవతి వరకు అన్ని నక్షత్రాలు... భూమి పరిభ్రమణంవల్ల 'సాపేక్షం'గా సూర్యుడు ప్రతి నక్షత్రంతో కలిసి పదమూడు లేదా పదునాలుగు రోజులపాటు ఉదయించినట్టు దృశ్యమానం అవుతోంది. ఇలా సూర్యుడు ఇరవై ఏడు నక్షత్రాలతోను కలిసి ఉదయించడం పూర్తయ్యేసరికి ఒక 'సౌరమాన' సంవత్సరం పూర్తవుతోంది! ఇవే ఇరవై ఏడు కార్తెలు! అశ్వని నక్షత్రంతో కలసి సూర్యుడు ఉదయించడం ఆరంభమైతే అది అశ్వని కార్తె ఆరంభం. మృగశిర నక్షత్రంతో కలసి సూర్యుడు ఉదయించినప్పుడు 'మృగశిర' కార్తె! ఈ 'కార్తె'లు గురించి వ్యవసాయదారులకు బాగా తెలుసు!

సౌలభ్యం కోసం ఇరవై ఏడు నక్షత్రాలను పన్నెండు 'రాసు'లుగా వ్యవస్థీకరించడం కూడ ఖగోళ వాస్తవానికి అనుగుణం! అందువల్ల రెండు నక్షత్రాలు మరో పాతిక నక్షత్రం కలసి ఒక 'రాసి' ఏర్పడింది. ఇరవై ఏడు 'నాలుగు'లు నూట ఎనిమిది. పన్నెండు 'తొమ్మిదులు' నూట ఎనిమిది! ఇదీ ఖగోళ వ్యవస్థ. ఇలా పన్నెండు 'రాసు'లు భూమధ్య రేఖకు అటూఇటూ సగంసగం విస్తరించి ఉన్నాయి. దక్షిణ భాగంలో చివరిది మకర రాసి, అదే 'మకర' రేఖ - 'కాప్రికార్న్ -! ఉత్తరభాగంలో చివరిది 'కర్కట' రాసి, ఇదే కర్కాటక రేఖ - కాన్సర్ -! నక్షత్రాలు 'రాసు'లుగా ఏర్పడినందున ప్రతి 'రాసి' భూమిపై - రిలెటివ్‌గా - ప్రతిరోజు ఉదయించి అస్తమిస్తోంది! అందువల్ల సూర్యుడు ఒక రాసితో కలిసి నెల రోజులపాటు ఉదయిస్తున్నట్లు భూమి మీద దృశ్యమానం అవుతోంది. అంటే ఆ 'రాసి' ఉదయిస్తున్న సమయంలోనే సూర్యుడు ఉదయిస్తున్నాడు. అలా ఉదయించడం ఆరంభమయ్యే రోజు 'సంక్రాంతి'.. మేషరాసితో కలిసి సూర్యుడు ఉదయించడం ఆరంభం కాగానే 'మేష' సంక్రాంతి ఏర్పడుతోంది. 'సౌరమానం' పాటించే తమిళనాడు వంటి చోట్ల మేష సంక్రాంతి నూతన సంవత్సరాది! నెల తరువాత 'సాపేక్షం'గా 'రాసి' ముందుకెళ్లిపోతోంది, రెండవ రాసి 'వృషభం' వచ్చి సూర్యునితో కలిసి ఉదయించడం మొదలవుతోంది. ఇలా ప్రతి సంక్రాంతి నాడు 'రాసి' ముందుకెళ్లి మరొక రాసి వచ్చి సూర్యునితో కలుస్తోంది... ఉదయంలో! ఇదంతా సంవత్సరానికోసారి పునరావృత్తి! ఇలా మకర 'రాసి'తో కలిసి సూర్యుడు ఉదయించడం ఆరంభమైన సమయం మకర 'సంక్రమణం'! దూరంగా మకర రేఖపై ఉదయించిన సూర్యుడు మకర, కుంభ, మీన, మేష, వృషభ, మిథున రాసులతో కలిసి ఉదయిస్తూ ఆరునెలలపాటు ఉత్తరంగా 'జరగడం' వల్ల ఈ ఉత్తరాయణంలో ఉత్తరార్ధ గోళంలో వెలుగు పెరుగుతుంది. ఉత్తరార్ధ గోళంలో చివరన - మన మధ్యప్రదేశ్ గగనంలో - ఉన్న 'కర్కట' రాసిని సూర్యుడు చేరే వరకు వెలుగు విస్తరిస్తూనే ఉంటుంది. పగటి నిడివి పెరుగుతూనే ఉంటుంది!

ఇలా మకర సంక్రాంతి మానవులు కల్పించుకున్న 'కృత్రిమ' ఉత్సవం కాదు, సర్వమత సర్వభాషా సర్వ దేశస్థులకు ఉత్తరార్ధ గోళంలో ప్రస్ఫుటిస్తున్న సనాతన క్రాంతి దృశ్యం... కాంతిని పెంచే విప్లవం! చీకటి తగ్గిపోనున్నది. సమస్యలు చీకటులు... పరిష్కారాలు వెలుగులు, వైరుధ్యాలు చీకటులు.. సమన్వయం వెలుగుల వలయం! ఆర్థిక, రాజకీయ, న్యాయపాలన, సామాజిక పరిధులలో చొరబడిపోతున్న చీకటులను తొలగించడానికి వెలుగులు నడుం బిగించడం మకర సంక్రాంతి, భౌతిక, బౌద్ధిక, ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక క్షేత్రాలను ఆవహించి ఉన్న వైరుధ్యం గ్రహణ విముక్తి మధుర విక్రాంతి! గ్రహాలు, నక్షత్రాలు, 'రాసులు', బ్రహ్మాండాల మధ్య వైవిధ్య స్వరూపాల మధ్య, వైరుధ్యంలేని సమన్వయం నెలకొని ఉండడం సృష్టి ప్రస్థాన క్రమం, వైవిధ్య స్వరూపాల మధ్య అద్వితీయ స్వభావం ఇది. భారత జాతీయ జీవనం అనాదిగా ఈ సృష్టి ప్రస్థాన క్రమానికి అద్దం.. మకర సంక్రాంతి ఈ అద్దంలో భాసిస్తున్న శుభంకర దృశ్యం!

అధికారమే అసలు లక్ష్యం

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనేది పాత సామెత. ఎన్నికలప్పుడే ఇంత వెనుకేసుకుని చక్కదిద్దుకోవాలనేది నేటి రాజకీయ సామెత! అరవై నెలలు పాలించడానికి ఎన్నికైన పాలకులు ఏడాది ముందునుంచే ఎన్నికలకు సిద్ధం కావడం, అవకాశాన్నిబట్టి ముందస్తు ఎన్నికలకు వెళ్లడం పార్లమెంటరీ రాజకీయాలకు మామూలైపోయింది. ఇక కేంద్రంలో పాలన సాగించే పార్టీకైతే ఈ అయిదు సంత్సరాలు ఏదో ఒక రాష్ట్రం ఎన్నికల నినాదంగా ఉంటుంది. ఆ రాష్ట్రాలు అప్పటికే తమ చేతుల్లో వున్నవి కావచ్చు, లేదా కొత్తగా అధికారంలోకి వచ్చే ప్రయత్నం కావచ్చు! ముందు చేతిలో వున్న రాష్ట్రాన్ని చేజారకుండా చూసుకోవడం ఒక ఎత్తు అయితే, కొత్త రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీని చిత్తు చేయాలనే, ఎత్తుగడ రెండోది. జయాపజయాల్ని పక్కనబెడితే, చేతిలోని రాష్ట్రంలో ఓట్ల సంఖ్య, సీట్ల సంఖ్య తగ్గినా అధికార పార్టీకి అవమానమే! మొన్నటి గుజరాత్ ఎన్నికలు దీనికి ఉదాహరణ. ఓట్ల సరళి పెరిగినా, సీట్ల సంఖ్య తగ్గడాన్ని మోదీ, షాలు అంతర్గతంగా పరాభవంగానే భావిస్తున్నారు. అధికారంలోకి రావడం అసాధ్యమైనా, యువరాజు నాయకత్వంలో కాంగ్రెసుకు సీట్లు పెరగడంతో తామే గెలిచినంత సంబరంగా ఉంది.



అయితే, 2014 నాటికి సాధారణ ఎన్నికల నాటి ఎజెండాకు, 2012నాటి గుజరాత్ ఎన్నికల ఎజెండాకు ఇరుపార్టీల్లో మార్పు ఏమైనా ఉందా? అనేది తేలదు. అది ఇరు పార్టీలకు పట్టని అంశంగానే ఉంటున్నది. ఈ ఎన్నికల సరళిని చూసినప్పుడు ఎవరికి వారే విజయం సాధించామనుకుంటున్నారు. గానీ, తమను 50 శాతం పైగా ప్రజలు వ్యతిరేకిస్తున్నారని భావించడం లేదు. భక్తితోనో, భయానికో పోలింగ్ కేంద్రానికి వచ్చి ఎవరికి వోటు వేయక 'నోటా'కు వేసినవారు, అసలు ఓటే వేయనివారు దాదాపు ఒకే ఆలోచన కలిగివున్నట్లే. గుజరాత్‌లో అయిదు లక్షలకు పైగా పడిన 'నోటా' వోట్లు ఏ పార్టీ అభ్యర్థికి పడినా పార్టీల సంఖ్యాబలంలో అనూహ్యమైన మార్పు కనపడేది. పాలకపక్షం ప్రతిపక్షంగా మారిపోయినా ఆశ్చర్యం ఉండేది కాదు. కానీ, ఈ అంశాన్ని ఇరు రాజకీయ పార్టీలుగాని, వీటికి తోకలుగా వ్యవహరిస్తున్న జాతీయ పార్టీలుగానీ పట్టించుకోకపోవడమే విచారకరం. పోతే, 'నోటా' ఓట్లు అభ్యర్థులు జాతకాల్నే మార్చే ప్రమాదం ఉందనే హెచ్చరికలను ఇవి చూపిస్తున్నాయి. ఇదే గుబులు నేడు రాజకీయ పార్టీలకు పట్టుకున్నది. తమిళనాడులో ఆమె మరణం తరువాత జయలలిత ప్రాతినిధ్యం వహించిన శాసనసభ నియోజికవర్గానికి జరిగిన ఉప ఎన్నికల్లో అందరి ఊహల్ని తలకిందులు చేసి, నిలువెత్తు ఆరోపణలను ఎదుర్కొంటున్న శశికళ వర్గానికి చెందిన వ్యక్తి గెలవడం పన్నీరు సెల్వం, పళనికి గొంతులో వెలక్కాయ పడ్డట్టయింది. అందుకే ఎన్నికల రొంపి అంతా తాయిలాలతోనే వేడెక్కడం చూస్తున్నాం. ఈ ఉపఎన్నికలో ఓటర్లకు వేలల్లో కాదు, లక్షల్లో డబ్బు పంపిణీ జరిగిందనేది బహిరంగమే. బహుశా ఈ నేపథ్యంలోనే రజనీకాంత్‌ను రాజకీయ ఆరంగేట్రం చేయించి వుంటారనేది మరో వాదన! దేవుడే తనకు ఆదేశం ఇచ్చాడని ప్రవచించిన రజనీ, డిఎంకె అధినేతను కలవడం మరో విచిత్రం!

దాదాపు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల పరిస్థితి ఇదే. అటు బాబుకు, ఇటు కేసీఆర్‌కు నిద్రపడుతున్న రాత్రులు తక్కువే! తమ నీడను తామే నమ్మలేని రాజకీయ వ్యవస్థలో ఓటర్లను నమ్మే ఆలోచన ఏనాడో ఆవిరైపోయింది. ఆకర్షణీయ పథకాలే అండ అని భావించినా, అంతరంగంలో ఏదో మూల నేటి పాలకులకు భయం కెలుకుతూనే ఉంది. ఈ దృక్కోణంతోనే కావచ్చు, ఇద్దరు ముఖ్యమంత్రులు శత్రుశేషం లేకుండా ఎత్తుగడలు వేస్తున్నారు. సహజంగా, రాజకీయ పార్టీలు అంతర్గత శత్రు నిర్మూలనా ఎజెండాను కలిగి ఉంటాయి. కాని, ఇందిర హయాం తర్వాత, ఈ ఎజెండా మారిపోయింది. అసెంబ్లీ, పార్లమెంటుల్లో బల నిరూపణే ప్రజాస్వామ్య విజయంగా భావిస్తున్నారు. సొంత పార్టీలో అస్మదీయులను ఎదగకుండా చేసి, కోరలుపీకడం, ఒకవేళ పార్టీ వీడినా, బుసకొట్టడం తప్ప కాటువేయకుండా రాజకీయ వ్యవస్థల్ని తయారు చేస్తున్నారు. పార్టీల జంప్ జిలానీలకు, పార్టీలో ఉంటూనే ఊపిరి పీల్చలేనివారు ఇదో అనారోగ్య ప్రజాస్వామ్య చిహ్నమని గుర్తించలేకపోతున్నారు.

అధికార పార్టీల తీరు ఈ విధంగా ఉంటే, ప్రతిపక్షాలది మూలిగే నక్కలాంటి నినాదమే! అధికారంలోకి వస్తే విద్యార్థులందరికీ ఇంజనీర్లుగా, డాక్టర్లుగా విద్య చెప్పిస్తానంటాడు వైఎస్‌ఆర్‌సిపీ నేత జగన్. ఓదార్పు పేర చేస్తున్న పాదయాత్రలో చంద్రబాబుపై నిప్పులు చెరగుతాడు. కానీ, నిజంగా అధికారంలోకి వస్తే రైతు సమస్యల్ని ఎలా పరిష్కరిస్తాడో, వ్యవసాయ రంగాన్ని ఎలా నడుపుతాడో విధివిధానాలేంటో స్పష్టత ఉండదు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ఏ విధంగా కల్పిస్తాడో మాట్లాడడు. విద్యావైద్య రంగాల నిర్వహణపై, వీటిని అజమాయిషీ చేస్తున్న కార్పొరేట్ వ్యవస్థ గూర్చి స్పందించడు. ప్రభుత్వ సిబ్బంది ప్రజావ్యతిరేకతగూర్చి, జరుగుతున్న అవినీతి గూర్చి సదరు పార్టీ సిద్ధాంతమేంటో అంతుపట్టదు. ఇక రాజధాని నిర్మాణంపై దోబూచులాటలే! అయ్యో, తాము అధికారంలోకి వస్తే లక్షల కోట్ల నిర్మాణ కాంట్రాక్టులు దక్కేవనే అంతర్గత ఆవేదనేగాని, ఈ నిర్మాణాలతో బంగారం పండే భూములు సమిధగా మారాయనే బాధ, బాధ్యత ఎప్పుడూ వ్యక్తం కాదు. నిజంగా అధికారంలోకి వస్తే తమ ఎజెండా ఏమిటో ఎవరికీ బోధపడదు. ఏ పార్టీకీ దూరదృష్టితోగల శాశ్వత అభివృద్ధికర ఎజెండా వుండదు. అందరిదీ ఎన్నికల సందర్భంలో, అదీ ఎన్నికల తేదీలు ప్రకటించిన తరువాత ఆదరాబాదరాగా ముందుకు తెస్తారు. నెహ్రూ హయాం నుంచి నేటి మోదీ వరకూ ఏ రాజకీయ పార్టీ ఎజెండా అయినా జనబాహుళ్య చర్చ జరగలేదు. అసలు ఇది జరగాలన్న సోయి పార్టీలకు లేకపోగా, ప్రజలకు తెలియదే తెలియదు. ఇక ఎన్నికల సంఘానిది కరివేపాకు (శేషన్ హయాం మినహా) పాత్రయే! ఎన్నికల ముందు వివిధ పార్టీలు హామీలు ఇవ్వడం, గెలిచినంక కర్రలతో కొట్టడం జరుగుతున్నది. జాతీయ పార్టీలది ఎప్పుడు ప్రాంతీయ పార్టీల స్థాయి ఆలోచనలే. అధికారం చేజిక్కించుకోవడమే పరమావధిగా భావించడం, స్థానిక పాలక పార్టీ ఇస్తున్న, చేస్తున్న అనారోగ్యకర హామీలనే మరికొంత మసాలా కలిపి ప్రకటించడం జరుగుతున్నది తప్ప, శాశ్వత నినాదం ఏనాడూ వినపడడం లేదు. అధికారంలోకి వస్తే నిరుద్యోగులకు మూడువేల రూపాయల భృతిని ఇస్తామని, రెండు లక్షల రూపాల వరకు రైతు రుణాల్ని మాఫీ చేస్తామని ఉత్తమకుమార్ రెడ్డి అప్పుడే ఎన్నికల శంఖారావం ఊదుతున్నాడు. అంటే నిరుద్యోగ సమస్యకు తెరొసనే కాదు, తాముకూడా పరిష్కారం చూపలేమనేది, రైతు సమస్యలు ఎల్లకాలాల్లో అప్పులతో, ఆత్మహత్యలతో విరాజిల్లుతాయనేది వీరి ఆత్మ ఘోష అన్నమాట! తెలంగాణ ఇస్తిమి - శ్మశానంగా మారినంక! అధికారంలోకి రాకపోతిమి అంటూ చేతులు కాలిన తరువాత ఆకుల ప్రత్యామ్నాంలా, అసలు పాలన ఎలా జరుగుతున్నది, ప్రభుత్వరంగ సంస్థల పరిస్థితి ఏంటి? నిజంగా తాము అధికారంలోకి వస్తే గతంలో సాగించినట్లే పాలన సాగిస్తారా? బుద్ధి తెచ్చుకొని చెంపలు వేసుకుంటారా అనేది ఏ కోశానా కనిపించదు. విద్యను ఏ విధంగా నిర్వహిస్తారో, కార్పొరేట్‌ను నిజంగానే నియంత్రిస్తారా? వైద్యరంగం రాష్ట్ర ప్రజలందరికీ ఒకే తీరుగా అందుబాటులోకి వస్తుందా అన్నది చెప్పరు. జవాబుదారీతనంతో, సిటిజన్ చార్టర్ అమలు చేస్తూ, అవినీతికి తావులేకుండా పాలన అందిస్తామని, గిరిజన ఆవాసప్రాంత ప్రజలకు, వారి ఉనికికి భంగం కలగకుండా పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని, పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా, ప్రాజెక్టుల పేరున బలవంతంగా భూమి లాక్కోమని హామీ ఇస్తున్నారా? ఇప్పటికే సేకరణ పేరుతో లాక్కున్న భూమి విషయంలో ఎలాంటి దృక్పథాన్ని కలిగివుంటారో ఎవరికీ తెలియదు. అయ్యో, మాకు దోచుకునే అవకాశం పోయిందనే బాధతప్ప, ప్రజలకు నిజంగా సేవలందించి, అప్పులేని రాష్ట్రంగా, దేశంగా... ఆకలిలేని రాజ్యంగా, నైతికతతో విరాజిల్లే సమాజంగా ఇంటాబయటా యువతులు, మహిళలు ఊపిరిపీల్చుకునే స్వేచ్ఛను అందిస్తామనే హామీ ఎక్కడా వినపడదు.

పాలకపక్షం కురిపిస్తున్న వరాలజల్లుల్లో శాస్త్రీయత ఎంత? అవసరమెంత? ఎవరికి అవసరం? నిజంగా ఈ హామీలు అసలైన లబ్ధిదారులకు చెందుతాయా? అనే పట్టింపు లేదు. మరో రూపంలో ఇలాంటి జనరంజక పథకాల్నే అందిస్తాననడంలోని ఆంతర్యం తమకు కొంతకాలం దోచుకునే అవకాశం ఇవ్వాలనే! ప్రధాన రాజకీయ పార్టీలు తమ తీరు ఈ విధంగా ఉంటే రాజకీయాలతో లబ్ధిపొందాలనుకునేవారు, పాలకపార్టీతో విభేదాలు పొడసూపినవారు, తమకు గుర్తింపేలేదని భావిస్తున్న కొంతమంది సృజనశీలురు ఎవరి కుంపటిని వారే అప్పుడే మొదలుపెట్టారు. అందరివి పెదవి దాటిరాని మాటలే! ఎజెండాలేని పార్టీలే! టీవీ చానళ్లను పెట్టడం చాలా సులభమని, అదే ఓ పత్రికను నడపడం సాహసమని, ఈ మధ్యన మీడియా మేధావులు అంటున్నట్లు, రాజకీయ పార్టీ పెట్టడం ఇంకా సులువైన పనిగా కనపడుతున్నది. సిద్ధాంతమంటూ లేకుండా, లక్ష్యాలేమిటో నిర్దేశించుకోకుండా, రాజకీయ, సామాజిక పరిస్థితుల్ని తులనాత్మకంగా విశ్లేషించుకోకుండా, సమాజాన్ని ఎటువైపుగా అభివృద్ధి చేయాలో తెలియకుండా రాజకీయ పార్టీలు వ్యవహరిస్తున్నాయి. అంతర్గత, అమెరికా అనుకూల ఎజెండా గురించి తమ వైఖరి ఏమిటో ప్రస్తావించడం లేదు. ఏడుదశాబ్దాలుగా జరిగిన అభివృద్ధి గూర్చి, వాటి తీరుతెన్నులగూర్చి, ఉపయోగం గూర్చి, సాధికారత గురించి నోరు విప్పకుండా తాము అధికారంలోకి వస్తేనే దేశం దిశ,దశ మారుతుందని కూడబలకడం, నమ్మబలకడం అంటేనే దివాలాకోరు రాజకీయాలు. అనుకున్నంత సులభంగా ప్రజలు మెడలు వంచరు అనేది జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన కాలం నుంచి చూస్తూనే ఉన్నాం. బళ్లు ఓడలైనా, ఓడలు బళ్లయినా ఇంకా వీటిని ప్రజలే లాగడం గమనార్హం!

- డా. జి.లచ్చయ్య | సెల్: 94401 16162

జైలు కష్టాలు.. లాలూ విన్నపాలు!

ముక్కు కోస్తూ వుంటే రక్తం తాగే మొండి ఘటాలు మనకి సామెతల్లోనే కానవస్తారు అనుకోకండి- ఇలలో కూడా వుంటారు. శ్రీమాన్ లల్లూ ప్రసాద్ యాదవ్- బీహార్ మాజీ ముఖ్యమంత్రి ఆర్‌జెడి చీఫ్‌కి మూడున్నర ఏండ్ల జైలుశిక్ష- పది లక్షల జరిమానా పడగానే కథ ముగియలేదు. ఇంకా రెండు కేసులు ఉన్నాయి.. ఎప్పుడో ఇరవై ఏండ్లనాడు తినేసిన పశుగ్రాస నిధుల గురించి ఇవాళ బాధ ఏముంటుంది? అరిగిపోయేయిగా.. ఆ తరువాత కేసుదారిది దానిదే- 'మహానాయకుల'కు జీవితంలో దూషణ భూషణ తిరస్కారాదులు పరిగణనలోనికి రావు. జయిలైనా బెయిలయినా- వాళ్లు కర్తవ్యమ్ వదిలిపోరు. తనను నమ్ముకున్న పార్టీ- దాని అనుయాయులు వీళ్లే లాలూజీకి ప్రజలు. వాళ్లు తమ నాయకుడు జైల్లో పడ్డా 'చెడ్డవాడు' కాడు పడ్డవాడే అని, ఆఫ్టరాల్ తిన్నది పశుగ్రాస నిధులే కదా? మా పాలిట మా యాదవుడు శ్రీకృష్ణుడే అనుకుంటున్నారుట. ఈమాటే శ్రీమాన్ జడ్జిగారికి చతురలు చమత్కారాలు చేర్చి పేర్చి మరీ బీహార్ మాజీ ముఖ్యమంత్రి సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి శివపాల్ సింగుకి చెప్పడానికి ప్రయత్నించాడు- నన్ను గనుక ఓపెన్ జైల్లో పెడితే జన హత్యలయిపోతాయ్ అన్నాడు. అని మొన్న గురువారం ఖైదీగానే- రెండో కేసులో విచారణకి రాంచి ప్రత్యేక కోర్టుకి తీసుకొని రాబడిన లల్లూజీ జడ్జి శివ పాల సింగుకి 'ధమకీ' కూడా ఇచ్చాడు. ఈనెల మొదటివారంలో మూడు వాయిదాల అనంతరం సిబిఐ ప్రత్యేక కోర్టు - ఈ జన ప్రియ పశుపాలక నాయకుడికి మూడున్నర సంవత్సరాల ఖైదు- పది లక్షల రూపాయల జరిమానా విధించింది. అక్షరాల 89 లక్షల 27 వేల రూపాయలు కైంకర్యం చేసిన డుమ్కా నేరంలో- ఈసారి తీర్పు - దీని మీద కూడా మన మహానాయకుడు స్పందిస్తూ ఏమి సామి? మూడు ఏండ్ల కన్నా తక్కువ శిక్ష వెయ్యలేకపోయావా? నేరుగా బెయిలు తెచ్చుకొనేవాణ్ణిగా అన్నాడు. న్యాయమూర్తికి అప్పటికే బెదిరింపులు అందుతున్నాయి అని గోలెట్టేస్తున్నాడు. కొంచెం సెన్స్ ఆఫ్ హ్యూమర్ ప్రదర్శించి - 'లాలూజీ మీకు ఆరుబయలు జైలుశిక్ష వేశానుగా' అన్నాడు- అంతేనా? పుండుమీద కారం జల్లినట్లు అక్కడ అయితే మీరు పశువుల్ని సాకుతూ కాలక్షేపం చెయ్యవచ్చు అన్నాడు. మండిపోయింది- ఇంకా నయం- పేడ పిడకలు పెట్టుకొమ్మన్నావ్ కాదు- అంటూ గొణిగాడు సారు.

''పోయినసారి జనవరి ఆరు సంగతి నేను చెబుతూ వుంట.. ఎలా వుంది? మీ యొక్క జైలు సెల్?'' అంటూ భోగట్టా చేశాడు జడ్జిగారు. నా బొందలాగా వుంది.. చలి వేస్తోంది సార్ అన్నాడు డెబ్బైలో అడుగుపెట్టిన మాజీ సిఎం- ఫోనులో ఈపాటికే బెదిరింపులకు గురి అయిన జడ్జిగారికి వొళ్లు మండిపోయింది. తబలా వాయించుకో సామీ అన్నాడు. లల్లూకి తెల్సిపోయింది- ఇదంతా తన శత్రువు నితీష్‌కుమార్ కుట్ర అనుకున్నాడు. కొడుకు తేజేస్వర్‌కి కబురెట్టాడు- ''హైకోర్టులో పిటిషన్ పడే'' బాబ్జీ అని- నిజానికి, ప్రస్తుతం సుప్రీంకోర్టు ఇచ్చిన బెయిల్‌మీద వున్నాడు శ్రీమాన్- 'మా జనం తిరగబడతారేమో? నాన్న భయం కానీ, లేకపోతే ఓపెన్ ఎయిర్ జైలైనా ఖుషీయే సాబ్' అన్నాడు. అతను అన్నది నిజమే- ఓ ఇద్దరు అనుయాయులు లక్ష్మణ్ యాదవ్, మాధవ్ యాదవ్ అనే వాళ్లు తమ ప్రియ నాయకుడికి జైలులో కమ్మగా వండి పెట్టడానికి- కాళ్లు పట్టడానికి - చోరీ కేసు, దౌర్జన్యం కేసు రెండూ అర్జెంటుగా తమపై పెట్టించుకొని బిర్సాముండాకి నేరుగా పెట్టే బేడా పట్టుకుని వచ్చేశారు. అదండీ సామిభక్తి కాని, పోలీసులు మరోసారి దర్యాప్తు చేసి దొంగ వెధవల్లారా!.. ఉత్తుత్త కేసులు బనాయించుకుంటారురా అంటూ బెయిలు ఇప్పించి పంపించేశారు.. ఆ ఇద్దరు పరారీలో ఉన్నారుట.. అదే మరి- లాలూగారి మహిమ. తనకి, లోగడ ఓ గెస్టుహౌసుని జెయిలుగా మార్చి ఇచ్చారు.

వీరాజీయం

ఇప్పుడూ అలాంటిదే ఇస్తారేమో అనుకున్నాడు. శివపాల్ సింగుగారు మరీ 'కర్కోటకుడు'. నేరుగా లల్లూజీని 'ఫేసు' చెయ్యలేక వీడియో కాన్ఫరెన్సు పెట్టి శిక్ష చెప్పేశాడు (ఔరా?).

మరి, మొన్న గురువారం అదే జడ్జీగారు రెండో కేసు విచారిస్తూ నేరుగా తన ఎదుట బోనులో నిలబడ్డ అపర గోపాలకృష్ణమూర్తిని- ఎలా వుంది సార్! మీ ప్రస్తుత ఖైదు సెల్ అంటూ పరామర్శించాడు. తొణకలేదు బెణకలేదు. వెనుకటికి జైలు నుంచే పిడకలు మాత్రం పెట్టనేర్చిన శ్రీమతి రాబ్డీ దేవిని గద్దెమీద కూర్చుండబెట్టి పరిపాలనా చక్రం తిప్పిన 'మహానాయకుడు'. లాలూ మహాశయుడు - శివపాల్‌సింగ్ గారి స్పెషల్ కోర్టులో గొప్ప డ్రామా ప్రదర్శించాడు. నేనుకూడా శిక్షణ పొందిన లాయర్నే అన్నాడు. సరదాగా కనబడ్డాడు. జోకులు కట్ చేశాడు. 'నాకు రెండున్నర ఏండ్ల శిక్షే వెయ్యకూడదా? ఈ డుమ్కా కేసులోనైనా.. లేదా, నా ప్రజలు ఎడబాటు తట్టుకోలేరు అన్నట్లుగా మాట్లాడాడు. 'జైల్లో వాళ్లు నన్ను ఫ్రీగా తిరగనియ్యడంలేదు సార్?' అంటూ ఫిర్యాదు చేశాడు. విలన్లు అయినా హీరోలయినా ఇలాంటి జన ప్రియులకి నాలిక చివర సంభాషణ చాతుర్యం వుంటుంది అంటారు ఇదేనేమో? 'నాకు ఓపెన్ జైలు వద్దండీ' అన్నాడు. ఈ ఆరుబయలు జైలు హజారాబాగ్‌లో రాంచికి వంద మైళ్ల దూరంలో వుంది. వంద కాటేజీలు కట్టారు. లోగడ 2013లో 'బాగుపడతాం జనంలో కొస్తాం అన్న నక్సలైట్ల కోసం వీటిని నిర్మించారు. ఇక్కడైతే జైలులో అయితే చెప్పాడు జడ్జిగారు- మీరు జైలు బుక్ ప్రకారం నడుచుకోవాలి- అక్కడయితే హాయిగా పశువులు పాడీ వున్నాయి- మీరు మీ అనుయాయులు పశుదాణా, జంతువుకు కావాల్సిన మందులు వగైరా గురించి తెలిసినవాళ్లు కనుక - అక్కడికి పంపిస్తున్నా- ఇంచక్కా డెయిరీ ఫార్మ్ వుంది, పాలు పిండి పంపండి అన్నాడు న్యాయమూర్తి. అరవై ఐదు పైబడ్డ వాళ్లని వాళ్ల ఇష్టం లేకుండా అక్కడికి పంపరాదు కదా? సర్! అని లా పాయింటు లాగాడు మాజీ ముఖ్యమంత్రి. 'హాయిగా సకుటుంబంగా కూడా వుండవచ్చు సామీ!' అన్నాడు జడ్జి. 'అది నక్సలైట్లకోసం కదా కట్టారు. నేను అక్కడ వుంటే రిస్కు వుంది- జనాలు వచ్చి పడిపోతారు- అదో లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్' అన్నట్లు హెచ్చరించాడు ఖైదీ. మరేం ఫర్వాలేదు సెక్యూరిటీ ఏర్పాటు చేస్తాం- ఇరవైవేల మంది సిబ్బంది వున్నారు. మీ జనాల్ని గోడ అవతల నుంచే మిమ్మల్ని చూడనిస్తారు. హాయ్! అంటూ చెయ్యి ఊపవచ్చు అంతే- ఖైదీలంతా సకుటుంబంగా వుంటున్నారు అక్కడ అన్నాడు జడ్జి.

''మీ ఇరవై వేల సెక్యూరిటీ పోలీసులు చాలరు సామీ!'' అన్నాడు. మొండివాడు రాజుకన్నా బలవంతుడు అంటే ఇదే. న్యాయమూర్తి ఇరవై నాలుగుకి వాయిదా వేశాడు. ఈసారికూడా బహుశా, వీడియో కాన్ఫరెన్స్ ద్వారానే తీర్పు చెబుతాడేమో? శివపాల్ సింగ్జీ- అది అలా వుండగా లాలూజీకి అతని పార్టీకి పోయినసారి గ్రాండ్ అలయెన్స్‌లో 178లో 80 సీట్లు వచ్చాయి. జెడియుకి 71 మాత్రమే వచ్చాయి. ఇవాళ ఆ పార్టీలు విడిపోయాయి. అయినా జనాలలో లాలూజీ ఆకర్షణ పడిపోతుంది అని చెప్పడం కష్టం అంటున్నారు పరిశీలకులు. ఇంకా, అప్పీల్ పర్వం- విచారణ జాప్యం వగైరా చాలా కథ వుంది. టు జి స్కాం రాజా- తాజాగా ఓ పుస్తకం రాశాడు. త్వరలో విడుదల కాబోతున్నది. అలాగే జైలులో వున్న లాలూజీ తన అనుభవాల్ని ప్రోది చేసి ఓ బుక్ రాయొచ్చు.. లేదా ఓపెన్ జైల్లో అయితే ''మీ దుంపలు తెగ మీ వల్లనే నేను జైలు పాలయ్యాను'' అని - ఓపెన్ జైలులో పాలు పితుకుతూ వున్నప్పుడు తిట్టుకుంటూ అక్కడ నుంచే చక్రం తిప్పే ప్రయత్నం చేయొచ్చును.

- టూ ఎర్లీ టు వర్కౌట్ హిజ్ ఇంపాక్ట్ ఆన్ 2019

veeraji.columnist@gmail.com

దళితులు మనువాదులా?

దళితవాదులు ఇతరులను మనువాదులుగా నిందిస్తూ ఉంటారు. మనువాదులు అంటే ఎవరో వారు స్పష్టంగా చెప్పకపోయినా కులానికి ప్రాధాన్యత యిచ్చేవారని, యోగ్యతకు కాకుండా జన్మకు ప్రాధాన్యం యిచ్చేవారిని బహుశా వారు మనువాదులుగా పేర్కొంటున్నారని అనుకోవచ్చు. ప్రస్తుతం అమలులో లేని కాలం చెల్లిన మనుస్మృతి గురించి వారు పదేపదే ప్రస్తావిస్తూ ఉంటారు. బీజేపీ వంటి రాజకీయ పక్షాలు మనువాదాన్ని నెత్తిన పెట్టుకొని మనుస్మృతిని తిరిగి ప్రవేశపెట్టడానికి ప్రయత్నం చేస్తున్నాయన్నది విమర్శ. ప్రస్తుతం అమలులో ఉన్నది 'అంబేద్కర్ స్మృతి' అని వారు తరచూ మర్చిపోతుంటారు. వృత్తి, ఉద్యోగాల్లోకి ప్రవేశానికి కనీస విద్యార్హతలు, యోగ్యతలను నిర్ధారించి, అందుకు పోటీ పరీక్షలు పెట్టి, అందులో నెగ్గుకురావడం ఆధారంగానే ఉద్యోగాలు యిస్తున్నారన్న విషయమూ వారికి గుర్తుకురాదు. ఫలాన కులంవారు ఫలానా వృత్తి మాత్రమే చేయాలన్న నిబంధనలు, అలా చేయని పక్షంలో శిక్షలు, బహిష్కరణలు లేవన్న విషయం వారికి తెలిసి కూడా విస్మరిస్తూ ఉంటారు. నిత్యమూ గతించిన ఫ్యూడల్ వ్యవస్థలో ఒకప్పటి సామాజిక అన్యాయాలను పదేపదే తమ వాళ్లకు గుర్తు చేస్తూ, ఎప్పటికప్పుడు మానిన గాయాలను రేపుతూ ఉంటారు. హిందూత్వ భావజాలానికి మూలపురుషుడైన సావర్కర్ తన రచనల ద్వారా, చేతల ద్వారా కులవ్యవస్థను తీవ్రంగా నిరసించిన విషయమూ, సంస్కరణలకు స్వయంగా పూనుకున్న విషయమూ వీరు గుర్తించరు. 1930వ దశకంలోనే సావర్కర్ ఆనాటి హిందూ సంఘం ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించారు. వేదోక్తబంది, వ్యవసాయ బంది, స్పర్శ బంది, సింధు బంది, శుద్ధి బంది, రోటీ బంది, బేటీ బంది అనే ఏడు సంకెళ్లతో బందీ అయిన హిందూ సంఘాన్ని ఆ సంకెళ్ల నుండి విముక్తం చెయ్యాలని ఆయన గట్టిగా ఆకాంక్షించాడు.

వేదాలు అందరూ చదవకూడదన్న నిషేధం, కొన్ని వృత్తులు కొందరు చేయకూడదన్న నిషేధం సముద్రయానంపై ఉన్న నిషేధం, అంటరానితనం, కులాంతర భోజనాలపై ఉన్న నిషేధం, కులాంతర వివాహాలపై ఉన్న నిషేధం అనే ఏడు సంకెళ్లను తెంచుకొని సంఘం బయటకు రావాలని, అందుకు అందరం సమష్టిగా ఛాందసులపైన పోరాటం చెయ్యాలని సావర్కర్ పిలుపునిచ్చాడు. అంతకు మూడునాలుగు దశాబ్దాలకు ముందే స్వామి వివేకానంద అంటరానితనాన్ని, కులవివక్షను తీవ్రంగా నిరసించడమేగాక, అగ్ర కులాలవారు తమ అహంకారాన్ని తగ్గించుకొని నిమ్న వర్గాలవారి అభ్యున్నతికి చేయూతనివ్వకపోతే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. ప్రగతిశీల సిద్ధాంతాలతో ప్రభావితులైన రాజ్యాంగ పరిషత్ సభ్యులు ఎంతో ముందుచూపుతో, రాజనీతిజ్ఞతతో వయోజన ఓటింగ్‌సహా ఎన్నో హక్కులను సామాన్యులకు వర్తింపచేయడానికి కారణం సమాజంలో హెచ్చుతగ్గులు రూపుమాపడానికేకదా!

ఇతర కులాలలోని అభ్యుదయగాములు చేసిన, చేస్తున్న కృషి దళితవాదులకు తెలిసినా దానిని వారు గుర్తించడం లేదు. తమపట్ల ఎవరికీ సానుభూతి లేదనట్లు, సంఘం అంతా తమను దెబ్బతీయడానికే ప్రయత్నం చేస్తున్నట్లు వారు మాట్లాడుతున్నారు. ఇతర కులాలలోని అభ్యుదయవాదులతో పనిచేయడానికి వారు ఎందుకు సంకోచిస్తున్నారు? రాజ్యాంగం కల్పించిన రక్షణలను అనుభవిస్తూనే ఇతరులను, హిందూ సంఘాన్ని పదేపదే ఎందుకు విమర్శిస్తున్నారు. రాజ్యాంగ పరిషత్ సభ్యులు సంఘంలోని వివిధ వర్గాలకు చెందిన ప్రతినిధులుగానే ఆ సభలో కూర్చున్నారు. అంబేద్కర్ కూడా అలా ఎన్నికైనవారే. అంటే సంఘానికి ప్రతినిధులుగా ప్రగతిశీలమైన అనేక నిర్ణయాలు వారు తీసుకున్నారు. దురన్యాయాలను దృష్టిలో పెట్టుకొని కొత్త శకానికి నాంది పలికేందుకు అనేక చర్యలకు వారు శ్రీకారం చుట్టారు. ఇతరులను మనువాదులని విమర్శిస్తూనే వారు కులపరంగానే సంఘటితం అవుతూ పోరాటం చేస్తున్నారు. కులానికి వ్యతిరేకంగా కులాతీతంగా పోరాడకుండా కులపరంగానే సంఘటితం అవటం మనువాదాన్ని అంగీకరించడం కాదా? ఈ దేశంలో బీజేపీ వారు మాత్రమే హిందువులకు ప్రతినిధులు కాదు. బీజేపీని రాజకీయంగా ఎంతైనా ఎండగట్టండి. కానీ బీజేపీని విమర్శించడానికి హిందూ మతాన్ని, ధర్మాన్ని కించపరుస్తూ ఎందుకు మాట్లాడాలి? రాజకీయ విమర్శలు హద్దుదాటి మత విమర్శలుగా మారుతున్నాయి. ఇప్పుడు కొత్తగా బీజేపీ వారిని నయా పీష్వాలుగా విమర్శిస్తున్నారు.

మరాఠా యుద్ధాలు బ్రిటిషువారు తమ ఆధిపత్యం సుస్థిరం చేసుకునేందుకు చేసినవి. కోరేగావ్ దగ్గఱ జరిగిన యుద్ధానికి షాహు మహారాజు పక్షాన ప్రధానమంత్రి హోదాలో బాజీరావ పీష్వా నాయకత్వం వహించాడు. అది ఆయన సొంత సైన్యం కాదు. అందులో బ్రాహ్మణ సైనికులు ప్రాతినిధ్యం నామమాత్రం. మహారాజు సైనికులలో మరాఠాలతోపాటు, మహర్లు, ఇతర కులాలకు చెందినవారు ఉన్నారు. మహారాజు సైన్యంలో అసలు మహర్లే లేరు అనడం సత్యదూరం. వాస్తవానికి ఆంగ్లేయుల పక్షాన పోరాడిన మహర్లకంటె షాహు మహారాజు పక్షాన పోరాడిన మహర్ల సంఖ్య ఎక్కువే. ఆ యుద్ధం కుల యుద్ధం కాదు. కుల ఆధిపత్యాల కోసం జరిగిన యుద్ధం కాదు. బ్రాహ్మణులకు, మహర్లకు మధ్య జరిగిన యుద్ధం అసలే కాదు. బ్రిటీషువారు మనగడ్డ మీద మనవాళ్లతో సాగించిన యుద్ధమది. దురదృష్టవశాత్తు ఆ యుద్ధంలో చనిపోయింది భారతీయులే. ఎవరిపక్షాన ఎవరు గెలిచినా ఓడింది మనమే. మహర్ సైనికుల ధైర్యసాహసాలను గుర్తుకు తెచ్చుకొని, స్ఫూర్తి పొందాలనుకుంటే అందుకు అనేక యితర సంఘటనలను ఉన్నాయి. ఇతర చారిత్రక సందర్భాలు ఉన్నాయి. శివాజీ మహారాజు కాలంలోను, శంభూజీ సైన్యంలోనూ మహర్ సైనికులు అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి, పొందిన గౌరవ మర్యాదల నుండి స్ఫూర్తి పొందవచ్చు. శంభూజీ మహారాజును ముక్కముక్కలుగా నరికి భీమా నదిలో పడవేస్తే గోవిందుడనే మహర్ ఔరంగజేబు ఆదేశాలను ధిక్కరించి శరీర అవశేషాలను సేకరించి శంభూజీకి అంతిమ సంస్కారం చేసిన చారిత్రక ఘట్టం నుండి స్ఫూర్తి పొందవచ్చు.

మనం గెలిచిన యుద్ధాల నుండి స్ఫూర్తి పొందాలేగాని, ఒకానొక సంధి కాలంలో శత్రుపక్షాన పోరాడి, భారతీయులను పరాజితులను చేసి, ఆంగ్లేయుల వలస పాలనకు కారణభూతమైన ఒకానొక యుద్ధాన్ని కులయుద్ధంగా వక్రీకరించి స్ఫూర్తి పొందే ప్రయత్నం చరిత్రనే కాదు, వర్తమానాన్ని కూడా వక్రీకరించే ప్రయత్నమే తప్ప మరొకటి కాదు. స్వాతంత్ర్య అనంతరం మన సైన్యంలోని మహర్, డోగ్రా రెజిమెంట్లు తాము సాధించిన విజయాలను గుర్తు చేసుకుంటూ ఉత్సవాలను కొన్నాళ్లు జరుపుకున్నారు. బ్రిటీషు వారి సైన్యంలో భాగంగా సాగించిన విజయాలను స్మరించుకోవడంలోని అనౌచిత్యాన్ని గుర్తించి ఆ పద్ధతికి ముగింపు పలికారు. సమాజంలో బ్రాహ్మణాధిక్యత ఏనాడో అంతరించింది. మనుస్మృతి బ్రాహ్మణాధికత్యతను గురించిచెబితే, అందుకు భిన్నంగా ఇప్పుడు అన్ని రంగాలలోనూ బ్రాహ్మణేతరుల ఆధిక్యతే ప్రస్ఫుటంగా కన్పడుతుంది. శ్రామిక కులాలకు చెందినవారు అభివృద్ధి చెందడం స్వాగతించదగ్గ పరిణామం. వీటన్నిటిని గమనిస్తూ కూడా, బ్రాహ్మణాధిక్యత గురించి పదేపదే మాట్లాడటం విడ్డూరంగా ఉంది. ప్రజాస్వామ్యంలో సంఖ్యాబలం ఏ వర్గాల ప్రజలకు ఉంటుందో వారి చేతుల్లోకి అధికారం వస్తుంది. 'మనువాదులు' కాని, మరే ఇతర వాదులు కానీ దీనిని తిరగ వ్రాయలేరు.

అధికారం, సంపద ఉన్నవారికే ఈనాడు సంఘంలో గౌరవ మర్యాదలు లభిస్తున్నాయి. కులాన్నిబట్టి చిన్నచూపు చూసే రోజులూ పొయ్యాయి. అధికారం, డబ్బుకోసం అన్ని వర్గాలవారు అర్రులు జాస్తున్నారు. కులరాజకీయాలు, కుల విభజనలు, కుల సమీకరణలు అందులో భాగమే. రాజకీయాలు లేకుండే కులపిచ్చి ఇంతగా పెరిగేది కాదు. రాజకీయాధికారం కోసం కులాన్ని రెచ్చగొడితే, ఇతరులూ అదే పనిచేయగలరన్న విషయాన్ని ప్రతి కులం వారు విస్మరిస్తున్నారు. కుల సమీకరణలు, వాదనలు వలన వైషమ్యాలు పెరిగి, దేనికైతే వ్యతిరేకంగా తాము పోరాటం చేస్తున్నామని ప్రతివారు చెబుతున్నారో, అదే కులవాదం - మనువాదం స్థిరపడుతున్నది. అందరూ తమకు తెలియకుండానే మనువాదులుగా మారిపోతున్నారు. దళితవాదులు అందుకు మినహాయింపు ఏమీ కాదు.

-డా.సారంగపాణి



గ్లోబల్ విపాసన పగోడలో ఆదివారం నిర్వహించిన కార్య క్రమానికి విచ్చేసిన రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

బుద్ధుని బోధనలు అనుసరణీయం

- క్షమాగుణంతో హింసాప్రవృత్తులు దూరం
- విపాసన సుగుణాలు అందరికీ ఉపయుక్తం
- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ముంబై, జనవరి 14: గౌతమ బుద్ధుడు బోధించిన క్షమాగుణాన్ని ప్రతిఒక్కరూ అనుసరించడం ద్వారా సభ్యసమాజంలో జరుగుతున్న, నేరాలు, హింసాప్రవృత్తులను కొంతవరకైనా తగ్గించవచ్చని రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అభిప్రాయపడ్డారు. ఇక్కడి గొరాయి సబర్బన్ బోరివ్లీలో గల గ్లోబల్ విపాసన పగోడలో ఆదివారం నిర్వహించిన 'గ్రాటిట్యూడ్ డే' కార్యక్రమంలో ఆయన హాజరైన ఆహూతులను ఉద్దేశించి ప్రసంగించారు. మయన్మార్‌కు చెందిన ప్రముఖ విపాసన టీచర్ సయాగ్యి యూ బా కిన్ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన నివాళులు అర్పించారు. మానవత్వం పరిమళించేందుకు, సమాజంలో హింసాప్రవృత్తులను పారదోలడానికి బుద్ధుడి బోధనలు ఎంతో ఉపకరిస్తాయని అన్నారు. మంచి సుగుణాలు కలిగేందుకు విపాసనలో నేర్చుకున్న సిద్ధాంతాలు ఎంతో ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజల్లో మంచి సుగుణాలు, విశ్వాసం, సంస్కృతి, సంప్రదాయాలు పాదుకొల్పడంలో మహారాష్ట్ర ఎన్నో రకాలుగా గుర్తింపు సాధించిందని, ప్రజల్లో ఈ అంశాలు మరింత లోతుగా తీసుకెళ్లేందుకు, తద్వారా మరింత ప్రాచుర్యం పొందేందుకు ఇంకా కృషి జరగాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని ఎల్లోరా గుహలు ప్రపంచంలోని అన్ని ప్రాంతాల పర్యాటకులను ఆకర్షించడం సంస్కృతి, సంప్రదాయాల కలబోతకు ఉదాహరణ అని ఆయన అన్నారు. విపాసన వల్ల ఒనగూరే ప్రయోజనాలను ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా విద్యార్థులు చదువులో మరింత దృష్టి సారించేందుకు తద్వారా ఉత్తమ మార్కులు సాధించి వృద్ధిలోకి వచ్చేందుకు ఎంతో దోహపడుతుందని అన్నారు. ప్రభుత్వ అధికారులు, క్రీడాకారులు ఈ విపాసన అంశాన్ని అలవరచుకోవడం వల్ల మానసిక, శారీరక, ఆధ్యాత్మిక రంగాల్లో ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం తమ ఉద్యోగులకు విపాసన కార్యక్రమాలను అమలు చేయడం ద్వారా వారిలో నూతనోత్సాహం కల్పించడాన్ని రాష్ట్రపతి అభినందించారు. అంతకుముందు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ విపాసన టీచర్ సయాగ్యి యూ బా కిన్, సత్యనారాయణ్ గొయెంకా, ఇలైచీదేవీ గోయెంకా తదితరులు విపాసన కార్యక్రమం దేశవ్యాప్తంగా ప్రాచుర్యం కావడానికి అందించిన సేవలను ప్రస్తుతించారు.

యూత్ లీడర్స్ బృందానికి శ్రీతేజ నాయకత్వం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 14: సామాజిక, సాంస్కృతిక, మేథో, రాజకీయ అంశాలపై ప్రపంచవ్యాప్తంగా యువకులను ఒకచోటుకు చేర్చి, ప్రతి ఏడాది నిర్వహించే 'షిప్ ఫర్ వరల్డ్ యూత్ లీడర్స్' కార్యక్రమానికి భారత్ తరపున వెళ్లే బృందానికి తెలుగు అమ్మాయి యువ న్యాయవాది శ్రీతేజ నాయకత్వం వహించనుంది. జపాన్‌లో జరిగే ఈ కార్యక్రమాని 11 ప్రపంచ దేశాల నుంచి 240 మంది యువ ప్రతినిధులు హాజరుకానున్నారు.

ఇందులో భారత్ తరపున 10 మంది సభ్యుల బృందం పాల్గొననుంది. ఈ కార్యక్రమం 45 రోజులపాటు జరగనుంది. యువతీ యువకుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.

ఆహ్వానం అదిరింది

- నెతన్యాహూకు ఎదురేగి స్వాగతం పలికిన ప్రధాని
- చారిత్రక పర్యటన అంటూ మోదీ ట్వీట్
- ఆరు రోజుల పర్యటనకు వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని



భారత పర్యటనకు వచ్చిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో నరేంద్ర మోదీ


న్యూఢిల్లీ, జనవరి 14: ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఆరు రోజుల చారిత్రక, ప్రత్యేక పర్యటనలో భాగంగా ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్నారు. తనకు సన్నిహిత మిత్రుడైన నెతన్యాహూను ఆహ్వానించేందుకు ప్రొటోకాల్‌ను పక్కనబెట్టి మరీ మోదీ ఆయనను ఆలింగనం చేసుకుని భారత గడ్డపైకి ఆహ్వానించారు. ఈ ఆరు రోజుల పర్యటనలో భాగంగా ముంబయి, గుజరాత్‌లను కూడా నెతన్యాహూ సందర్శిస్తారు. తన భార్య సారా సమేతంగా నెతన్యాహూ విమానం దిగి రెడ్ కార్పెట్‌పై అడుగుపెట్టిన వెంటనే చిరుదరహాసంతో ఎదురేగిన మోదీ ఆయనను ఆలింగనం చేసుకున్నారు. నెతన్యాహూ, ఆయన భార్యతో కరచాలనం చేశారు. ప్రొటోకాల్‌కు భిన్నంగా నరేంద్ర మోదీ తమకు పలికి ఆహ్వానం ఆనందదాయకంగా ఉందంటూ నెతన్యాహూ వ్యాఖ్యానించినట్లు జెరూసలెం పోస్ట్ తెలిపింది. భారత పర్యటనకు బయలుదేరే ముందు మాట్లాడిన నెతన్యాహూ 'ప్రపంచంలోనే అత్యంత కీలకమైన, శక్తివంతమైన దేశం భారత్. ఇరు దేశాలు అన్ని రంగాల్లోనూ సన్నిహితమయ్యేందుకు ప్రయత్నిస్తున్నాయి. దీనివల్ల భద్రత, ఆర్థిక, వాణిజ్య, టూరిజంతోపాటు ఎన్నో రకాలుగా ఉభయతారకమైన రీతిలో ప్రయోజనాలు సిద్ధిస్తాయి' అని తెలిపారు. తన మిత్రుడైన నెతన్యాహూకు ఆహ్వానం పలకడానికి మోదీ ఎదురేగి వెళ్లారంటే ఇజ్రాయెల్‌తో భారత్‌కు ఉన్న అనుబంధానికి, లోతైన సంబంధాలను పెంపొందించుకోవాలన్న ఆకాంక్షకు అద్దం పడుతోందని విదేశాంగ వ్యవహార శాఖకు చెందిన రవీశ్ కుమార్ అన్నారు.

భారత్-ఇజ్రాయెల్ మధ్య లాంచనంగా సంబంధాలు మొదలై 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నెతన్యాహూ ఇక్కడికి రావడం సముచితమైన సందర్భమని పేర్కొన్నారు. 2003లో అప్పటి ఇజ్రాయెల్ ప్రధాని ఆరియల్ షెరాన్ భారత్ వచ్చారు. ఆ తర్వాత భారత్‌లో అడుగిడిన ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ మాత్రమే. ఇజ్రాయెల్ ప్రధాని భారత్ రావడం ఓ చారిత్రక, ప్రత్యేక ఘట్టమని నెతన్యాహూకు ఆహ్వానం పలికిన తర్వాత ఓ ట్వీట్‌లో మోదీ అన్నారు. ఆయన రాకవల్ల ఇరుదేశాల మైత్రీ బంధం మరింతగా ఇనుమడిస్తుందని పేర్కొన్నారు. కాగా, నెతన్యాహూతో మోదీ జరిపే చర్చల్లో ద్వైపాక్షిక సంబంధాలతోపాటు అంతర్జాతీయ పరిస్థితులకు సంబంధించిన అంశాలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇజ్రాయెల్ ప్రధానితోపాటు పెద్ద సంఖ్యలో వ్యాపారవేత్తలు కూడా వచ్చారు. వీరంతా ఇటు ముంబయి, అటు గుజరాత్‌లో విస్తృత స్థాయిలో వ్యాపార, వాణిజ్యపరమైన చర్యలు జరుపుతారు. ఆగ్రాలోని తాజ్‌మహల్‌ను కూడా నెతన్యాహూ సందర్శించే అవకాశం ఉంది.

ఆలింగనాలపై కాంగ్రెస్ ఎగతాళి

- నరేంద్ర మోదీ కౌగిలింతల వీడియో విడుదల
- దేశ ప్రయోజనాలకే భంగం అంటూ మండిపడ్డ బీజేపీ

ఆంధ్రభూమి ప్రతినిధి



న్యూఢిల్లీ, జనవరి 14: ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ నేతలను కలిసిన సందర్భంలో చేసిన ఆలింగనాలను ఎగతాళి చేస్తూ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియాలో వీడియో విడుదల చేసింది. దీనిపై బీజేపీ మండిపడింది. భారత్ పరువును కాంగ్రెస్ మంట గలిపిందని బీజేపీ అధికార ప్రతినిధి సంబిత్ పాత్రా మండిపడ్డారు. దేశంలో పార్టీలపరంగా ప్రధానిని విమర్శించవచ్చునని, కాని నరేంద్ర మోదీ దేశానికి ప్రధాని అన్న విషయం మరచిపోయి కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని పేర్కొన్నారు. గతంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ విదేశీ పర్యటనలోకూడా భారతదేశాన్ని కించపరిచేలా విమర్శలు చేశారని సంబిత్ పాత్రా వెల్లడించారు. ప్రధాని నరేద్ర మోదీ విదేశీ అధినేతలతో ఆత్మీయంగా మెలుగుతూ చేసిన ఆలింగనాల వీడియోను కాంగ్రెస్ పార్టీ అధికార ట్విటర్ అకౌంట్‌లో ఆదివారం విడుదల చేసింది. ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ ఆరు రోజుల పర్యటనకు ఆదివారం ఢిల్లీకి చేరుకున్న సందర్భంలో ఈ వీడియో విడుదల చేయడం పెద్దవివాదంగా మారింది. ప్రధాని నరేంద్ర మోదీ ఆలింగనాలకోసం ఎదురుచూస్తున్నారు అన్న కోణంలో కాంగ్రెస్ పార్టీ వీడియోను ట్వీట్ చేసింది. ప్రధాని మోదీ 'హగ్ హైలైట్స్' అంటూ విడుదల చేసిన ఈ వీడియోలో వివిధ దేశాలకు చెందిన నాయకులను ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్న విధానాన్ని చూపించింది. టర్కీ ప్రధానితో 'అద్భుత కౌగిలింత' అని, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో 'మరింత వికృతం' అని, హాలెండ్ మాజీ అధ్యక్షుడితో 'టైటానిక్ కౌగిలింత' అని, మెక్సికో అధ్యక్షుడితో 'నన్ను ప్రేమించనీ' అన్నట్టు ఉందని, జపాన్ ప్రధాని అబెను కౌగిలించుకుంటూ 'నిన్ను ఎన్నటికి వెళ్లనివ్వను' అన్నట్టు ఉందని ఆ వీడియోలో పేర్కొన్నారు. వివిధ దేశాల అధినేతలను ప్రధాని కౌగిలించుకున్న వాటిపై వ్యంగ్యంగా ఇంగ్లీష్‌లో సబ్ టైటిల్స్‌ను హైలైట్ చేస్తూ, అలాగే మధ్య మధ్యలో సంగీతం సమకూర్చి, కాంగ్రెస్ పార్టీ ఆ వీడియోను విడుదల చేసింది.


పెరూలో భూకంపకం

సునామీ హెచ్చరిక జారీ

లీమా, జనవరి 14: పెరూలోని సముద్రతీర ప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున భారీ భూకంపం సంభవించింది. ఈ సంఘటనతో పెరూతోపాటు పొరుగు ప్రాంతమైన చిలీలోనూ సునామీకి దారితీసే ప్రమాదం ఉందని అమెరికాకు చెందిన ఒక ఏజన్సీ ప్రజలకు ఒక ప్రకటన ద్వారా హెచ్చరిక జారీ చేసింది. అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకారం భూకంప ప్రభావ తీవ్రత 7.3 ఉందని పేర్కొంది. అయితే, ఈ భూకంపం వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం వాటిల్లలేదని స్పష్టం చేసింది. ఆకారీ ప్రాంతంలోని సౌత్-సౌత్‌వెస్ట్‌లో 42 కిలోమీటర్ల దూరంలో, సముద్రంలో 12.1 కిలోమీటర్ల లోతున ఆదివారం తెల్లవారుజామున 4.18 గంటలకు ఈ సంఘటన జరిగినట్టు పేర్కొంది. అయితే, సముద్రతీరంలోని కొన్ని ప్రాంతాల్లో సునామీ వచ్చే అవకాశాలు ఉన్నాయని 'ది పసిఫిక్ సునామీ వార్నింగ్ సెంటర్' హెచ్చరించింది. ఆ హెచ్చరిక ప్రకారం సునామీ తరంగాలు 0.3 మీటర్ల నుండి ఒక మీటరు వరకు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. చిలీ తీర ప్రాంతాల్లో మాత్రం 0.3 మీటర్ల కంటే తక్కువగా సునామీ తరంగాలు ఉండొచ్చని తెలిపింది.

పాక్‌పై ఉక్కు పిడికిలే

- మరింతగా ఒత్తిడి పెంచుతాం
- కాశ్మీర్‌లో శాంతికి సైనిక, రాజకీయ మార్గమే మిన్న
- ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్



న్యూఢిల్లీ, జనవరి 14: జమ్ము కాశ్మీర్‌లో సుస్థిర శాంతిని పాదుగొల్పాలంటే రాజకీయ ప్రయత్నాలతోపాటు సైనిక ఆపరేషన్లు కూడా చేదోడు వాదోడుగా కొనసాగాల్సిన అవసరం ఉందని ఆర్మీ చీఫ్ బిపిన్ రావత్ అన్నారు. రాజకీయంగా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో పరుగులు పెట్టించే చర్యలను వేగవంతంగా చేపట్టడం ఎంత అవసరమో, అదే స్థాయిలో మిలిటెన్సీ అవరోధం కాకుండా దాన్ని అణచివేయడమూ అంతే అవసరమని ఆదివారం నాడిక్కడ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో రావత్ తెలిపారు. పాకిస్తాన్‌పై మరింతగా ఒత్తిడి తీసుకురావడం ద్వారా సీమాంతర ఉగ్రవాదానికి, చొరబాట్లకు పూర్తిస్థాయిలో తెరదించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అయితే రాష్ట్రంలో సైనిక కార్యకలాపాలు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా మారాల్సిన అవసరం ఉందని, ఆయా పరిస్థితులను బట్టి సవాళ్లు, స్థితిగతులను బట్టి సైన్యం కూడా తన వ్యూహాలను మార్చుకోవాల్సి ఉంటుందని రావత్ వెల్లడించారు. ఏడాది క్రితం తాను ఆర్మీ చీఫ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన నాటి పరిస్థితులతో పోలిస్తే నేటి పరిస్థితులు ఎంతో మెరుగ్గా కనిపిస్తున్నాయని తెలిపారు. ఉగ్రవాద కార్యకలాపాలను పూర్తిగా అణచివేయాలంటూ ఇటీవలి తరహాలోనే పాకిస్తాన్‌పై అన్ని విధాలుగానూ ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ఉగ్రవాదాన్ని ఏరివేసే విషయంలో కఠినంగా వ్యవహరించాలన్న సైనిక విధానంలో ఎలాంటి మార్పు లేదని, అయితే రాజకీయ కార్యకలాపాలు కూడా ఏకకాలంలో సాగితే రాష్ట్రంలో సుస్థిర శాంతిని పాదుగొల్పడం అసాధ్యమేమీ కాదన్నారు. మారుతున్న పరిస్థితులను బట్టి రాజకీయ-సైనిక వ్యూహంతోనే ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని తెలిపారు. కాశ్మీర్ వేర్పాటువాదలతోనూ, సంబంధిత వర్గాలతోనూ చర్చల ప్రక్రియను కొనసాగించేందుకు కేంద్ర ప్రభుత్వం గత ఏడాది అక్టోబర్‌లో మాజీ ఐబి చీఫ్ దినేశ్వర్ శర్మను నియమించిన విషయం తెలిసిందే. దినేశ్వర్ శర్మ ప్రభుత్వ ప్రతినిధిగా కాశ్మీర్ ప్రజలతో మాట్లాడుతున్నారని, వారి మనోభావాలను తెలుసుకుంటున్నారని ఈ సందర్భంగా వెల్లడించిన రావత్, మిలిటెన్సీ అణచివేత విషయంలో తమదైన పంథాలో ముందుకు సాగుతున్నామని తెలిపారు. పాకిస్తాన్‌పై నిరంతరం ఒత్తిడి తేవడం ద్వారానే ఉగ్రవాద చొరబాట్లను అరికట్టే అవకాశం ఉంటుందని పేర్కొన్న ఆయన ఎప్పటికప్పుడు పరిస్థితులు, సవాళ్లు మారుతున్నాయి కాబట్టి వాటికి అనుగుణంగానే సైనిక దళాలు వ్యూహాత్మకంగా ముందుకు వెళ్లాలన్నారు. గత కొన్ని నెలలుగా కాశ్మీర్‌లో ఉగ్రవాదానికి వ్యతిరేకంగా సైన్యం గట్టి చర్యలు చేపడుతోందని, అలాగే 'కుక్కకాటుకు చెప్పుదెబ్బ' అన్న రీతిలో అధీనరేఖ వద్ద కూడా పాకిస్తాన్ ఆట కట్టిస్తోందని రావత్ అన్నారు.

పరిష్కారం దిశగా మరో అడుగు

జస్టిస్ చలమేశ్వర్‌తో బార్ కౌన్సిల్ బృందం భేటీ

న్యూఢిల్లీ, జనవరి 14: దేశ సర్వోన్నత న్యాయ స్థానంలో తలెత్తిన సంక్షోభాన్ని నివృత్తి చేసే చర్యల్లో భాగంగా చైర్మన్ మానన్ కుమార్ మిశ్రా సారథ్యంలో భారత బార్ కౌన్సిల్ బృందం ఆదివారం ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రాను కలుసుకుంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు ఏడుగురు సభ్యులతో బార్ కౌన్సిల్ ఓ బృందాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు మీడియా సమావేశంలో మాట్లాడ్డం, ప్రధాన న్యాయమూర్తిపై నేరుగానే విమర్శలు గుప్పించిన నేపథ్యంలో తక్షణ ప్రాతిపదికన ఈ సుప్రీం సంక్షోభాన్ని పరిష్కరించే ప్రయత్నాలు మొదలయ్యాయి. బార్ కౌన్సిల్ బృందం జస్టిస్ చలమేశ్వర్‌ను కలుసుకుని తాజా పరిస్థితిపై చర్చించినట్టు తెలుస్తోంది. అలాగే న్యాయమూర్తులు ఎస్ఏ. బాబ్డే, ఎల్.నాగేశ్వరరావు కూడా చలమేశ్వర్‌తో చర్చలు జరిపినట్టు అధికార వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ కథనాలు వెలువడ్డాయి. బార్ కౌన్సిల్ బృందం జస్టిస్ చలమేశ్వర్‌ను కలుసుకున్న తర్వాత ఈ ఇద్దరు న్యాయమూర్తులు ఆయనతో భేటీ అయినట్టుగా తెలుస్తోంది.

తొలి గెలాక్సీ చిక్కింది

5000 మిలియన్ సంవత్సరాల నాటిదిగా అంచనా ▪ విశ్వ తొలిదశ పరిశోధనపై మరో ముందడుగు



వాషింగ్టన్, జనవరి 14: అంతరిక్ష పరిశోధనల్లో శాస్త్రవేత్తలు మరో ముందడుగు వేశారు. మన సౌర వ్యవస్థలోనే కాకుండా దాని ఆవల సుదూర ప్రాంతాల్లో ఉన్న నక్షత్రాలనే కాకుండా నక్షత్ర మండలాల్లో ఉన్న తమ విశ్వ శోధనాపటిమతో వెలికితీస్తున్నారు. తాజాగా 500 మిలియన్ సంవత్సరాల నాటి అత్యంత ప్రాచీన నక్షత్ర మండలాన్ని అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ నాసాకు చెందిన శాస్త్రవేత్తలు కనుగొన్నారు. నాసా ప్రయోగించిన హబుల్, స్పైజర్ రోదసీ టెలిస్కోపులు మొత్తం విశ్వాన్ని శోధించి ఈ అత్యంత ప్రాచీన నక్షత్ర మండల ఉనికిని నిర్ధారించాయి. ఈ నక్షత్ర మండలానికి ఎస్‌పీటీ 0615 జేడీగా శాస్త్రవేత్తలు నామకరణం చేశారు. ఇంత ప్రాచీనత కలిగిన నక్షత్ర మండలాలను గతంలోకూడా కనుకొన్నప్పటికీ ఈ తాజా గెలాక్సీకి అన్ని విధాల ప్రాధాన్యత ప్రత్యేకత ఉన్నాయి. ఇంత సుదూర నక్షత్రాలు, నక్షత్ర మండలాలు అతిసూక్ష్మ పరిమాణంలోనే కనిపిస్తాయి. అయితే ఈ రెండు రోదసీ టెలిస్కోపులు శక్తివంతమైనవి కావడంవల్ల ఈ గెలాక్సీ ఆనుపానులు సైతం విశ్లేషించగలిగే వివరాలను వెలుగులోకి తేగలిగాయి. అయితే ఈ నక్షత్ర మండల నేపథ్యంగా ఉన్న గురుత్వాకర్షక శక్తి చాలా తీవ్రంగా ఉందని, దీనివల్ల అత్యంత విస్తృత స్థాయిలోనే దీన్నుంచి కాంతికిరణాలు ప్రస్ఫుటం అవుతున్నాయని శాస్త్రవేత్తలు వెల్లడించారు. అంటే ఇప్పటివరకు కనిపెట్టిన నక్షత్ర మండలాల కంటె కూడా ఈ తాజా గెలాక్సీ తన ఉనికికి సంబంధించి చాలా బలమైన సంకేతాలను అందించిందని నాసా శాస్త్రవేత్తలు వెల్లడించారు. అత్యంత సుదూరంలో ఉండికూడా ప్రస్ఫుటమైన కాంతి కిరణాలను ప్రసరించిన ఏకైక గెలాక్సీ ఇదేనని, దీనిద్వారా అనేక రకాలుగా ప్రాచీన రోదసీకి సంబంధించిన సమాచారాన్ని విస్తృతస్థాయిలో అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గెలాక్సీల ఉపరితలంపై గురుత్వాకర్షక శక్తిని విశ్లేషించగలిగితే అది ఏ పరిమాణంలో ఉందో, దాని అంతర్గత స్వరూపాన్ని కూడా తెలుసుకొనే అవకాశం ఉంటుందని స్పేస్ టెలిస్కోపు పరిశోధనా సంస్థకు చెందిన బ్రెట్ సాల్మన్ తెలిపారు. ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త అల్బర్ట్ ఐన్‌స్టీన్ శతాబ్దం క్రితమే వెలుగులోకి తెచ్చినట్టుగా ఆయా నక్షత్ర మండలాల ఉనికిపై గురుత్వాకర్షక తరంగాల ప్రభావం చాలా బలంగానే ఉంటుందని, దీనివల్ల వీటి నుంచి కాంతికిరణాలు దట్టంగానే ప్రస్ఫుటమవుతాయని వెల్లడించారు.

ముఖ్యంగా అత్యంత ప్రాచీన నక్షత్రాలు, గెలాక్సీలను కనుగొనే ప్రయత్నంలో శక్తివంతమైన జూమ్ లైన్స్‌లను శాస్త్రవేత్తలు ఉపయోగిస్తారు. దీనివల్ల ఆ నక్షత్రము లేదా నక్షత్ర మండలాన్ని ఎక్కువ పరిమాణంలో చూసే అవకాశం ఉండడంతోపాటు వాటి అంతర్గత స్వరూపాన్ని పరిశీలించే అవకాశమూ ఉంటుందని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. అంతరిక్ష పరిశోధనల్లో ఉపయోగించే నేటి టెలిస్కోపులతో ఇంత ప్రాచీన నక్షత్ర మండలాలను చూడడానికి లేదా పరిశీలించడానికి అవకాశం ఉండదని, ప్రత్యేకమైన టెలిస్కోపుల ద్వారా ఈ అధ్యయనాన్ని సాగిస్తున్నామని తెలిపారు.

హబుల్, స్పైజర్ టెలిస్కోపుల్లో ఈ జూమ్ లైన్స్ ఉన్నాయి కాబట్టే 500 సంవత్సరాల క్రితంనాటి అత్యంత ప్రాచీనమైన, రోదసీ లోతుల్లోని ఈ గెలాక్సీని కనుగొనగలిగామని తెలిపారు. ఈ తాజా గెలాక్సీకి సంబంధించి తమ అంచనాల ప్రకారం ఈ మొత్తం బరువు 3 బిలియన్ సౌర ద్రవ్యరాశుల కంటె తక్కువగానే ఉంటుందని తెలిపారు. అట్లాగే దీని వెడల్పుకూడా 2500 కాంతి సంవత్సరాల కంటె తక్కువేనని, ఈ గెలాక్సీ అధ్యయనం ద్వారా బిగ్‌బ్యాంగ్ అనంతర కాలంలో సంభవించిన పరిమాణాలను కూడా లోతుగా అధ్యయనం చేయాల్సి ఉంటుందని నాసా శాస్త్రవేత్తలు తెలిపారు. అంతేకాకుండా ఈ విశ్వ తొలిదశ ఎలా ఉండేదన్న దానిపైన వెబ్ టెలిస్కోపుల ద్వారా అధ్యయనాలు సాగించడం ద్వారా ఈ తాజా ఆవిష్కరణ దోహదం చేసే అవకాశం ఉందని బ్రెట్ సాల్మన్ తెలిపారు.

ఉత్సాహంగా యూపీలో అడుగు



- కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాహుల్ తొలి పర్యటన
- పార్టీ బలోపేతమే లక్ష్యంగా వ్యూహ రచన

లక్నో, జనవరి 14: కాంగ్రెస్ అధ్యక్ష పదవిని చేపట్టిన నేపథ్యంలో జరిగిన గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో మంచి ఫలితాలను సాధించడంతో పార్టీ యువనేత రాహుల్ గాంధీ ఇప్పుడు ఉత్తర ప్రదేశ్ వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి సారించారు. వచ్చే ఏడాది జరగనున్న లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకుని పార్టీని అన్ని స్థాయిల్లోనూ శక్తివంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాహుల్ గాంధీ వ్యూహాత్మకంగా చర్యలు చేపడుతున్నారు. దేశంలో అతి పెద్ద రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్ నుంచే గరిష్ఠ సంఖ్యలో ఎంపీలు ఎన్నికవుతారు కాబట్టి ఈ రాష్ట్రంపై దృష్టిపెడితే పార్టీని బలోపేతం చేయగలిగితే లోక్‌సభ ఎన్నికల్లో కూడా మంచి ఫలితాలను సాధించవచ్చునని కాంగ్రెస్ వర్గాల అంచనా. తాజా పరిణామాల నేపథ్యంలో రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తొలిసారి తన సొంత నియోజకవర్గమైన అమేథీలో సోమవారం నుంచి రెండు రోజులపాటు పర్యటించనున్నారు. పార్టీ అధ్యక్ష పదవిని రాహుల్ చేపట్టడంపై అన్ని వర్గాల్లోనూ ఆనందం వ్యక్తం అవుతోంది. తొలిసారిగా పార్టీ అధినేతగా అమేథీ వస్తున్న రాహుల్‌కు భారీఎత్తున స్వాగతం పలికేందులు పార్టీ శ్రేణులు సన్నద్ధం అవుతున్నాయి. యూపీలో మంచి ఫలితాలను సాధించాలన్న పట్టుదల అధినాయకత్వానికి ఉన్నప్పటికీ ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీని అన్ని విధాలుగా పార్టీని బలోపేతం చేయకపోతే ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అసాధ్యమేనన్న అభిప్రాయమూ వ్యక్తమవుతోంది. అయితే గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కువ సీట్లను సంపాదించడం ద్వారా రాహుల్ గాంధీ తన సత్తాను చాటుకున్నారు కాబట్టి వ్యూహాత్మకంగా చర్యలు చేపట్టి అభ్యర్థుల ఎంపిక మొదలుకుని అన్ని అంశాల్లోనూ తగిన జాగ్రత్తలు తీసుకుంటే యూపీలోనూ గణనీయమైన సంఖ్యలో సీట్లను సంపాదించడం అసాధ్యం కాదన్న అభిప్రాయాన్ని పార్టీ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. అమేథీలో అడుగుపెట్టనున్న రాహుల్ మొత్తం ఏడు ప్రాంతాల్లో రోడ్ షోలు నిర్వహించే అవకాశం ఉంది. రాహుల్ వస్తున్నారన్న వార్త అమేథీ ప్రజల్లో సరికొత్త ఉత్సాహాన్ని కలిగిస్తోందని యూపీ కాంగ్రెస్ నాయకుడు అఖిలేష్ సింగ్ తెలిపారు. ఉత్తర ప్రదేశ్ రాజకీయాల గురించి, వాటి తీరుతెన్నుల గురించి రాహుల్‌కు లోతైనా అవగాహన ఉందని, ఇప్పటికే ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలతో కలిసి పనిచేశారని అఖిలేష్ సింగ్ అన్నారు. రాహుల్‌తోపాటు ఆయన లక్ష్య సాధనలో పాలుపంచుకోవడానికి పార్టీ శ్రేణులన్నీ సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్న సింగ్, 2019 లోక్‌సభ ఎన్నికల్లో గణనీయమైన రీతిలో సీట్లను గెల్చుకునే విధంగా పార్టీని శక్తివంతం చేసే దిశగా కాంగ్రెస్ పార్టీ చర్యలు చేపడుతోందన్నారు.



పులికాట్ సరస్సులో ఆదివారం కనువిందు చేసిన ఫ్లెమింగోలు. శ్రీహరికోట సమీపంలోని నల్లపట్టు తీరంలోనిది ఈ దృశ్యం

బిజినెస్

పన్ను లేకుండా 20లక్షల వరకూ గ్రాట్యుటీ!

బడ్జెట్ భేటీలోనే బిల్లుకు ఆమోదం?

న్యూఢిల్లీ, జనవరి 14: కొత్త బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఉద్యోగ వర్గాలకు ముఖ్యంగా రిటైర్ అయ్యే వారికి తిరుగులేని ఆనందాన్ని మిగిల్చబోతున్నట్లు తెలుస్తోంది. దాదాపు 20లక్షల వరకు వచ్చే గ్రాట్యుటీ మొత్తంపై పన్ను లేకుండానే మాజీ ఉద్యోగులకు అందించే ప్రతిపాదనకు ప్రభుత్వం పదును పెడుతోంది. గ్రాట్యుటీ చెల్లింపుల సవరణ బిల్లును రానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం ఆమోదించే అవకాశం కనిపిస్తోంది. ఈ బిల్లు ఆమోదితమైతే ఎలాంటి పన్ను చెల్లించకుండానే గ్రాట్యుటీ మొత్తంగా 20 లక్షల రూపాయలను ఉద్యోగులు పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం రిటైరైన ఉద్యోగులకు లేదా ఐదు అంతకుమించి సర్వీసు కలిగిన ఉద్యోగులకు పది లక్షల వరకు పన్ను లేకుండా గ్రాట్యుటీ పొందే అవకాశం ఉంది. ఈ వారంలోనే గ్రాట్యుటీ చెల్లింపుల సవరణ బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వ్యవస్థీకృత రంగానికి చెందిన కార్మికులకు పన్ను లేకుండా 20 లక్షల రూపాయల గ్రాట్యుటీ మొత్తాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అధికార వర్గాలు తెలిపాయి. ఇప్పటికీ ఈ బిల్లును గత నెల లోక్‌సభలో ప్రవేశపెట్టారు. దీనికి పార్లమెంట్ ఆమోదం లభిస్తే పన్ను లేకుండా గ్రాట్యుటీ చెల్లింపు విషయంలో ప్రభుత్వం ఇతరత్రా ఎలాంటి అనుమతులను తీసుకోవాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. అలాగే ఈ బిల్లు ద్వారా అనేక అంశాలను కూడా ప్రభుత్వం నోటిఫై చేయబోతోంది. ప్రసూతి సెలవుల విషయంలోనూ వెసులుబాటు కల్పించబోతోంది. ఫ్యాక్టరీలు, గనులు, రేవులు, రైల్వే కంపెనీలు, దుకాణాలు ఇతర సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు గ్రాట్యుటీ మొత్తాన్ని చెల్లించాలనే ఉద్దేశంతో 1972లో గ్రాట్యుటీ చట్టాన్ని తీసుకువచ్చారు. పది లేదా అంతకుమించి ఉద్యోగులు పనిచేస్తున్న ఏ సంస్థలోనైనా కనీస పక్షంగా ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి ఈ చట్టం వర్తిస్తుంది.

కార్పొరేట్ల లాభాలే ప్రధానం

ప్రభావితం చేయనున్న ద్రవ్యోల్బణ గణాంకాలు ■ ఈ వారం మార్కెట్ గమనంపై నిపుణుల అంచనా



న్యూఢిల్లీ, జనవరి 14: మూడో త్రైమాసికంలో బ్లూచిప్‌లు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, విప్రోలు సాధించే లాభాలతో పాటు టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం గణాంకాలు ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులను నిర్దేశించనున్నాయని నిపుణులు పేర్కొన్నారు. 'స్టాక్ మార్కెట్లలోకి పెద్ద మొత్తంలో పెట్టుబడులు తరలి రావడం, ప్రపంచ స్టాక్ మార్కెట్లలో నెలకొన్న ఉత్సాహం కారణంగా ఈ వారం దేశీయ స్టాక్ మార్కెట్లు ప్రస్తుత సానుకూల ధోరణిలోనే కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే సమీప భవిష్యత్తులో మార్కెట్ దృష్టి ఈ ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసిక ఫలితాలు, బడ్జెట్ సంబంధిత సానుకూల అంశాలపైనా కేంద్రీకృతమై ఉంటుంది' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగం అధిపతి వినోద్ నాయర్ పేర్కొన్నారు. శుక్రవారం మార్కెట్ పని వేళలు ముగిసిన తరువాత విడుదలయిన ఐఐపీ, రిటెయిల్ ద్రవ్యోల్బణం గణాంకాల పట్ల కూడా మదుపరులు స్పందించే అవకాశం ఉంది. తయారీ రంగం (మానుఫాక్చరింగ్ సెక్టార్) మెరుగైన పనితీరు కారణంగా పారిశ్రామిక ఉత్పత్తి వృద్ధి నవంబర్ నెలలో 17 నెలల గరిష్ఠ స్థాయిలో 8.4 శాతం నమోదయింది. అయితే ఈ సానుకూలాంశం వల్ల నెలకొన్న ఉత్సాహంపై డిసెంబర్ నెలలో 17 నెలల గరిష్ఠం 5.2 శాతానికి పెరిగిన చిల్లర ద్రవ్యోల్బణం నీళ్లు చల్లింది. శుక్రవారంతో ముగిసిన వారంలో దేశీయ స్టాక్ మార్కెట్లు సానుకూలంగా ముగిశాయి. కీలక సూచీలు సరికొత్త జీవనకాల గరిష్ఠ స్థాయిలకు చేరుకున్నాయి. కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక లాభాలు బాగుంటాయన్న మదుపరుల అంచనాలు మార్కెట్లలో కొనుగోళ్లకు దారితీశాయి. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటీ) సేవల దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) అంచనాలకు తగిన రీతిలో ఫలితాలు సాధించనప్పటికీ, మరో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మెరుగయిన ఫలితాలనే నమోదు చేసింది. 'స్టాక్ మార్కెట్‌లో ఉత్సాహపూరిత వాతావరణం కొనసాగుతుంది. అయితే, పెరుగుతున్న ముడి చమురు ధరలు ఇప్పటి వరకు ఆందోళన కలిగించే అంశం' అని అరిహంట్ క్యాపిటల్ మార్కెట్స్ హోల్‌టైమ్ డైరెక్టర్ అనితా గాంధీ పేర్కొన్నారు. గత వారం బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సెన్సెక్స్ 438.54 పాయింట్లు (1.28 శాతం) పుంజుకోగా, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) నిఫ్టీ 122.40 పాయింట్లు (1.15 శాతం) పెరిగింది. 'సోమవారం వెలువడే ద్రవ్యోల్బణం గణాంకాలపై మార్కెట్ దృష్టి ఉంటుంది. మూడో త్రైమాసిక ఫలితాలు వెలువడే సీజన్ ఈ వారం కొనసాగుతుంది. హిందుస్తాన్ యూనిలీవర్, యెస్ బ్యాంక్, ఐటీసీ, కొటక్ మహీంద్రా వంటి దిగ్గజాల త్రైమాసిక ఫలితాలు వెలువడనున్నాయి. అయితే మూడో త్రైమాసికంలో మెరుగయిన ఫలితాలను నమోదు చేసిన ఇన్ఫోసిస్ సానుకూల ప్రభావం ఈ వారం మార్కెట్‌పై కొంత వరకు ఉంటుంది' అని ఎపిక్ రీసెర్చ్ కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) ముస్తఫా నదీమ్ విశ్లేషించారు. దేశంలో రెండో అతి పెద్ద ఐటీ ఎక్స్‌పోర్టర్ అయిన ఇన్ఫోసిస్ ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో 38.3 శాతం వృద్ధితో రూ. 5,129 కోట్ల నికర లాభాన్ని ఆర్జించినట్లు వెల్లడించింది. 'ప్రస్తుతం వెలువడుతున్న కార్పొరేట్ కంపెనీల మూడో త్రైమాసిక ఫలితాలపైన, రానున్న బడ్జెట్ అంచనాలపైన మార్కెట్ ఆధారపడి ఉంటుంది' అని కొటక్ సెక్యూరిటీస్‌లోని పీసీజీ రీసెర్చ్ వైస్ ప్రెసిడెంట్ సంజీవ్ జర్‌బాదే పేర్కొన్నారు. 'ప్రభుత్వం ప్రకటించే విధాన నిర్ణయాలను మదుపరులు జాగ్రత్తగా పరిశీలిస్తారు. కేంద్ర బడ్జెట్‌లో ఈ విధాన నిర్ణయాలు వెలువడనున్నాయి. అందువల్ల విధాన నిర్ణయాలతో కూడిన బడ్జెట్ సమీప భవిష్యత్తులో మార్కెట్ దిశను నిర్దేశించనుంది' అని సామ్‌కో సెక్యూరిటీస్ వ్యవస్థాపకుడు, సీఈఓ జమీత్ మోదీ విశ్లేషించారు.

వ్యవసాయానికే పెద్దపీట

■ లాభాలు రైతులకు అందితేనే ఆర్థిక వృద్ధికి సార్థకత
■ కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ



అగ్రి-ఆప్షన్స్ లావాదేవీలను ప్రారంభిస్తున్న కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ

న్యూఢిల్లీ, జనవరి 14: వ్యవసాయ రంగానికే తమ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అన్నారు. అభివృద్ధి ఫలాలు రైతులకు చేరకుంటే, దేశ ఆర్థిక వృద్ధి న్యాయ సమ్మతమూ, నిష్పాక్షికమూ అనిపించుకోజాలదని ఆయన పేర్కొన్నారు. అందుకే తమ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అగ్ర తాంబూలం వేస్తోందని ఆయన స్పష్టం చేశారు. లాభాలు రైతులకు చేరాలని, వ్యవసాయ రంగంలో అభివృద్ధి కనపడాలని తమ ప్రభుత్వం భావిస్తోందని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటోందని జైట్లీ పేర్కొన్నారు. త్వరలో కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న తరుణంలో ఆర్థిక మంత్రి చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. మకర సంక్రాంతిని పురస్కరించుకొని ఢిల్లీలోని నేషనల్ కమాడిటి అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ (ఎన్‌సీడీఈఎక్స్)లో శనివారం జైట్లీ తొలిసారి అగ్రి-ఆప్షన్స్ లావాదేవీలను గంట కొట్టి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాల్లో వ్యవసాయ రంగం అగ్ర స్థానంలో ఉందని స్పష్టం చేశారు. సెంట్రల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (సీఎస్ఓ) ఇటీవల విడుదల చేసిన గణాంకాల ప్రకారం, 2017-18 ఆర్థిక సంవత్సరంలో దేశ ఆర్థిక వృద్ధి నాలుగేళ్ల కనిష్ట స్థాయిలో 6.5 శాతమే నమోదవుతుందని అంచనా. ఈ నేపథ్యంలో జైట్లీ శనివారం నాటి తన ప్రసంగంలో వ్యవసాయ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యత గురించి నొక్కి చెప్పారు. దేశంలోని కొన్ని ప్రాంతాలలో పంటల అధిక ఉత్పత్తుల వల్లనే ధరలు తగ్గిపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయని జైట్లీ ఈ సందర్భంగా అన్నారు. రైతులు తమ పంటలకు తగిన ధరలను పొందలేక పోతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులను ఈ పరిస్థితి నుంచి బయటకు తీసుకు రావడానికి తమ ప్రభుత్వం గత కొన్నేళ్లుగా అనేక చర్యలు తీసుకుందని చెప్పారు.

రూ.66,619 కోట్లు

■ తొమ్మిది పెద్ద సంస్థల పెరిగిన మార్కెట్ విలువ
■ పది సంస్థల్లో తగ్గింది ఒక్క ఎస్‌బీఐ విలువే



న్యూఢిల్లీ, జనవరి 14: దేశంలోని పది అత్యంత విలువయిన కంపెనీలలో తొమ్మిది కంపెనీలు కలిసి గత వారం మార్కెట్ విలువలో రూ.66,619.4 కోట్లు జత చేశాయి. వీటిలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), రిలయన్స్ ఇండస్ట్రీస్ (రిల్) అధికంగా లబ్ధి పొందాయి. ప్రభుత్వ రంగ బ్యాంకు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మినహా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్ సహా మిగతా తొమ్మిది కంపెనీలు శుక్రవారంతో ముగిసిన వారంలో తమ మార్కెట్ క్యాపిటలైజేషన్ (ఎం-క్యాప్)ను పెంచుకున్నాయి. గత వారం టీసీఎస్ ఎం-క్యాప్ రూ. 16,931.88 కోట్లు పెరిగి, రూ. 5,30,812.81 కోట్లకు చేరుకుంది. రిల్ ఎం-క్యాప్ రూ. 15,042.08 కోట్లు పెరిగి, రూ. 5,99,624.45 కోట్లకు చేరుకుంది. ఇన్ఫోసిస్ ఎం-క్యాప్ రూ. 14,479.59 కోట్లు పెరిగి, రూ. 2,35,517.15 కోట్లకు చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ ఎం-క్యాప్ రూ. 5,639.5 కోట్లు పెరిగి, రూ. 2,81,375.80 కోట్లకు చేరుకుంది. ఐటీసీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 5,607.61 కోట్లు పెరిగి, రూ. 3,26,094.72 కోట్లకు చేరుకుంది. హిందుస్తాన్ యూనిలీవర్ లిమిటెడ్ (హెచ్‌యూఎల్) ఎం-క్యాప్ రూ. 3,506.45 కోట్లు పెరిగి, రూ. 2,97,117.97 కోట్లకు ఎగబాకింది. ఓఎన్‌జీసీ ఎం-క్యాప్ రూ. 3,272.47 కోట్లు పెరిగి, రూ. 2,56,985.53 కోట్లకు చేరుకుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 1,346.86 కోట్లు పెరిగి, రూ. 4,83,226.41 కోట్లకు చేరుకుంది. మారుతి సుజుకి ఇండియా ఎం-క్యాప్ రూ. 792.96 కోట్లు పెరిగి, రూ. 2,85,776.80 కోట్లకు చేరుకుంది. ఇందుకు భిన్నంగా ఎస్‌బీఐ గత వారం నష్టపోయింది. ఎస్‌బీఐ ఎం-క్యాప్ రూ. 3,798.11 కోట్లు తగ్గి, రూ. 2,60,515.38 కోట్లకు దిగజారింది. ఈ టాప్ టెన్ సంస్థల్లో రిల్ అగ్ర స్థానంలో నిలువగా, తరువాత స్థానాల్లో వరుసగా టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌యూఎల్, మారుతి సుజుకి ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, ఓఎన్‌జీసీ, ఇన్ఫోసిస్ ఉన్నాయి.

తయారీ రంగంలో.. 30వ స్థానంలో భారత్

■ అయిదో స్థానంలో చైనా
■ అగ్ర స్థానంలో జపాన్
■ ప్రపంచ ఆర్థిక వేదిక వెల్లడి



న్యూఢిల్లీ/ జెనీవా, జనవరి 14: ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) రూపొందించిన గ్లోబల్ మానుఫాక్చరింగ్ ఇండెక్స్‌లో భారత్ 30వ స్థానంలో నిలిచింది. పొరుగు దేశం చైనా అయిదో స్థానంలో నిలిచింది. ఈ జాబితాలో భారత్ చైనాకన్నా బాగా వెనుకబడిపోయినప్పటికీ, మిగతా బ్రిక్స్ దేశాలు- బ్రెజిల్, రష్యా, దక్షిణాఫ్రికాలతో పోలిస్తే మాత్రం ముందుంది. జెనీవా కేంద్రంగా పనిచేస్తున్న డబ్ల్యూఈఎఫ్ తొలిసారి 'రడీనెస్ ఫర్ ద ఫ్యూచర్ ఆఫ్ ప్రొడక్షన్ రిపోర్ట్' పేరిట రూపొందించిన ఈ జాబితాలో జపాన్ అగ్ర స్థానంలో నిలిచింది. తొలి పది స్థానాల్లో జపాన్ తరువాత వరుసగా దక్షిణ కొరియా, జర్మనీ, స్విట్జర్లాండ్, చైనా, చెక్ రిపబ్లిక్, అమెరికా, స్వీడన్, ఆస్ట్రియా, ఐర్లాండ్ ఉన్నాయి. బ్రిక్స్ దేశాలలో రష్యా 35వ స్థానంలో, బ్రెజిల్ 41వ స్థానంలో, దక్షిణాఫ్రికా 45వ స్థానంలో ఉన్నాయి. ఆధునిక పారిశ్రామిక వ్యూహాల అభివృద్ధిని, పరస్పర సహకారాన్ని కోరుకోవడాన్ని విశ్లేషించిన ఈ నివేదికలో మొత్తం వంద దేశాలను నాలుగు గ్రూపులుగా విభజించారు. వీటిలో ఒకటి లీడింగ్ (పటిష్ఠమైన ప్రస్తుత పునాది, భవిష్యత్తు కోసం అధిక స్థాయి సంసిద్ధత), రెండోది హైపొటెన్షియల్ (పరిమితమైన ప్రస్తుత పునాది, భవిష్యత్తుకోసం అధిక అవకాశాలు), మూడోది లెగాసీ (పటిష్ఠమైన ప్రస్తుత పునాది, భవిష్యత్తు కోసం రిస్క్), నాలుగోది నాస్కెంట్ (పరిమిత ప్రస్తుత పునాది, భవిష్యత్తు కోసం తక్కువ స్థాయిలో సంసిద్ధత). హంగరీ, మెక్సికో, ఫిలిప్పీన్స్, రష్యా, థాయిలాండ్, టర్కీ మొదలయిన దేశాలతో కలిసి భారత్ లెగాసీ గ్రూపులో ఉంది. చైనా లీడింగ్ దేశాల జాబితాలో ఉంది. బ్రెజిల్, దక్షిణాఫ్రికా నాస్కెంట్ జాబితాలో ఉన్నాయి.

భలే మంచి చౌక బేరము!

దిగుబడి అధికం..ధర అథమం ■ సంక్రాంతి పూల మార్కెట్ పరిస్థితి ■ ఆన్‌లైన్ పూల ఎగుమతులు

ఆంధ్రభూమి బ్యూరో



రాజమహేంద్రవరం, జనవరి 14: మకర సంక్రాంతి మకరందాలు వెదజల్లే పూల మార్కెట్ డీలా పడింది..వివిధ రకాల పూలు కారుచౌకగా మారాయి. దిగుబడి అధికంగా ఉన్నప్పటికీ ధర అధమంగా ఉండటంతో కుదేలయింది. రాష్ట్రంలోనే అతి పెద్ద పూల మార్కెట్ అయిన కడియపులంక పూల మార్కెట్‌లో సంక్రాంతి సందడి అధికంగా ఉన్నప్పటికీ దిగుబడికి గిరాకీ లేక ధరలు పతనమవడాన్ని రైతులు చవి చూడాల్సి వచ్చింది..కోత కూలీ కూడా దక్కని స్థితిలో పూల రైతులు డీలా పడ్డారు. సంక్రాంతికి కాస్తంత ధరలు ఆశాజనకంగా ఉంటే లాభాలు వచ్చే పరిస్థితి వుంటుందని ఆశించారు. దిగుబడి అధికంగా ఉండటంతో ధరలు కూడా బావుంటాయని అంచనా వేసిన దానికి భిన్నంగా మార్కెట్ మందకొడిగా ఉండటంతో రైతులకు గిట్టుబాటు దక్కలేదు. కడియపులంక పూల మార్కెట్ నుంచి ప్రతీ సంక్రాంతికి రాష్ట్రంలోని అన్ని వ్యాపార కేంద్రాలతో పాటు ఛత్తీస్‌గడ్, ఒరిస్సా, కర్నాటక, తమిళనాడులకు ఎగుమతులు చేస్తుంటారు. ఇందులో ప్రధానంగా తమిళనాడు రాష్ట్రానికి అత్యధిక ఎగుమతి అవుతాయి. కడియపులంకకు ఈ ప్రాంతంలోని సుమారు 10వేల ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన పూల వనాల నుంచి వివిధ రకాల పూల దిగుబడులు వస్తాయి. ఇక్కడ నుంచి వివిధ వాహనాలు, రైళ్ళు, బస్సులు, లారీలు, వ్యాన్లలో వివిధ ప్రాంతాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. స్థానికంగా వున్న మార్కెట్లతో పాటు రాష్ట్రంలోని విశాఖ, విజయవాడ, హైదరాబాద్, విజయనగరం, శ్రీకాకుళం, గుంటూరు, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాలకు అత్యధికంగా ఎగుమతి అవుతున్నాయి. సంక్రాంతి సమయంలో ప్రధానంగా చామంతి, బంతి, గులాబీ రకాలు అత్యధిక దిగుబడులు మార్కెట్‌లో అత్యధికంగా ఎగుమతులు నిర్వహిస్తారు. సంక్రాంతి పండగ మూడు రోజుల పాటు రోజుకు సుమారు రూ. కోటి రూపాయల విలువైన వివిధ రకాల ముడి పూలు ఎగుమతి అవుతాయి. ప్రధానంగా తమిళనాడుకు ఎగుమతులు జరుగుతాయి. తమిళనాడులో గత ఏడాది వర్షాల వల్ల అక్కడికి డిమాండ్ అధికంగా ఉండటంతో ధరలు విపరీతంగా లభించాయి. ఈ ఏడాది అటువంటి పరిస్థితి లేదు. ఎందుకంటే ఆ రాష్ట్రంలో పూల తోటలన్నీ ఆహ్లాదకరంగా పెరగడంతో అక్కడకు ఎగుమతులు చేసే పరిస్థితి కడియపులంక మార్కెట్‌కు దక్కలేదు. దీనికి తోడు స్థానికంగా అత్యధికంగా దిగుబడులు లభించాయి. నాణ్యమైన వివిధ రకాల పూలు కడియపులంకను ముంచెత్తాయి. గత ఏడాది ఇదే సంక్రాంతి సమయంలో రూ. వంద నుంచి నూట ఏభై వరకు ధరలు పలికిన పూలు ఇపుడు కేవలం రూ.40లోపే ధర పలుకుతోంది. దీంతో రైతులకు కనీసం కోత కూలీ కూడా దక్కని పరిస్థితి ఎదురయ్యింది. కేజీ చామంతి పసుపు, తెలుపు, క్రీమ్ కలర్, గడ్డి చామంతి తదితర రకాలు కేజీ కేవలం హోల్‌సేల్‌లో రూ. 30లోపే వున్నాయి. బంతి, చీమ బంతి కూడా ఇదే ధర పలుకుతోంది. మిక్సింగ్ కలర్ చామంతి పూలయితే కేజీ రూ.60లు పలుకుతోంది. ఈ ధరల వల్ల కనీసం కోత కూలీ కూడా దక్కని పరిస్థితి ఉంది. పూల రాశులు ఎగుమతుల డిమాండ్ లేకపోవడం వల్ల కమీషన్ వర్తకులు డీలా పడ్డారు.

కడియం ప్రాంతంలో సుమారు నాలుగు వేల నర్సరీలు ఉన్నాయి. ఈ నర్సరీలన్నీ వివిధ రకాల పూలు, అలంకర పూలతో రమణీయంగా దర్శనమిస్తాయి. ఈ ప్రాంతంలో ఉన్న పూలతోటల నుంచి రోజుకు రూ. కోటి విలువైన పూల ఉత్పత్తులు వస్తుంటాయి. రైతులు తోటల నుంచి పూలను పెద్ద పెద్ద గంపలతో మోటారు సైకిళ్లపై మార్కెట్‌కు తరలిస్తారు. అక్కడ కమిషన్ వర్తకులు మార్కెట్ డిమాండ్‌ను బట్టి ధరలు నిర్ణయించి విక్రయాలు సాగిస్తుంటారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వర్తకులు హోల్‌సేల్‌గా కొనుగోలు చేసుకుని తీసుకెళ్తుంటారు. ఆన్‌లైన్ విధానంలో కూడా కమిషన్ వర్తకులు వివిధ ప్రాంతాలకు ఎగుమతులు చేస్తుంటారు. ఆన్‌లైన్ ద్వారా పూల వివరాలు తెలుసుకుని ధరలను బట్టి అప్పటికపుడు ఎగుమతులు చేసే అవకాశం కూడా ఉంది. ఆన్‌లైన్ విధానంలో ప్రధానంగా చెన్నై, హైదరాబాద్, కోల్‌కతాకు ఎగుమతి అవుతుంటాయి. ఆయా ప్రాంతాల పెద్ద పెద్ద కమిషన్ వర్తకులు ఆన్‌లైన్‌లోనే డిమాండ్‌కు అనుగుణంగా పూలను కొనుగోలు చేయడంతో ఎగుమతులు జరుగుతున్నాయి. సంక్రాంతికి ప్రధానంగా అలంకరణ, ధనుర్మాస ఉత్సవాలకు పూలు ఎగుమతులు విపరీతంగా జరుగుతుంటాయి. మొత్తం మీద ఈ సారి సంక్రాంతి పూల మార్కెట్ కారు చౌకగానే సాగుతోంది.



మకర సంక్రాంతిని పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతా సమీపంలోని గంగాసాగర్ వద్ద పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

సంక్రాంతి వెల్లివిరియాలి

■ దేశ ప్రజలకు ప్రధాని శుభాకాంక్షలు
■ గంగాసాగర్ వద్ద పవిత్ర స్నానాలు
■ లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

న్యూఢిల్లీ, జనవరి 14: సంక్రాంతి పర్వదినం సందర్భంగా శాంతి సంపదలు చేకూరాలన్న ఆకాంక్షలను ప్రధాని నరేంద్ర మోదీ వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపిన మోదీ, ఈ పర్వదినం ప్రతి ఒక్కరిలోనూ ఆనందాన్ని పాదుగొల్పాలని వివిధ పండుగలు ఏకకాలంలో వస్తున్నందున ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు చెబుతున్నానని పేర్కొన్నారు. తమిళ ప్రజలకు పొంగల్ శుభాకాంక్షలను తెలిపిన మోదీ, ఆనందం, సామరస్యం, ఆరోగ్యంతో ప్రతి ఒక్కరూ జీవించాలని ఆకాంక్షించారు. తెలుగులోనూ, తమిళంలోనూ ఆయన ట్వీట్ చేశారు. మకర సంక్రాంతి శుభాకాంక్షలను హిందీ ట్వీట్‌లో తెలిపారు. అలాగే లోహ్రీ పండగ ఆనందాన్ని కలిగించాలంటూ ఇంగ్లీషు, పంజాబీ భాషల్లో ట్వీట్ చేశారు. మకర సంక్రాంతి సందర్భంగా దాదాపు ఐదు లక్షల మంది యాత్రికులు ఆదివారం గంగానది బంగాళాఖాతంలో కలిసే గంగాసాగర్ వద్ద పుణ్య స్నానాలు చేశారు. వార్షిక గంగాసాగర్ ఉత్సవానికి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఓ పక్క ఎముకలు కొరికే రీతిలో చలి వణికిస్తున్నా భక్తి పారవశ్యంతో పుణ్య స్నానాలు ఆచరించారు. పశ్చిమ బెంగాల్‌లోని 24 పరగణాల జిల్లాకు 150 కి.మీ దూరంలో ఉన్న గంగాసాగర్‌లో స్నానం చేయడాన్ని హిందువులు పవిత్రంగా భావిస్తారు. అందుకే ఏటా మకర సంక్రాంతి రోజున ఇక్కడికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి కపిలముని ఆలయంలో ప్రార్థనలు చేస్తారు.



రాజస్థాన్‌లోని బికనీర్‌లో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఒంటెల పండుగలో ఆదివారం ఒంటెచేత విన్యాసాలు చేయుస్తున్న దృశ్యం





సికిందరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న అంతర్జాతీయ పతంగుల పండుగ (కైట్ ఫెస్టివల్), స్వీట్ ఫెస్టివల్ సందర్భంగా పతంగిని ఎగురవేస్తున్న సికిందరాబాద్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ, జనంతో కిటకిటలాడుతున్న మైదానం, స్వీట్ ఫెస్టివల్‌లో స్వీట్లు తింటున్న యువతులు

బాలల హక్కుల కమిషన్ ఎంపికకు ప్రత్యేక కమిటీ

◆ **జీఓ జారీ చేసిన ప్రభుత్వం**

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: బాలల హక్కుల రక్షణ రాష్ట్ర కమిషన్ చైర్మన్, సభ్యుల నియామకం కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ కమిటీ చైర్మన్, సభ్యుల ఎంపిక కోసం ఉన్నత స్థాయి సెలక్షన్ కమిటీని ప్రభుత్వం నియమించింది. మహిళా శిశు సంక్షేమ మంత్రి చైర్‌పర్సన్‌గా ఉండే ఈ కమిటీలో హైకోర్టు చీఫ్ జస్టిస్ నామినేట్ చేసే ఒకరు, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ నామినేట్ చేసే మరొకరు సభ్యులుగా ఉంటారని ప్రభుత్వం ప్రకటించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. జగదీశ్వర్ పేరుతో ఈ మేరకు జీఓ జారీ అయింది.

కక్ష సాధింపు ధోరణి వద్దు

◆ **సర్కారుకు సీపీఐ నేత చాడ సూచన**

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 14: ప్రతిపక్ష పార్టీల, ప్రజా సంఘాల నాయకులపై రాష్ట్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విమర్శించారు. టి.టిడిపి అనుబంధ విభాగమైన తెలుగు రైతు అధ్యక్షుడు ఒంటేరు ప్రతాప్ రెడ్డి భూ నిర్వాసితుల సమస్యపై క్రియాశీలకంగా ఉద్యమిస్తే, ఆయన్ను అరెస్టు చేసి జైలుకు పంపించారని చాడ వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగపై కూడా ప్రభుత్వం కక్ష సాధింపు దోరణితో వ్యవహారిస్తున్నదని ఆయన విమర్శించారు. ప్రతిపక్షాలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం మానుకోవాలని, అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కోడి పందేలు సంప్రదాయంలో భాగమే

◆ **చట్టం తెస్తాం: ఏపీ ఉప ముఖ్యమంత్రి చినరాజప్ప**

పాలకొల్లు, జనవరి 14: సంక్రాంతికి కోడి పందేలు వేయటం సంప్రదాయాల్లో భాగమేనని, అసెంబ్లీలో చట్టం చేసి, పోలీసులు గానీ, మరే ఇతరుల అనుమతితో సంబంధం లేకుండా రాష్ట్రంలో చట్టం చేయాలని తాను ముఖ్యమంత్రిని కోరతానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, హోం శాఖ మంత్రి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. పశ్చిమగోదావరి జిల్లాలో పాలకొల్లులో మంత్రి ఈ విలేఖరితో మాట్లాడారు. దీనిపై మంత్రి పితాని సత్యనారాయణ పాలకొల్లులో దక్షిణ భారత స్థాయి ఎమ్మెల్యే కప్ వాలీబాల్ పోటీలు తిలకిస్తూ దీర్ఘంగా చర్చించారు. ముగ్గుల పోటీలు, విచిత్ర వేషాలు, గంగిరెద్దులు ఇలా అనేక విషయాలు ఈ పండుగ నాడు ప్రజల ముందుకు వస్తాయని, కోడి పందేలు కూడా అంతేనని హోం మంత్రి అభిప్రాయ పడ్డారు.

ఆంక్షల పెట్టపై పుంజు గెలుపు

◆ **నిబంధనలు బేఖాతర్.. జోరుగా కోడి పందేలు**
◆ **బరులు ప్రారంభించిన ప్రజాప్రతినిధులు** ◆ **ఢీ అంటే ఢీ అన్న నిర్వాహకులు** • **పండుగ సరదాకు గేట్లు బార్లా**
◆ **బిర్యానీ, క్వార్టర్ ఫ్రీ** ◆ **మధ్యలోనే పోలీసులు వెనక్కి** ◆ **చేతులెత్తేసిన గ్రామ కమిటీలు**

ఆంధ్రభూమిబ్యూరో

ఏలూరు, జనవరి 14: పశ్చిమగోదావరి జిల్లాలో పండుగ సరదా పేరుతో దానికి సంప్రదాయం ముసుగు వేసి జరిగే కోడిపందేల విషయంలో ఇదే అంశం మరో ఏడాది నిరూపితమైంది. గతానికి భిన్నంగా ఈసారి పోలీసు పహారా అధికంగా కనిపించటం, న్యాయస్థానాల జోక్యం కూడా గట్టిగానే ఉండటంతో ఈసారి అనుకోనిది జరుగుతుందన్న పరిస్థితికి కారణమైంది. కానీ చివరినిముషంలో మాత్రం ఎప్పటిలానే కోడిపందాలకు గేట్లు బార్లా తెరుచుకోవటంతో ఈసారి కూడా ఎప్పటిలానే పుంజే అందరిపైనా విజయం సాధించింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇటు న్యాయస్థానాల ఆదేశాలు, అటు పోలీసు, జిల్లా యంత్రాంగాల ఆంక్షల మధ్య ఈసారి పందెం పడుతుందా లేదా అన్న అందోళనను పందెగాళ్లలో ఉదయం వరకు సృష్టించింది. ఇరువర్గాలు హోరాహోరీగానే ఏర్పాట్లు చేసుకున్నారు. చివరకు ముందునుంచి ఊహించినట్లే మధ్యాహ్న సమయానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చేయటంతో పోలీసులు వెనక్కి, పందెగాళ్లు బరిలోకి వెళ్లిపోయారు. ఇక అక్కడనుంచి ఈ జాతర జోరుగానే ప్రారంభమైంది. దీనికితోడు పందాల నియంత్రణకు అంటూ ఏర్పాటుచేసిన గ్రామ కమిటీలు కొన్నిచోట్ల చేతులెత్తేశాయి. ఫలానా చోట పందాలు జరుగుతున్నాయి నిరోధం మావల్ల కాదు, మీరే చర్యలు తీసుకోవాలంటూ ఉండి పోలీసుస్టేషన్‌లో స్వయంగా గ్రామకమిటీ సభ్యులైన విఆర్వోలు, విఆర్‌ఎలు, గ్రామ కార్యదర్శులు వినతిపత్రాలు ఇచ్చుకునే పరిస్థితి కూడా తలెత్తింది. ఇక పెదవేగి మండలం కొప్పాకలో ఆనవాయితీగానే సంక్రాంతి సంబరాలు జరుగుతున్నాయని, దానిలోభాగంగానే అక్కడ టెంట్లు వేసి, భోజనాలు పెడుతున్నారంటూ స్వయంగా స్థానిక పోలీసు అధికారులే ప్రకటనలు విడుదల చేయటం మరో విశేషం. తొలిరోజున చిన్నతరహా నుంచి మోస్తరు వరకు ఈపందాల అభివృద్ధి చోటుచేసుకోగా ఇక సోమవారం నుంచి భారీ పందాలు రంగంలోకి దిగే పరిస్థితే కనిపిస్తోంది. భీమవరం రూరల్ వెంపతోపాటు మరికొన్నిచోట్ల పోలీసులు బలవంతంగా బరులు మూయించేందుకు ప్రయత్నించినా అవి చివరకు ఉద్రిక్తపరిస్థితులకు దారితీశాయి. అయినప్పటికీ పోలీసులు కొన్నిచోట్ల పోరాడుతున్నా అధికశాతం మాత్రం పందేల జాతర గతంకంటే ఎక్కువగానే ప్రారంభమైపోయింది. జిల్లాలో కోడిపందేలకు పేరొందిన వెంపపై ఈసారి అటు అధికారయంత్రాంగం, ఇటు పోలీసులు కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించటంతో అక్కడ పందాలు పూర్తిస్థాయిలో ముందుకు సాగలేదు. సాయంత్రం సమయానికి కూడా అక్కడ ఎఆర్ అదనపు ఎస్పీ మహేష్‌కుమార్ సారధ్యంలో భారీ సంఖ్యలో పోలీసులు మోహరించే ఉన్నారు. ఇక ఆదివారం మధ్యాహ్నం 12.30గంటల వరకు బరులు చుట్టూ తిరిగిన పోలీసులు ఒక్కసారిగా మంత్రం వేసినట్లు అయా ప్రాంతాల నుంచి వెనుదిరిగారు. ఈ పరిణామాన్ని ముందునుంచి చెబుతున్న నిర్వాహకులు ఆ వెనువెంటనే శరవేగంగా ఏర్పాట్లన్నీ పూర్తి చేసేసి మధ్యాహ్న సమయానికి కోడిపందాలను ప్రారంభించేశారు. తొలిరోజున చిన్నచితకా, ఒక మోస్తరు పందాలకు శ్రీకారం చుట్టారు. ఇక పండుగ సరదాకు అడ్డుఅదుపు లేదని ఊరువాడా ప్రచారం మొదలైపోయింది. దీంతో సోమవారం నాటికి ఈ పరిస్థితి పరాకాష్ఠకు చేరుకుంటుందని భావిస్తున్నారు. దీంతోపాటే జిల్లాలో జరుగుతున్న పరిణామాలను ఆసక్తిగా పరిశీలిస్తున్న ప్రముఖులు కొందరు(కోడిపందాలరాయుళ్లు) జిల్లా వైపు ఒక్కసారిగా పయనం ప్రారంభించారు. తొలిరోజున కొద్దిపాటి ప్రముఖుల తాకిడి జిల్లాలో కొన్నిచోట్ల కన్పించినా సోమవారం మాత్రం బంపర్ ఆఫర్ మాదిరిగా అటు కోడిపందాలు, ఇటు ప్రముఖులు, మరోవైపు జూదాల జాతర ఇలా అన్నీకలిసి పూర్తిస్థాయి 'పండగ సరదా'కు తెర తీస్తాయనే భావించాలి. అయితే సంక్రాంతి సీజన్ మొదలవుతున్న తరుణంలోనే జిల్లా ఎస్పీ ఎం రవిప్రకాష్ దీనికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట వేసేందుకు వినూత్నరీతిలోనే కొన్ని ప్రయత్నాలు ప్రారంభించారు. దానికి న్యాయస్థానాల ఆదేశాలు కూడా తోడయ్యాయి. వీటితోనే ఆదివారం ఉదయం వరకు పందేల నిరోధానికి భారీ ప్రయత్నమే జరిగిందని చెప్పుకోవాలి. చివరకు రాజకీయం గెలిచి రాజధాని నుంచి మౌఖిక ఆదేశాలు రావటంతో పోలీసు యంత్రాంగం బరుల నుంచి తిరిగి స్టేషన్లకు పయనమైంది. ప్రముఖమైన ప్రాంతాల్లో పందాలను, నిర్వాహకులను వీడియోచిత్రీకరణ చేసేందుకు పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేసుకుంది. ఏదిఏమైనా ఏటా మాదిరిగానే ఈసారి కొంత హడావిడి గట్టిగా జరిగినా కోడిపందాలు మాత్రం యధాప్రకారం ప్రారంభమయ్యాయి.జిల్లాలో పరిస్థితిని చూస్తే డెల్టా ప్రాంతంలోని పలుచోట్ల ఈ పందాలకు తొలిరోజునే శ్రీకారం చుట్టారు. ఆ ప్రాంత నాయకులు చాలామంది పందాలకు అనుకూలంగా ప్రయత్నాలు చేసుకుంటూ కొంత మంది న్యాయస్థాలను కూడా ఆశ్రయించిన నేపధ్యంలో దాదాపు తొలి పందాలు అక్కడ నుంచే ప్రారంభమైనట్లు చెబుతున్నారు. ఇక జిల్లా కేంద్రమైన ఏలూరు పరిసరాల్లోనూ ఈపందాలు ఉదయం నుంచి కొంత జాగ్రత్తగాను, మధ్యాహ్నం నుంచి విచ్చలవిడిగానూ జరిగిపోయాయి. ఆదివారం కొయ్యలగూడెం మండలం రామానుజపురంలో పోలవరం ఎమ్మెల్యే మొడియం శ్రీనివాసరావు, పెదవేగి మండలం కొప్పాకలో ప్రభుత్వ విప్ చింతమనేని ప్రభాకర్, భీమడోలు మండలం గుండుగొలనులో ఉంగుటూరు ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు కోడిపందేలను ప్రారంభించగా, ఆకివీడు మండలం ఐ భీమవరంలో ఉండి ఎమ్మెల్యే వి శివరామరాజు, బిజెపి నేత కనుమూరి రఘురామకృష్ణంరాజు కోడిపందేలను వీక్షించారు. కొన్నిప్రాంతాల్లో విదేశీవనితలు కూడా పాల్గొనడం ఈసారి ప్రత్యేకతగా భావించవచ్చు. డెల్టా ప్రాంతంలోని సీసలి, పూలపల్లి, వెంప, ఐ భీమవరం, మహాదేవపట్నం, మొగల్తూరు, కెపి పాలెం, పేరుపాలెం, కాళీపట్నం, మెట్టప్రాంతంలోని జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురం, పెదవేగి మండలం కొప్పాక, భీమడోలు మండలం గుండుగొలను, తణుకు మండలం వేల్పూరు, చింతలపూడి మండలం సీతానగరం, టి నర్సాపురం మండలం టి నర్సాపురం, అప్పలరాజుగూడెం, ద్వారకాతిరుమల మండలం తిమ్మాపురం, గుణ్ణంపల్లి తదితర ప్రాంతాల్లో భారీ పందాలు నిర్వహించారు. ఊరువాడా ఎక్కడ చూసినా కోడిపందాల బరులే దర్శనమిచ్చాయి. ఇక బరుల వద్ద జూదాల జాతర కొనసాగింది. కోతాట, గుండాటతో పాటు మద్యం పరవళ్లు తొక్కింది. పందెగాళ్లను ప్రోత్సహించేందుకు కొన్నిచోట్ల బిర్యానీ ప్యాకెట్లు, మరికొన్నిచోట్ల క్వార్టర్ మందు కూడా ఉచితంగా పంపిణీ చేశారు. ఈ ఏడాది ప్రత్యేకత ఏమిటంటే గతంలో కోడిపందాల నిర్వహణకు పెద్దలు బాధ్యత తీసుకోగా ఈసారి మాత్రం చాలాచోట్ల ప్రజాప్రతినిధులే ఆ బాధ్యతను తమపై మోపుకుని ముందుగానే బేరాలు కుదుర్చుకోవటం.



క్యాబ్ డ్రైవర్ వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ జాయింట్ సీపీ తరుణ్ జోషీ

కీచక క్యాబ్ డ్రైవర్

◆ **బాలిక కిడ్నాప్..చోరీ**

◆ **మహిళపై అత్యాచార యత్నం కేసులో ఓలా డ్రైవర్ అరెస్టు**

◆ **సీసీ కెమెరాల ఆధారంగా వీడిన కేసు మిస్టరీ**

హైదరాబాద్/ఉప్పల్, జనవరి 14: మైనర్ బాలికను కిడ్నాప్ చేసి ఆమె వద్ద నగదు చోరీ చేసి తప్పించుకు తిరుగుతూ..మరో మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన ఓలా క్యాబ్ డ్రైవర్‌ను అరెస్టు చేసి రిమాండ్ చేస్తున్నట్లు రాచకొండ జాయింట్ కమిషనర్ తరుణ్ జోషీ తెలిపారు.

ఆదివారం మేడిపల్లి పోలీసుస్టేషన్ ఆవరణలో మల్కాజిగిరి డిసిపి ఉమా మహేశ్వర శర్మ, ఎస్‌ఓటి అడిషనల్ డిసిపి రఫిక్, ఏసిపి కృష్ణమూర్తి, ఇన్స్పెక్టర్ కె.చంద్రశేఖర్, ఎస్‌ఐలు జి.చంద్రశేఖర్, జె.అశోక్‌కుమార్‌లతో కలిసి విలేకరుల సమావేశంలో తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ పరిధిలోని శాంతినగర్ లాలపేట్‌లో నివసిస్తున్న కందుకూరి నాగ మధుకిరణ్ (29) ఓలా క్యాబ్ డ్రైవర్. అతడు ఈనెల 5వ తేదీన రాత్రి 10-30 గంటల సమయంలో డ్రైవింగ్ చేస్తూ వెళ్తుండగా కుషాయిగూడ రాధిక థియేటర్ చౌరస్తాలో ఓ మహిళ లిఫ్ట్ అడిగింది.

ఆమెను కారులో ఎక్కించుకున్న అతడు కొద్ది దూరంలో ఉన్న కమలానగర్ పార్కువైపు మళ్లించాడు. మధ్యలో కారు ఆపి నా స్నేహితులు వస్తున్నారని, ముందు కూర్చున్న ఆమెను వెనుక సీట్లో కూర్చోబెట్టాడు. అంతటితో ఆగకుండా ఆమెపై బలవంతం చేయబోయాడు. తాను అలాంటిదాన్ని కాదని చెప్పడంతో సారీ చెప్పి దించి పారిపోయాడు. ఆమె ఇచ్చిన ఫిర్యాదుతో కుషాయిగూడ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సిసి కెమెరాల ఆధారంగా నిందితుడు నాగ మధుకిరణ్‌ను పట్టుకుని విచారించగా మరో బాలిక కిడ్నాప్ కేసు మిస్టరీ వీడింది.

గత ఏడాది నవంబర్ 17వ తేదీన కుషాయిగూడ అశోక్‌నగర్‌లో నివసిస్తున్న 10 ఏళ్ల మైనర్ బాలికను విజయా స్కూల్ వద్ద కలిసి పక్కకు తీసికెళ్లి కాళ్లు, చేతులు కట్టేసి ఆమెను బలవంతంగా బైక్‌పై ఎత్తుకెళ్లి కౌకూరు దర్గా వద్ద అఘాయిత్యానికి ప్రయత్నం చేయబోయాడు. పాప అరిస్తే ఆమె చెవి కమ్మలు తీసుకుని పారిపోయాడని విచారణలో వెల్లడైంది. పదవతరగతి చదివిన అతడు సరిగా పని చేయకుండా చేసినా వచ్చే సంపాదనతో ఎంజాయ్ చేస్తూ గతంలో ఎందరో మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించాడని విచారణలో వెల్లడైనట్లు జాయింట్ సిపి తరుణ్ జోషీ తెలిపారు.

1వ పేజీ తరువాయి

ఖైదీల శ్రమైక క్రాంతి

చెప్పవచ్చు. జిందాల్, టాటా స్టీల్‌ను టెండర్ల ప్రక్రియ ద్వారా ముడి సరుకును కొనుగోలు చేసుకుంటున్నారు. పాఠశాలల్లో విద్యార్థులు కూర్చోవడంతో పాటు చదువుకోవడం, రాసుకోవడానికి వెసులుబాటు కల్పించే విధంగా బెంచీలు తయారు చేయించి విక్రయిస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన బెంచీలను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కొనుగోలు చేయగా, నాణ్యతను పరిశీలించిన తర్వాత ఆదిలాబాద్ కలెక్టర్ కూడా ముందుకు వచ్చి కొనుగోలు చేయడం విశేషం. విద్యార్థుల కోసం బెంచీలు మాత్రమే కాకుండా కార్యాలయాల్లో ఉపయోగించే బీరువాలు, ఇళ్లలో ఉపయోగించుకునే బీరువాలను కూడా తయారు చేయిస్తున్నారు. గ్రంథాలయాల్లో పుస్తకాలను పెట్టుకునేందుకు, వ్యాపార కేంద్రాల్లో వస్తు, సామాగ్రిని అమర్చుకునేందుకు అనువుగా ఉండే ర్యాక్‌లు, స్టూళ్లు, కార్యాలయాల టేబుళ్లను కూడా తయారు చేస్తున్నారు. ఈ ఏడాదికి సంబంధించి ఇప్పటికే రూ.1.22 కోట్ల ఆర్డర్ వచ్చిందని జైలు సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్ రాయ్ స్పష్టం చేసారు. జీవిత ఖైదీలతో పాటుగా రిమాండ్ ఖైదీలు కూడా పనిచేస్తూ ఖాళీగా ఉండకుండా సంపాదించుకుంటున్నారు. తూప్రాన్‌కు చెందిన అశోక్ అనే ఖైదీ ఫర్నిచర్‌ను తయారు చేయడంలో నిష్ణాతుడయ్యాడు. రోజుకు 70 రూపాయలు సంపాదిస్తున్నట్లు తెలిపాడు. జైలుకు రాకముందు వ్యవసాయం చేసేవాడినని, జైలు నుండి విడుదలై ఇంటికి వెళ్లాక ఈ పని చేసుకుని ఉపాధి పొందుతానని సంతృప్తిని వ్యక్తం చేయడం గమనార్హం. ఇతర ఖైదీలకు కూడా వారు చేపట్టే పని ఆధారంగా రోజుకు రూ.50, రూ.40 చొప్పున చెల్లిస్తున్నారు. హరితహారం కార్యక్రమంలో పెంచేందుకు అవసరమైన మొక్కలను నర్సరీల్లో పెంచేందుకు కూడా అనుమతులు వస్తున్నాయని జైలు అధికారులు తెలిపారు. సువిశాలంగా ఉన్న జైలు ఆవరణలో దాదాపుగా 15 వేల కలబంద మొక్కలను పెంచుతున్నారు. ఎకరా స్థలంలో పెట్రోల్ ఫిల్లింగ్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అనుమతి లభించినట్లు జైలు సూపరింటెండెంట్ స్పష్టం చేసారు. జైలులో ఖైదీలు తయారు చేస్తున్న వివిధ వస్తువులను ఉమ్మడి మెదక్ జిల్లాలో ఆయా ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేయించి విక్రయింపజేస్తున్నామని వివరించారు. జైళ్ల శాఖ డీజీ వీకే సింగ్ పేర్కొన్నట్లుగానే ప్రభుత్వ నిధుల కోసం ఎదురు చూడకుండా తమకు తామే సమకూర్చుకుంటామని చెప్పిన మాట అక్షర సత్యం చేస్తున్నారు.

కమిటీ ముగ్గులోకి పంచాయతీ

చేపట్టాల్సి ఉంటుంది. ప్రస్తుతం కేంద్రం నుండి నిధులు వస్తున్నాయే తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు ఇవ్వడం లేదు. దాంతో సర్పంచ్‌లు ఆందోళనకు గురవుతున్నారు. పంచాయతీ సంస్థల అవసరాలను పరిశీలించి, నిధులు ఏ రకంగా, ఎంత మేరకు ఇవ్వాలో పరిశీలించేందుకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ పరిశీలిస్తుంది. తెలంగాణ ఏర్పాటు తర్వాత స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటులో జాప్యం జరిగింది. నిన్న మొన్ననే జి. రాజేశంగౌడ్‌ను స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌గా నియమించారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలు ఇక్కట్లకు గురయ్యాయి.

పంచాయతీలకు నిధులు ఇవ్వాలి

పంచాయతీలను పటిష్టం చేస్తామంటూ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉండగా కెటిఆర్ ప్రకటించినప్పటికీ, ఆయన హామీ అమల్లోకి రాలేదు. పంచాయతీలకు అధికారాలను ఇవ్వాలంటూ భారత రాజ్యాంగంలో సవరణ చేశారు. అధికారాలను ఇవ్వాల్సిన రాష్ట్రం ఇవ్వలేదు. పంచాయితీలకు కేంద్రం ఇస్తున్న నిధులు తప్ప, రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడం లేదు. దాంతో పంచాయతీలు నిర్వీర్యం అవుతున్నాయి.

మా గ్రామంలో ఏటా పన్నుల రూపంలో 1,20,000 రూపాయలు వస్తున్నాయి. సిబ్బంది వేతనాలకు కూడా ఇవి సరిపోవడం లేదు. నేను 5 ఏళ్ల కింద సర్పంచ్‌గా ఎన్నికైన తర్వాత కేంద్ర ప్రభుత్వం 14 వ ఫైనాన్స్ కమిషన్ ద్వారా ఏడు లక్షల రూపాయలు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఎలాంటి నిధులు రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం హరితహారం తదితర పథకాల కింద చేపడుతున్న కార్యక్రమాలన్నీ ఆయా శాఖల అధికారుల నేతృత్వంలోనే జరుగుతున్నాయి తప్ప, స్థానిక సంస్థల ప్రమేయం పెద్దగా ఉండటం లేదు. సర్పంచ్‌లకు గౌరవ వేతనం మాత్రం రాష్ట్రం ఇస్తోంది. గ్రామస్వరాజ్యం రావాలంటే పంచాయితీలకు పూర్తి అధికారాలు ఉండాలి. సర్పంచ్ ఎన్నిక ప్రత్యక్ష విధానంలో జరగాలి.

-కె.మోహన్, సర్పంచ్ తిర్మన్‌పల్లి
నిజామాబాద్ జిల్లా

సకాలంలో 'సహకార' ఎన్నికలకు నోచాన్స్?

◆ **31తో ముగియనున్న పాలకవర్గం గడువు**
◆ **కొత్తగా రాష్ట్ర సహకార ఎన్నికల సంస్థ ఏర్పాటు**
◆ **సంఘాల విభజన తరువాతే ఎన్నికలు జరిగే అవకాశాలు**
◆ **ప్రత్యేక అధికారులా..పాలకవర్గం పొడిగింపా..**

ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్, జనవరి 14: అన్నదాతలకు అండగా నిలిచే వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గ ఎన్నికలు సకాలంలో జరిగే అవకాశాలు కన్పించడం లేదు. ఈ నెల 31తో పాలకవర్గం గడువు ముగియనుండగా, వీటి కాలపరిమితిని పొడిగిస్తారా ? ప్రత్యేక అధికారులను నియమిస్తారా ? అనే విషయంలో ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయం వెలువడలేదు. దీంతో సహకార ఎన్నికల నిర్వహణపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 134 సహకార సంఘాలు ఉండగా, జిల్లాల పునర్విభజనతో ఉమ్మడి జిల్లా 104 సంఘాలకే పరిమితమైంది. మిగిలిన సంఘాలు పక్క జిల్లాలైన సిద్దిపేట, వరంగల్ అర్బన్ పరిధిలోకి వెళ్లాయి. అలాగే ఒక కేడీసీసీబీ, ఒక డీసీఎంఎస్‌లు ఉన్నాయి. ప్రస్తుత సంఘాల కాల పరిమితి ఈ నెల 31తో ముగియనున్నందున తాత్కాలిక ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించినట్టు వినికిడి. ఇప్పటిదాకా సేవలందిస్తున్న సంఘాలన్నీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2013లో ఎన్నికైనవే. తెలంగాణ ఏర్పడిన నేపథ్యంలో టెస్కాబ్ ఆవిర్భవించింది. టెస్కాబ్ చైర్మన్‌గా కరీంనగర్ కేడీసీసీబీ అధ్యక్షుడు కొండూరు రవీందర్‌రావు నియమితులయ్యారు. టెస్కాబ్ షెడ్యూల్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ గతేడాది జూన్‌లోనే ప్రారంభం కావాల్సి ఉంది. కానీ, రిజర్వు బ్యాంక్ అనుమతి పొంది సహకార సంఘాలను పునర్ వ్యవస్థీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. కొత్త జిల్లాల పరిధి ప్రకారం సంఘాల ఆస్తులు, అప్పులను పునర్ వ్యవస్థీకరించాల్సి ఉంటుంది. ఆ తరువాత ఓటర్ల జాబితాను తయారు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే మరో నాలుగైదు నెలలు పట్టొచ్చని సమాచారం. రైతు సహకార సంఘాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, జిల్లా కేంద్ర సహకార బ్యాంక్, జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థలు అన్నదాతలకు ఆర్థికంగా బాసటగా నిలుస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. కొత్త రాష్ట్రంగా ఆవిర్భవించిన తెలంగాణలో వీటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని భావించిన సీఎం కేసీఆర్ రైతుల ప్రయోజనాలు పరిరక్షించేలా, డిపాజిటర్లకు భరోసా కల్పించేలా, నిబంధనలు మరింత పటిష్టం చేసే చర్యలకు నడుంబిగించారు. ఈ క్రమంలోనే రాష్ట్ర సహకార ఎన్నికల సంస్థను కూడా ఏర్పాటు చేశారు. వచ్చే శాసనసభ బడ్జెట్ సమావేశంలో సమగ్ర సహకార చట్టాన్ని ప్రవేశపెట్టాలని కూడా భావిస్తోన్నట్లు తెలుస్తోంది. ఈ ప్రక్రియ జరగాలంటే ఆర్‌బిఐ అనుమతి పొందడం, ప్రస్తుతం ఉన్న సహకార సంఘాలను రద్దు చేయడం వంటివి చేయాలి. ఈ క్రమంలో సహకార సంఘాలకు నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహించడం ఇప్పట్లో సాధ్యం కాకపోవచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. గతంలో ఎన్నికల గడువు పూర్తయిన తరువాత కొన్ని సందర్భాల్లో పాలకవర్గ పదవీ కాలాన్ని పొడగించారు. మరికొన్ని సందర్భాల్లో ప్రత్యేక అధికారులను నియమించారు. కేడీసీసీబీకి కలెక్టర్ లేదా ఐఏఎస్ హోదా కలిగిన అధికారిని, డీసీఎంఎస్‌కు జిల్లా సంయుక్త కలెక్టర్‌ను నియమించేవారు. పిఏసీఎస్‌లకు ఆయా మండలాల ఎంపీడీవోలు, తహశీల్దార్లకు బాధ్యతలు అప్పగించేవారు. మొత్తానికి కొత్త జిల్లాల ప్రకారం సంఘాల ఆస్థులు, అప్పులను విభజించడం, కొత్త ఓటర్ల జాబితాను తయారు చేయడం వంటి కారణాల దరిమిలా సకాలంలో సహకార ఎన్నికలు జరిగే అవకాశాలు లేకపోగా, ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో సహకార ఎన్నికలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

రెండు రోడ్డు ప్రమాదాల్లో
ఐదుగురి దుర్మరణం
పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తులు వెళ్లి వస్తుండగా దుర్ఘటన

కొత్తగూడెం, జనవరి 14: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి, ములకలపల్లి మండలాల్లో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు మృతి చెందారు. టేకులపల్లి మండలం బేతంపూడి పంచాయతీ తంగెళ్ళగడ్డ గ్రామం వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. పాల్వంచ మండల పరిధిలోని పెద్దమ్మతల్లి ఆలయానికి భక్తులు వెళ్లి వస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. ప్రమాదంలో ఇద్దరు మహిళలు, ఒక పురుషుడు మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డ మరో ఇద్దరిని కొత్తగూడెం ఆసుపత్రికి తరలిస్తుండగా వారిలో ఒకరు మృతి చెందారు. మృతుల్లో కారేపల్లి మండలం టేకులగూడెం గ్రామనివాసి మాలోత్ మోతీలాల్(35), గార్ల మండలం సీతంపేట నివాసి ఎన్ రమేష్(32) ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మరో ఇద్దరు మహిళలు ఎవరనే విషయమై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. ఘటనా స్థలాన్ని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ అంబర్ కిశోర్‌ఝా సందర్శించి పరిస్థితిని తెలుసుకున్నారు. టేకులపల్లి సీఐ రమేష్, ఇల్లెందు సీఐ సారంగపాణి ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ములకలపల్లి బస్టాండ్ సమీపంలో మోటార్ బైక్‌పై వచ్చిన గుర్రం ప్రభాకర్ అనే వ్యక్తి ఢీకొట్టడంతో ములకలపల్లి మండలం మాదారం గ్రామానికి చెందిన తాటికొండ రామాచారి(35) మృతి చెందాడు. ప్రభాకర్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో వైద్య చికిత్స కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పాల్వంచ సమీపంలోని నాగారం వద్ద జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా వుంది.

క్రీడ



టెన్నిస్ విందుకు
మెల్బోర్న్ సిద్ధం
నేటి నుంచి ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్

మెల్బోర్న్, జనవరి 14: ఈ ఏడాది మొదటి గ్రాండ్ శ్లామ్ టెన్నిస్ విందుకు మెల్బోర్న్ సిద్ధమైంది. ఆదివారం నుంచి మొదలై, ఈనెల 28వ తేదీతో ముగిసే ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ కోసం అటు టెన్నిస్ స్టార్లు, ఇటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. టెన్నిస్ టోర్నమెంట్స్‌కు సహజంగానే విశేష ఆదరణ ఉంటుంది. ఇక గ్రాండ్ శ్లామ్ టోర్నీల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. క్యాలండర్ ఇయర్‌లో వచ్చే నాలుగు గ్రాండ్ శ్లామ్ టోర్నీల్లో మొదట వచ్చేది ఆస్ట్రేలియా ఓపెన్. దీని తర్వాత ఫ్రెంచ్ ఓపెన్, వింబుల్డన్, చివరిగా యుఎస్ ఓపెన్ గ్రాండ్ శ్లామ్ టోర్నీలు జరుగుతాయి. ఇలావుంటే, ఎప్పటి మాదిరిగానే ఈసారి కూడా గ్రాండ్ శ్లామ్ యుద్ధానికి శంఖారావం పూరించే ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఏటేటా పోటీ పెరుగుతున్నది. ప్రపంచ మేటి స్టార్ల మధ్య సాగే భీకర సంగ్రామానికి మెల్బోర్న్ అన్ని విధాలా ముస్తాబైంది. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెదరర్ టైటిల్‌ను నిలబెట్టుకునే ప్రయత్నం చేస్తుండగా, ప్రపంచ మాజీ నంబర్ వన్ ఆండీ ముర్రే గాయానికి శస్త్రచికిత్స చేయించుకొని, ప్రస్తుతం పునరావాస శిక్షణ పొందుతున్నాడు. ముర్రే లేకపోయినప్పటికీ, ప్రపంచ నంబర్ వన్ రాఫెల్ నాదల్, మాజీ టాపర్ నొవాక్ జొకోవిచ్ తదితరుల నుంచి ఫెదరర్‌కు గట్టిపోటీ తప్పకపోవచ్చు. కాగా, మహిళల సింగిల్స్‌లో నిరుటి విజేత సెరెనా విలియమ్స్ వ్యక్తిగత కారణాలతో ఈ టోర్నీకి హాజరుకావడం లేదు. ఆమె బరిలోకి లేకపోవడంతో, ఈసారి మహిళల సింగిల్స్‌లో ఎవరు గొప్పగా ఆడతారన్నది అంచనాలకు కూడా అందడం లేదు. ఇలావుంటే, చారిత్రక నేపథ్యం ఉంది కాబట్టే ఆస్ట్రేలియా ఓపెన్‌కు గ్రాండ్ శ్లామ్ టోర్నీల్లో విశేష స్థానం ఉంది. ఇందులో వివిధ విభాగాల్లో పోటీలను నిర్వహిస్తారు. పురుషులు, మహిళల సింగిల్స్, డబుల్స్‌తోపాటు మిక్స్‌డ్ డబుల్స్‌లోనూ పోరు సాగుతుంది. జూనియర్, వెటరన్స్, వీల్‌చైర్ తదితర విభాగాల్లోనూ ఉత్కంఠ భరితమైన మ్యాచ్‌లకు ఆస్ట్రేలియా ఓపెన్ వేదికవుతుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌తోపాటు, క్వాలిఫయర్స్‌ను కూడా పరిగణలోకి తీసుకొని మెయిన్ డ్రాకు అర్హులైన వారి పేర్లను ప్రకటిస్తారు. పురుషుల సింగిల్స్ విభాగంలో మొత్తం 128 మంది బరిలోకి దిగుతారు. వీరిలో 104 మంది తమతమ ర్యాంకింగ్స్ ప్రాతిపదిక మీద డైరెక్ట్ ఎంట్రీ సంపాదిస్తే, 16 మంది క్వాలిఫయర్స్ ద్వారా స్థానాన్ని దక్కించుకుంటారు. వారివారి ట్రాక్ రికార్డును, ఫాన్ ఫాలోయింగ్‌ను దృష్టిలో ఉంచుకొని మరో ఎనిమిది మందికి వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ఇస్తారు. మహిళల సింగిల్స్‌లోనూ 128 మంది పోటీపడతారు. అయితే, పురుషుల విభాగానికి భిన్నంగా ఇందులో 108 మంది డైరెక్ట్ ఎంట్రీ సంపాదిస్తారు. 12 మంది క్వాలిఫయర్స్ నుంచి, ఎనిమిది మంది వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ద్వారా మెయిన్ డ్రాకు అర్హత పొందుతారు. కాగా, పురుషులు, మహిళల డబుల్స్‌లో చెరి 64 జోడీలు పోటీలో ఉంటాయి. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో 32 జోడీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటాయి. ఈ మూడు విభాగాల్లో ఏడేసి జట్లు వైల్డ్‌కార్డ్ ఎంట్రీ ద్వారా రంగ ప్రవేశం చేస్తాయి. ఏడాది ఆరంభంలో జరిగే గ్రాండ్ శ్లామ్ కాబట్టి, సహజంగానే మేటి స్టార్లంతా ఈ టోర్నీతోనే శుభారంభం చేయాలని అనుకుంటారు. అందుకే, మిగతా గ్రాండ్ శ్లామ్స్‌కు భిన్నంగా ఆస్ట్రేలియా ఓపెన్‌లో క్వాలిఫయింగ్ పోటీలు కూడా పోటాపోటీగా సాగుతాయి. క్యాలండర్ ఇయర్ మొదటి గ్రాండ్ శ్లామ్ కావడంతో, ఇందులో ఫలితాల ప్రభావం మిగతా టోర్నీలపైనా కూడా ఉంటుంది. అందుకే, ఆస్ట్రేలియా ఓపెన్‌కు స్టార్లు క్యూ కడతారు. ఫిట్నెస్ సమస్యలు లేకపోతే, ఈ టోర్నమెంట్‌కు దూరమయ్యేందుకు ఎవరూ సిద్ధపడరు.

ఆస్ట్రేలియా ఓపెన్ గ్రాండ్ శ్లామ్‌కు ప్రపంచ వ్యాప్తంగా ఎంతో మక్కువ ఉంది. ఈ టోర్నీలో మ్యాచ్‌లను తిలకించడానికి ప్రేక్షకులు పోటెత్తుతారు. 2004 సంవత్సరంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ మ్యాచ్‌లను 5,21,691 మంది చూసినట్టు అధికార గణాంకాలు చెప్తున్నాయి. గత ఏడాది ఈ సంఖ్య 7,03,899కి చేరింది. అంతకు ముందు రెండేళ్లతో పోలిస్తే, గత ఏడాది హాజరైన ప్రేక్షకుల సంఖ్య పెరిగింది. 2012లో 6,86,006 మంది, 2013లో 6,84,467, 2014లో 5,74,388 మంది మ్యాచ్‌లను చూశారు. అంతకు ముందు మూడేళ్లుగా సంఖ్య తగ్గినా గత ఏడాది మళ్లీ పెరిగింది.

ఎండలతో తంటా..

మెల్బోర్న్: ఎప్పటి మాదిరిగానే నిప్పులు చెరిగిన ఎండ ప్రతి ఒక్కరినీ అల్లాడించనున్నాయి. దీని ప్రభావం ఆస్ట్రేలియా ఓపెన్‌లోనూ కనిపించడం ఖాయం. ఈ టోర్నీకి ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉంది. ప్రేక్షకులు కూడా మ్యాచ్‌లను చూసేందుకు పోటెత్తుతారు. అయితే, మండుతున్న ఎండలు ప్రతిసారీ ఆస్ట్రేలియా ఓపెన్‌ను వెంటాడుతునే ఉన్నాయి. టోర్నమెంట్ జరిగే సమయంలో ఎండలు మండిపోవడంతో చాలా మంది క్రీడాకారులు బెంబేలెత్తిపోతారు. టోర్నీకి వేదికైన మెల్బోర్న్‌లో వేడిని భరించడం సామాన్యమైన విషయం కాదు. ఇక అమెరికా, బ్రిటన్, స్విట్జర్లాండ్, స్పెయిన్ వంటి శీతల దేశాల నుంచి టోర్నీలో పాల్గొనేవారి పరిస్థితి ఇంకా దారుణంగా మారింది. నిరుడు మెల్బోర్న్‌లో ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదైంది. ఈసారి అంతకంటే ఎక్కువ ఉష్ణోగ్రతతో మెల్బోర్న్ అగ్ని గుండంలా మారింది. 1905లో టోర్నమెంట్ మొదలైంది. తొలి ఏడాది పోటీలకు ఎంత వల్ల ఎలాంటి ప్రమాదం లేకపోయినా, మరుసటి సంవత్సరంలోనే ఉక్కబోత సమస్య అటు పోటీదారులకు, ఇటు ప్రేక్షకులకు తెలిసింది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలను తగ్గించడం అసాధ్యం కాబట్టి, ఆటగాళ్లు ఎండ బారిన పడకుండా ప్రతిసారీ నిర్వాహకులు చర్యలు తీసుకుంటున్నారు. కానీ అవి సత్ఫలితాలనిస్తున్న దాఖలాలు లేవు. అగ్ని గుండాన్ని తలపించే మెల్బోర్న్‌లో మ్యాచ్‌లు ఆడడం సాధ్యంగా లేదని చాలా మంది వాపోతున్నారు. ఏ క్రీడలోనైనా చెమటోడ్చడం అంటే కష్టపడడం. ఆస్ట్రేలియా ఓపెన్‌లో మాత్రం ఈ మాటకు మెల్బోర్న్ ఉక్కబోతను భరించడమనే అర్థం వస్తుంది. ఈ సమస్య నుంచి బయటపడేందుకు నిర్వాహకులు గడ ఏడాది హీట్ పాలసీని అమలు చేశారు. గతంలో ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరే వరకూ వేచిచూసేవారు. ఉష్ణోగ్రత ఆ స్థాయికి చేరుకునే సమయంలో కొనసాగుతున్న సెట్ పూర్తయ్యే వరకూ వేచి ఉండేవారు. సెట్‌ను ముగిసిన తర్వాతే స్టేడియం పైకప్పును మూసేసి ఆటను కొనసాగించేవారు. కానీ, రెండేళ్ల క్రితం కొత్త హీట్ పాలసీని అమలు చేశారు. దాని ప్రకారం ప్రకారం ఉష్ణోగ్రత 40 డిగ్రీలకు చేరిన మరుక్షణమే ఆటను నిలిపేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి, క్షణాల్లో మూసుకునే పైకప్పును ఏర్పాటు చేశారు. పరిస్థితి తీవ్రత పెరిగితే, అత్యవసర సమయాల్లో ఉపయోగించే విధంగా 363 మిలియన్ డాలర్ల ఖర్చుతో మరో స్టేడియం రూఫ్‌ను ఆధునీకరించారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పైకప్పు కేవలం ఐదు నిమిషాల్లో మూసుకుపోతుంది. మండే ఎండల నుంచి ఆటగాళ్లను, ప్రేక్షకులను రక్షించేందుకు ఆస్ట్రేలియా ఓపెన్ నిర్వాహకులు తీవ్రంగానే కృషి చేస్తున్నారు. వారి ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ, మండే ఎండలతో మల్బోర్న్‌లో ప్రతి ఒక్కరికీ ఇబ్బందులు తప్పవు.



కోహ్లీ పోరాటం
భారత్ 5 వికెట్లకు 183
దక్షిణాఫ్రికాతో రెండో టెస్టు

సెంచూరియన్, జనవరి 14: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్టు మ్యాచ్ మొదటి ఇన్నింగ్స్‌లో ఓపెనర్ మురళీ విజయ్‌ని మినహాయిస్తే, టాప్, మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మెన్ విఫలంకాగా, భారత జట్టును ఆదుకునే బాధ్యతలను తన భుజాలపై వేసుకున్న కెప్టెన్ కోహ్లీ పోరాటాన్ని కొనసాగిస్తున్నాడు. మొదటి ఇన్నింగ్స్‌లో 335 పరుగులకు ఆలౌట్‌కాగా, రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ ఐదు వికెట్లు కోల్పోయి 183 పరుగులు చేసింది. ప్రత్యర్థి కంటే ఇంకా 152 పరుగులు వెనుకంజలో నిలిచిన టీమిండియా చేతిలో ఐదు వికెట్లు ఉన్నాయి. ఆరు వికెట్లకు 269 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు ఉదయం ఆటను కొనసాగించిన దక్షిణాఫ్రికా 282 పరుగుల వద్ద కేశవ్ మహారాజ్‌ను కోల్పోయింది. 18 పరుగులు చేసిన అతను మహమ్మద్ షమీ బౌలింగ్‌లో వికెట్‌కీపర్ పార్థీవ్ పటేల్‌కు చిక్కాడు. కాగిసో రబడా 11 పరుగులు చేసి, ఇశాంత్ బౌలింగ్‌లో హార్దిక్ పాండ్య క్యాచ్ అందుకోగా వెనుదిరిగాడు. క్రీజ్‌లో నిలదొక్కుకొని ఆడుతున్న కెప్టెన్ పఫ్ డు ప్లెసిస్ 63 పరుగుల వ్యక్తిగత స్కోరువద్ద ఇశాంత్ శర్మ వేసిన బంతికి క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 142 బంతులు ఎదుర్కొన్న అతని స్కోరులో తొమ్మిది ఫోర్లు ఉన్నాయి. మోర్న్ మోర్కెల్ ఆరు పరుగులు చేసి, అశ్విన్ బౌలింగ్‌లో మురళీ విజయ్ చక్కటి క్యాచ్ పట్టగా ఔట్ కావడంతో దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌కు తెరపడింది. అశ్విన్ 113 పరుగులిచ్చి నాలుగు వికెట్లు సాధించాడు. ఇశాంత్ శర్మ 46 పరుగులకు మూడు వికెట్లు తీశాడు.

రాహుల్ విఫలం

భారత్ ఇన్నింగ్స్ మొదలైన తర్వాత, క్రీజ్‌లో నిలబడాల్సిన బాధ్యత ఉన్న ఓపెనర్ లోకేష్ రాహుల్ తన ప్రయత్నంలో విఫలమయ్యాడు. 10 పరుగులు చేసిన అతను మోర్న్ మోర్కెల్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔట్‌కాగా, భారత్ తొలి వికెట్ 28 పరుగుల వద్ద కూలింది. ఫస్ట్ డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన చటేశ్వర్ పుజారా కేవలం ఒక బంతిని ఎదుర్కొని, ఒక్క పరుగు కూడా చేయకుండానే రనౌటయ్యాడు. సెకండ్‌లో బ్యాటింగ్‌కు దిగిన కోహ్లీ జాగ్రత్తగా ఆడుతూ, ఓపెనర్ విజయ్‌తో కలిసి జట్టు స్కోరును వంద పరుగుల మైలురాయిని దాటించాడు. అయితే, విజయ్ 125 బంతులు ఎదుర్కొని 46 పరుగులు చేసి, కేశవ్ మహారాజ్ బౌలింగ్‌లో బంతిని సరిగ్గా అర్థం చేసుకోలేక, వికెట్‌కీపర్ క్వింటన్ డి కాక్‌కు దొరికాడు. రోహిత్ శర్మ 10, పార్థీవ్ పటేల్ 19 పరుగులు చేసి పెవిలియన్ చేరగా, రెండో రోజు ఆట ముగిసే సమయానికి కోహ్లీ 85, హార్దిక్ పాండ్య 11 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు.

స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్ (ఓవర్‌నైట్ స్కోరు 6 వికెట్లకు 265): డీన్ ఎల్గార్ సి మురళీ విజయ్ బి అశ్విన్ 31, ఎయిడెన్ మర్‌క్రామ్ సి పార్థీవ్ పటేల్ బి అశ్విన్ 94, హాషీం ఆమ్లా రనౌట్ 82, ఏబీ డివిలియర్స్ బి ఇశాంత్ శర్మ 20, ఫఫ్ డు ప్లెసిస్ బి ఇశాంత్ శర్మ 63, క్వింటన్ డికాక్ సి విరాట్ కోహ్లీ బి అశ్విన్ 0, వెర్నన్ ఫిలాండర్ రనౌట్ 0, కేశవ్ మహారాజ్ సి పార్థీవ్ పటేల్ బి మహమ్మద్ షమీ 18, కాగిసో రబడా సి హార్దిక్ పాండ్య బి ఇశాంత్ శర్మ 11, మోర్న్ మోర్కెల్ సి మురళీ విజయ్ బి అశ్విన్ 6, లూన్గీ నిడీ 1 నాటౌట్, ఎక్‌స్ట్రాలు 9, **మొత్తం (130.5 ఓవర్లలో ఆలౌట్) 335.**

వికెట్ల పతనం: 1-85, 2-148, 3-199, 4-246, 5-250, 6-251, 7-282, 8-324, 9-333, 10-335.

బౌలింగ్: జస్‌ప్రీత్ బుమ్రా 22-6-60-0, మహమ్మద్ షమీ 15-2-58-1, ఇశాంత్ శర్మ 22-4-46-3, హార్దిక్ పాండ్య 16-4-50-0, అశ్విన్ 38.5-10-113-4.

భారత్ తొలి ఇన్నింగ్స్: మురళీ విజయ్ సి క్వింటన్ డి కాక్ బి కేశవ్ మహారాజ్ 46, లోకేష్ రాహుల్ సి అండ్ బి మోర్న్ మోర్కెల్ 10, చటేశ్వర్ పుజారా రనౌట్ 0, విరాట్ కోహ్లీ 85 నాటౌట్, రోహిత్ శర్మ ఎల్‌బీ కాగిసో రబడా 10, పార్థీవ్ పటేల్ సి క్వింటన్ డి కాక్ బి లూన్గీ నిడీ 19, హార్దిక్ పాండ్య 11 నాటౌట్, ఎక్‌స్ట్రాలు 2, **మొత్తం (61 ఓవర్లలో 5 వికెట్లకు) 183.**

వికెట్ల పతనం: 1-25, 2-28, 3-107, 4-132, 5-164.

బౌలింగ్: కేశవ్ మహారాజ్ 16-1-53-1, మోర్న్ మోర్కెల్ 15-3-47-1, వెర్నన్ ఫిలాండర్ 9-3-23-0, కాగిసో రబడా 12-0-33-1, లూన్గీ నిడీ 9-2-26-1.

వన్డేల్లో ఆసీస్‌కు
ఇంగ్లాండ్ షాక్

మెల్బోర్న్, జనవరి 14: ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌ను 0-4 తేడాతో కోల్పోయిన ఇంగ్లాండ్ వన్డే సిరీస్ ఆరంభంలోనే ఆస్ట్రేలియాకు షాకిచ్చింది. ఆదివారం ఇక్కడ జరిగిన మొదటి వన్డేలో ఆ జట్టు ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. ఓపెనర్ జాసన్ రాయ్ రికార్డు సెంచరీ నమోదు చేయగా, టెస్టు జట్టు కెప్టెన్ జో రూట్ తొమ్మిది పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా 50 ఓవర్లలో 8 వికెట్లకు 304 పరుగుల గౌరవ ప్రదమైన స్కోరు సాధించింది. ఆరోన్ ఫించ్ (107) సెంచరీతో రాణించగా, మిచెల్ మార్ష్ (50), మార్కస్ స్టొయినిస్ (60) అర్ధ శతకాలు నమోదు చేశారు. లియామ్ ప్లంకెట్ 71 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టాడు. అదిల్ రషీద్ 73 పరుగులిచ్చి రెండు వికెట్లు కూల్చాడు.

అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లాండ్ 48.5 ఓవర్లలో ఐదు వికెట్లకు 308 పరుగులు చేసి, ఐదు వికెట్ల తేడాతో గెలిచింది. జాసన్ రాయ్ 151 బంతులు ఎదుర్కొని, 16 ఫోర్లు, 5 భారీ సిక్సర్లతో 180 పరుగులు సాధించాడు. జో రూట్ 91 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

పుంజుకోవడానికి
తుది అవకాశం!

ఢాకా, జనవరి 14: ఇటీవల కాలంలో విఫలవుతున్న బంగ్లాదేశ్, శ్రీలంక, జింబాబ్వే క్రికెట్ జట్లకు మళ్లీ పుంజుకొనే అవకాశం లభించనుంది. సోమవారం నుంచి ఇక్కడ ప్రారంభమయ్యే ముక్కోణపు వన్డే టోర్నమెంట్‌లో ఈ మూడు జట్లు పోరాడనున్నాయి. వచ్చే ఏడాది జరిగే వరల్డ్ కప్‌కు తగిన విధంగా సమాయత్తమయ్యేందుకు ఈ టోర్నీని తొలి అడుగుగా క్రీడా పండితులు పేర్కొంటున్నారు. మష్రాఫ్ మొర్తాజా నాయకత్వం వహిస్తున్న బంగ్లాదేశ్ జట్టులో షకీబ్ అల్ హసన్, తమీమ్ ఇక్బాల్, మహమ్మదుల్లా వంటి మేటి క్రికెటర్లు ఉన్నారు. కాగా, తిసర పెరెరా స్థానంలో మళ్లీ లంక జట్టుకు నాయకత్వం పగ్గాలు చేపట్టిన ఏంజెలో మాథ్యూస్‌కు ఇది తొలి పరీక్ష. దినేష్ చండీమల్, కుశాల్ పెరెరాతోపాటు వైస్ కెప్టెన్ సురంగ లక్మల్ కూడా తమను తాము నిరూపించుకోవడానికి ఈ టోర్నీని సరైన వేదికగా భావిస్తున్నారు. ఇక నిలకడలేని జట్టుగా ముద్ర వేయించుకున్న జింబబ్వేకు గ్రేమ్ క్రెమెర్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఒకరిద్దరు తప్ప జట్టులో సీనియర్లు ఎక్కువ మంది లేరు. అయితే, యువ క్రికెటర్లు సర్వశక్తులు ఒడ్డితే, సీనియర్ల కంటే వారే గొప్పగా రాణించినా ఆశ్చర్యం లేదు.



భారీ ప్రైజ్‌మనీ

మెల్బోర్న్: టెన్నిస్ రంగంలో గ్రాండ్ శ్లామ్స్‌లోనేగాక, మరే ఇతర టోర్నీలోనూ లేనంత ప్రైజ్‌మేనీ ఆస్ట్రేలియా ఓపెన్‌లో ఉంటుంది. ఇటీవలే ప్రైజ్‌మనీ మొత్తాన్ని 40 మిలియన్ డాలర్లకు పెంచారు. పురుషులు, మహిళల విభాగాల్లో టైటిళ్లను సాధించిన వారికి చెరి 3.1 మిలియన్ డాలర్లు లభిస్తాయి. మొదట్లో ఈ రెండు విభాగాల్లో విజేతకు లభించే మొత్తాలు వేరువేరుగా ఉండేవి. కానీ, పలువురు క్రీడాకారిణులు నిరసన వ్యక్తం చేయడంతో ప్రైజ్‌మనీని సమానం చేశారు. కాగా, మొదటి రౌండ్ నుంచి మొదలుపెట్టి, ఫైనల్ వరకూ ప్రతి దశలోనూ ఎంతో కొంత మొత్తం లభిస్తుంది. మొదటి రౌండ్‌లో ఓడిన వారు కూడా 34,500 డాలర్లు తమ వెంట తీసుకెళతారు. మెయిన్‌డ్రాకు అర్హత సంపాదిస్తే చాలు.. ఆతర్వాత ప్రతి రౌండ్‌లోనూ కళ్లు చెదిరే ప్రైజ్‌మనీ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మాత్రమే చూడగలిగే అంశం. 2000 సంవత్సరంలో ప్రైజ్‌మనీ 20 మిలియన్ డాలర్లుకాగా, క్రమంగా పెరుగుతూ ఇప్పుడు 40 మిలియన్ డాలర్లకు చేరింది. గ్రాండ్ శ్లామ్స్‌లోనే తలమానికమైన వింబుల్డన్‌లోనూ ఇంత భారీ ప్రైజ్‌మనీ లేకపోవడం గమనార్హం.

మెయిన్ డ్రాకు భంబ్రీ క్వాలిఫై


యుకీ భంబ్రీ

మెల్బోర్న్: గత సీజన్ నుంచి చక్కటి ప్రతిభతో రాణిస్తున్న భారత ఆటగాడు యుకీ భంబ్రీ ఆస్ట్రేలియా ఓపెన్ మెయిన్ డ్రాకు క్వాలిఫై అయ్యాడు. చివరిదైన మూడో క్వాలిఫయర్‌లో అతను కెనడాకు చెందిన పీటర్ పొలాన్స్కీని 1-6, 6-3, 6-3 తేడాతో ఓడించాడు. మొదటి సెట్‌ను చేజార్చుకున్నప్పటికీ, ఆతర్వాత రెండు సెట్లలో అతను ఎదురుదాడికి దిగి, విజయాన్ని నమోదు చేశాడు. 2015, 2016 సంవత్సరాల్లోనూ 25 ఏళ్ల యుకీ ఈ టోర్నమెంట్‌కు అర్హత సంపాదించాడు. అయితే, రెండు పర్యాయాలూ అతని పోరాటం మొదటి రౌండ్‌కే పరిమితమైంది. మొదటిసారి ఆండీ ముర్రే చేతిలో, రెండోసారి తొమాస్ బెర్డిచ్ చేతిలో అతను పరాజయాలను చవిచూశాడు.



టి-20 ఫార్మాట్‌లో అత్యంత వేగవంతమైన శతకాన్ని నమోదు చేసిన భారత బ్యాట్స్‌మన్‌గా రికార్డు పుస్తకాల్లో చోటు సంపాదించిన రిషభ్ పంత్. ముస్తాక్ అలీ టీ-20 ట్రోఫీలో ఢిల్లీకి ప్రాతినిథ్యం వహిస్తున్న అతను న్యూఢిల్లీలో ఆదివారం హిమాచల్ ప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో 32 బంతుల్లోనే సెంచరీ చేశాడు. అతను మొత్తం 38 బంతుల్లో 116 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. టీ-20 మ్యాచ్‌ల్లో క్రిస్ గేల్ 30 బంతుల్లో సెంచరీతో రికార్డు పుస్తకాల్లో మొదటి స్థానాన్ని ఆక్రమించగా, పంత్‌కు రెండో స్థానం దక్కింది. కాగా, అతని ప్రతిభతో హిమాచల్ ప్రదేశ్‌పై ఢిల్లీ 10 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

అండర్-19 వరల్డ్ కప్
పృథ్వీ షా కెప్టెన్ ఇన్నింగ్స్
ఆస్ట్రేలియాపై 100 పరుగుల తేడాతో భారత్ విజయం

మౌంట్ మాంగనుయ్, జనవరి 14: అండర్-19 క్రికెట్ వరల్డ్ కప్‌లో భారత యువ జట్టు శుభారంభం చేసింది. ఆస్ట్రేలియాతో ఆదివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌ని 100 పరుగుల భారీ తేడాతో గెల్చుకొని, టైటిల్ వేటను మొదలుపెట్టింది. ఓపెనర్‌గా వచ్చిన కెప్టెన్ పృథ్వీ షా అద్భుత ఇన్నింగ్స్‌తోపాటు, మరో ఓపెనర్ మన్‌జోత్ కల్రా, శుభం గిల్ కూడా అర్ధ శతకాలను నమోదు చేయడంతో, భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 328 పరుగుల భారీ స్కోరును సాధించగలిగింది. పృథ్వీ, మన్‌జోత్ మొదటి వికెట్‌కు 180 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. 100 బంతడులు ఎదుర్కొని, 8 ఫోర్లు, 2 సిక్సర్లతో 94 పరుగులు సాధించిన పృథ్వీ షా కేవలం ఆరు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నాడు. అయితే, భారత్ ఇన్నింగ్స్‌కు బలమైన పునాది వేసిన అతను విల్ సదర్లాండ్ బౌలింగ్‌లో బాక్స్‌టర్ హాల్ట్ క్యాచ్ పట్టడంతో ఔటయ్యాడు. మరో 20 పరుగుల తర్వాత భారత్ రెండో వికెట్‌ను మన్‌జోత్ రూపంలో చేజార్చుకుంది. పరమ్ ఉప్పల్ బౌలింగ్‌లో జాసన్ సంఘాకు చిక్కి పెవిలియన్ చేరిన అతను 99 బంతులు ఎదుర్కొన్నాడు. 12 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 86 పరుగులు సాధించాడు. ఫస్ట్‌డౌన్‌లో బ్యాటింగ్‌కు దిగిన శుభం గిల్ క్రీజ్‌లో నిలదొక్కుకొని ఆడితే, లోయర్ మిడిల్ ఆర్డర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. గిల్ 54 బంతుల్లో 63 పరుగులు చేసి జాక్ ఎడ్వర్డ్స్ బౌలింగ్‌లో రిటర్న్ క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. అతను ఆరు ఫోర్లు, ఒక సిక్సర్‌తో ఈ స్కోరు సాధించాడు. మొత్తం మీద భారత్ 50 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 328 పరుగులు చేసి, ఆస్ట్రేలియాకు పెను సవాలు విసిరింది. భారత్ ఆధిపత్యానికి గండి కొట్టడానికి ఆస్ట్రేలియా కెప్టెన్ జాసన్ సంఘా ఏకంగా ఎనిమిది మందితో బౌలింగ్ చేయించాడు. కానీ, ఆశించిన ఫలితాన్ని రాబట్టుకోలేకపోయాడు.

భారత్‌ను ఓడించి, ఈ టోర్నీలో బోణీ చేసేందుకు ఇన్నింగ్స్‌ను ఆరంభించిన ఆస్ట్రేలియా 42.5 ఓవర్లలో 228 పరుగులకే ఆలౌటైంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ అండర్-19 ఇన్నింగ్స్: 50 ఓవర్లలో 7 వికెట్లకు 328 (పృథ్వీ షా 94, మన్‌జోత్ కల్రా 86, శుభమ్ గిల్ 63, అభిషేక్ శర్మ 23, జాక్ ఎడ్వర్డ్స్ 4/65, విల్ సదర్లాండ్ 1/55, పరమ్ ఉప్పల్ 1/35, ఆస్టిన్ వా 1/64).

ఆస్ట్రేలియా అండర్-19 ఇన్నింగ్స్: 42.5 ఓవర్లలో 228 ఆలౌట్ (జాక్ ఎడ్వర్డ్స్ 73, జొనథాన్ మెర్లో 38, బాక్స్‌టర్ హాల్ట్ 39, శివమ్ మావీ 3/45, కమలేష్ నగర్‌కోటి 3/29).

దక్షిణాఫ్రికాను గెలిపించిన టోన్డర్

లింకన్: కెన్యాతో జరిగిన మ్యాచ్‌లో రేనార్డ్ వాన్ టోన్డర్ దక్షిణాఫ్రికా ఘన విజయంలో సాధించడానికి బాటలు వేశాడు. 121 బంతులు ఎదుర్కొన్న అతను 14 ఫోర్లు, ఐదు సిక్సర్లతో 143 పరుగులు సాధించాడు. జీవేషణ్ పిళ్లై 62 పరుగులు చేయగా, చివరిలో జేడ్ డి క్లెర్క్ 28, గెరాల్డ్ కొజీ 36 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. వీరు మెరుగైన స్కోర్లతో రాణించడంతో దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో ఏడు వికెట్లు కోల్పోయి 341 పరుగుల భారీ స్కోరును నమోదు చేయగలిగింది. కెన్యా బౌలర్లలో జస్రాజ్ కుండీ, జయంత్ మెపానీ చెరి రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కెన్యా పరుగుల వేటలో వేగంగా దూసుకెళ్లలేక, 7 వికెట్లకు 172 పరుగులకే పరిమితమైన ఈ జట్టు తరపున జస్రాజ్ కుండీ 41 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో అఖోనా న్యాకా 9 పరుగులకు రెండు, కెనాన్ స్మిత్ 36 పరుగులకు రెండు చొప్పున వికెట్లు కూల్చారు.

7 వికెట్ల తేడాతో లంక విజయం

ధనంజయ లక్షన్ అజేయ శతకంతో రాణించడంతో, ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌ని శ్రీలంక 7 వికెట్ల తేడాతో గెల్చుకుంది. వర్షం కారణంగా 48 ఓవర్లకు కుదించిన ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఐర్లాండ్ 8 వికెట్లకు 207 పరుగులు చేసింది. జెమీ గ్రాసీ 75, మార్క్ డొనెగాన్ 36, జోష్వ లిటిల్ 25 చొప్పున పరుగులు చేశారు. లంక బౌలర్ కమిందు మేండిస్ 35 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక 37.3 ఓవర్లలో, హసిత బొయాగోడ (0), నిపుణ్ మలింగ (1), క్రిషన్ అరాచిగే (17) వికెట్లను కోల్పోయి 208 పరుగులు సాధించి, విజయభేరి మోగించింది. ధనంజయ 101, కమిందు మేండిస్ 74 పరుగులతో నాటౌట్‌గా నిలిచి, లంకకు సునాయాస విజయాన్ని సాధించిపెట్టారు.


Printed and Published by **O.THOMAS** on behalf of Deccan Chronicle Holdings Ltd., Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Malkajgiri Mandal, Ranga Reddy Dist. Telangana., Chief Editor **T.V.Ravi Reddy** PBX 27803930 (6Lines),Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

ఆంధ్రభూమి

సాహితి

సోమవారం
15 జనవరి 2018

email:
sahiti@andhrabhoomi.net



కాంతి వెదజల్లు సంక్రాంతి కదలివచ్చె

అంగనల్ తమ గృహ ప్రాంగణంబుల తీర్చు
రంగవల్లికల హొరంగులందు
విభవంబులొల్క గొబ్బెమ్మలందున కుల్కు
బంతి-చేమంతి పుష్పంబులందు
తెలవార మేలుకొల్పులతోడ కడు కమ్మ
గా పాడు హరిదాసు గళమునందు
స్వయముగా చెమటోడ్చి పండించు ధాన్యమ్ము
గంపకెత్తెడు రైతు కన్నులందు
గంగిరెద్దుల గంతుల పొంగులందు
తేజు మెఱయించు కోడి పందెమ్ములందు
చెలువు మీఱెడి బొమ్మల కొలువునందు
స్వచ్ఛభారత సూర్యుని జాడలందు
కాంతి వెదజల్లు సంక్రాంతి కదలివచ్చె

- డా. రామడుగు వెంకటేశ్వర శర్మ
9866944287

ధన ధాన్య రాసి

అరవిరిసి పరిమళిస్తూ పూచే
పెరటి తోటన చక్కన్ని ముద్దబంతి
కమ్మనైన హరిదాసు నృత్యగానం
హరికీర్తనల గూడె చిరుతల తంత్రి
డూడూ బసవన్నల అందెల సడితో
వెల్లి విరిసిన ఆనంద హేల దొంతి
అందాల రంగుల రంగవల్లులతో
మురిపిస్తున్న నవయవ్వన యింతి
అంగరక్షణి వలె పచ్చని పైరులతో
సుందరమైన పల్లె మాగాణీ ప్రకృతి
అందివచ్చిన కొత్త పంటలతో
ఇంటింటా బంధువర్గ సహబంతి
అలుపెరుగని రైతన్నల మోములో
కలిగించును అంతులేని ప్రశాంతి
అలిగిన అల్లుళ్ళ చెంతన చేరిన
పుట్టినింటి ఇంతుల చామంతి
ఆనంద భరిత సంబరాలలో వీధుల్లో
భోగిమంటల చెంత వెచ్చని కాంతి
అందరి జీవితాలలో వెలుగొందాలి
సుఖశాంతుల తోరణాల స్రవంతి
మళ్ళీ మళ్ళీ రావాలి మీ జీవితాన
ధన ధాన్య రాసి మకర సంక్రాంతి

- డా. శారదారెడ్డి వకుల



గొబ్బెమ్మ

ముగ్గులు దిద్దిన
ముంగిళులందున
ముచ్చటలాడే గొబ్బెమ్మా! మా
పచ్చని తల్లీ! గొబ్బెమ్మా! ...ము

నవ భావములను
అనురాగములను
నారు వోసినా గొబ్బెమ్మా! మా
నవ్వుల తల్లీ! గొబ్బెమ్మా! ...ము

రంగు రంగులా
రంగవల్లులను
కొంగున దెచ్చిన గొబ్బెమ్మా! మా
కోర్కెల తల్లీ! గొబ్బెమ్మా ...ము

హరి హరలొ రంగ
హరి హరి యను దా
సరి కీర్తనలతొ గొబ్బెమ్మా! మా
పురమున కొచ్చిన గొబ్బెమ్మా ...ము

బొమ్మల కొలువుల
కమ్మని పాటల
గ్రుమ్మరించితివి గొబ్బెమ్మా! మా
అమ్మవు నీవే! గొబ్బెమ్మా ...ము

- స్వర్గీయ మడిపగడ బలరామాచార్య
(40 ఏళ్ల క్రితం రాసినవి)

జీవన సంక్రాంతి

నీవు పూవై పరిమళించినంత కాలమే
నీ చుట్టూ ఈ తుమ్మెదల ఝుంకారం

నీవు తెమ్మెరలా మదిని స్పృశించినంత కాలమే
నీ కోసం తన రంగవల్లుల ప్రతీహారం

నీవు మొయిలువయి భువిన కురిసిపోతేనే
నీ వయిపుకు తలలెత్తే మొలకల పులకరింపు

నీవు స్వాతి జల్లువయితేనే ముత్యపు చిప్పలందు
నీకయి నిత్యమూ ఎదురుచూపుల కైమోడ్పులు

నీవు శీతాకాలపు తుషారమై కురిసినపుడే
తాను నీ ఎదను రాలిన పారిజాత పరిమళం

నీ వురకలెత్తే రుధిరమయితేనే నీ కదలికకు
తన నరనరాన ఆవేశపు జలదరింపు


నీవు ధనుర్మాసపు మరువమయితేనే
కుసుమించే శీతల గంధమయ్యేది

నీవు మయూరమయి నర్తించితేనే
ప్రతి క్షణమూ జీవితానికొక మధుక్రాంతి

నీవూ - తానూ, పుడమీ-పైరుగా పంటలెత్తితే
నిత్య జీవితము కాగలదు పుష్య సంక్రాంతి

ఉత్తరాయణమైనా, దక్షిణాయనమైనా
దాంపత్యమంటే... కలిసి కూర్చే కలల బొమ్మలకొలువు

- దుగ్గిరాల రాజ్యలక్ష్మి, 9493571405



అసలైన సంక్రాంతి

సంక్రాంతీ... మకర సంక్రాంతి
బక్కచిక్కినవారి బాధలన్నీ తీరి
బతుకు బాగుపడితే నవ్వుల సంక్రాంతి
కిలోల కొద్ది వీపు మోతలేని చదువు దొరికితే
బడిపిల్లలకు భలే సంక్రాంతి
పండించిన రైతన్నకు
సరియైన రొక్కమిస్తె దరహాస సంక్రాంతి
తిండి దొరకని వృద్ధులకు
వేళకు అన్నపానాదులందితె మురిపాల సంక్రాంతి
కొలువులున్నోళ్లు కునుకు తీయకుండ
కార్యాలు చేస్తుంటె భవ్య సంక్రాంతి
నీడ లేని దారి బతుకులన్నిటికి
గూడు దొరికితె కమనీయ సంక్రాంతి
అన్నదమ్ముల వోలె అందరు కలిసుంటె
అన్నివేళలా అదే అసలైన సంక్రాంతి

- బొమ్మిదేని రాజేశ్వరి, 9160908045

సంకురాత్రి

జనగణాల ఆపాదమస్తకం
ఆవరించిన మంచుదుప్పట్లను
చీల్చుకుంటూ వచ్చాయి
సంక్రాంతి సముజ్వల క్రాంతిరేఖలు

భోగిమంటలతో భోగభాగ్యాలతో
కొత్త అల్లుళ్లతో కొంగ్రొత్త ఆశలతో
సంతసాల మేళవింపుతో
సౌరభాల గొబ్బిళ్ళతో
కోడిపుంజుల పందేలపట్లతో
జనాలను పరవళ్ల జల్లులలో
ముంచెత్తటానికి నడుం బిగించి
నట్టింట నిలిచింది నవనవలాడే
నవ్యక్రాంతి అదేనండి సంకురాత్రి..


నివాసాలన్నీ నిగనిగలాడగ
పాడిపంటలతో పొంగుతుండగ
రైతుల కంట ఆనందబాష్పాలు
తాండవించుచుండగ
రమణీయంగా ప్రకృతి పరవశించుచుండగ
ఆనంద హేలతో అడుగు మోపింది
ఉషోదయ శుభోదయాల సంకురాత్రి

సంక్రాంతి సంబరాలలో
సంలీనమవుదాం
సబ్బండ వర్గాల మోములో
శరచ్చంద్రికల మవుదాం

- బాదేపల్లి వెంకటయ్యగౌడ్, 9948508939

వెలుగు జిలుగుల తెలుగు పండగ

పండగ... పండగ...
తెలుగిళ్ళ లోగిళ్ళు తళతళ మెరిసే పండగ
పెద్దలు నచ్చే పండగ, పిన్నలు మెచ్చే పండగ
పెద్దల్ని కొలిచే పండగ, సుద్దుల్ని పంచే పండగ
భూమాత ఈస్ట్‌మన్ కలర్లో తళుకులీనే పండగ
గోమాత పొదువు ముంతడు పాలతో పొంగిపొర్లే పండగ
ఇబ్బడిముబ్బడిగా పంట కళ్ళాల రాశులు నిండే పండగ
పిల్లా, పెద్దా, గొడ్డు, గోదా - నవ్వగలిగే పండగ
తుళ్ళి తుళ్ళి ఎగరగలిగే పండగ
భగభగమంటూ, భుగ భుగ ఎగిసే...
భోగీ మంటల పండగ
ఆకలి పేగుకి అమృతమిచ్చే...
'కక్కముక్కల' కనుము పండగ
పశువుల పండగ, శిశువుల పండగ
అల్లుళ్ళ అలకల పండగ.. మరదళ్ళ సొగసుల పండగ
పైసలు లేని మావల గుండెల గుండె గుభేళ్ళ పండగ
గొబ్బెమ్మల పండగ, డూడూ బసవన్నల పండగ
హరిదాసు తత్త్వాలు తారాడే పండగ
రంగవల్లులు ముంగిట్ల తారాడే పండగ
రయ్‌మని ఎగిరే కోడిపుంజుల పండగ
మీసాలు మెలేసే, పందెం రాయుళ్ళ...
'పొగరు'బోత్తనాల పండగ
బుడబుక్కల బూచోళ్ళ, గజిబిజి వేషాల పండగ
అందాల పండగ, ఆనందాల పండగ



సంతసాల పండగ, సంరంభాల పండగ
పిల్లా, పెద్దా, రాజూ, పేదా... అందర ఒకటయ్యే పండగ
భోగి, కనుమలు తోడుగ రాగ...
ముక్కనుమ కూడ వేడుక కాగా...
గాదెలు, బోదెలు, గేదెలు...
నిండుగ, మెండుగ, దండిగ నిండే
ఉత్సాహాల, ఉల్లాసాల, సల్లాపాల పండగ
దశదిశల, నలుదెసల
కాంతిని నింపే, క్రాంతిని నిలిపే...
తెలుగుల పండగ, వెలుగుల పండగ
తెలుగు వెలుగుల జిలుగుల పండగ
సమ్యక్ క్రాంతి పండగ...
సంక్రాంతి పండగ!

- రమాప్రసాద్ ఆదిభట్ల, 9348006669

రగ్గులు

అన్నీ గుర్తే
అవును నాకన్నీ గుర్తే
హేమంతపు ప్రభాతాన
వణికించు చలిలో రగ్గుల నడకలు
ప్రయివేటుకు రగ్గుతో నేను
అమ్మపాలు పితకడానికి
త్రోవలో నాతోబాటు
నా చుట్టూ ఎన్నో రగ్గులు
కొన్ని పొలానికి
కొన్ని పాల కేంద్రానికి
కొన్ని చలిమంటల చెంతన
కోళ్ళ దగ్గర పిండి దంచుతూ కొన్ని
చెరువుకు నీళ్లకి కావిళ్ళతో కొన్ని
కల్లాపి చల్లుతూ కొన్ని
ముగ్గులు వేయుచూ కొన్ని
హరినామ సంకీర్తనలతో కొన్ని
కాటికాపరి వేషాలతో కొన్ని
రచ్చబండన పొగలొదులుతూ కొన్ని
చుట్టూ రగ్గుల నడకలే
పచ్చని పొలాలేమో చిరుముత్యపు
తుషారపు రగ్గు కౌగిటన
ఉషోదయం సఖుని కొనిపోవునేమో
యని కించిత్ విరహ వేదన!



- రవికిషోర్ పెంట్రాల, లండన్, 07703327908



ఆనంద శోభ

చుక్కల అంబరాన్ని తొడిగిన
వినీలాకాశం మిణుగురులై
తళుకులీనగ
లేలేత చిగురు దారాల
అల్లికలుగ నేసిన ఆకుపచ్చని
చీరకట్టిన ప్రకృతి కాంత
మందస్మిత మందగమన
మలయమారుత అతి శీతలములకు
సోయగాలు పోగ
సప్తవర్ణ సొబగులద్దుకున్న
లతాంతికలు గాలి అలలుగా
సౌరభాలు వెదజల్లగ
తెలుగు మాగాణి
పసిడి ధాన్యరాశిగ మారగ
పక్షుల కిలకిలారావములై
మత్తకోకిల తీయని రాగమాలపించి
పౌష్యలక్ష్మిని స్వాగతించే
మంచుదుప్పటి కప్పుకున్న
పుడమి తల్లి ఉషోదయాన
అరుణ కిరణ నునువెచ్చని స్పర్శగా
తరుణుల కరములుగ
జాలువారిన ముత్యాలముగ్గులు
హరివిల్లై విరబూసె అవనిపై
అటు ఆకాశ దీపాలైన గాలిపటాలు
ఇంద్రచాపాన్ని తలపించే అంబరాన
సన్నాయి వాయిద్యములుగ
డూడూ బసవన్నల
మూపుర సింగారము
గంటానాదములై
పరమశివుని ఆగమన
సూచకములవగ
తెలుగు లోగిళ్ళు
సత్యం శివం సుందరములుగ
ఆనంద నిలయాలై
సంక్రాంతి శోభ అవతరించె

- మడిపల్లి హరిహరనాథ్, 9603577655

నిత్య సంతోషాల...

ఉత్తరాయణమైనా దక్షిణాయణమైనా
ఆచరణ సాగుచేసి
కష్టపు అంకురాలేసి
చెమట నీటిని చిందించి
ఆశల ఆశయాల పైరును పెంచి పోషించి
ఒడుదుడుకుల తుఫాన్లను ఎదుర్కొని
కోరికలను కోతకోసి కుప్పనూర్చి
విజయాల పంటను దాంపత్య ఇంటికి చేర్చి
ఇరువురి మధ్య తిష్టవేసిన
స్వార్థ ఈర్ష్య క్రోధాల చెక్కముక్కలను
భోగిమంటగా పేర్చి
కన్నపేగుల తలపై ఆశీస్సులను భోగిపళ్ళుగా వేసి
ఆత్మీయ రంగవల్లుల నడుమ ఆనంద గొబ్బెమ్మై నిలిచి
హరిదాసులై ఇంటికొచ్చిన బంధువులకు



ప్రేమను దానం చేస్తూ సాగినపుడే
జీవితం నిత్య సంతోషాల పుష్య సంక్రాంతి

- అభిరామ్, 9704153642

రంగుల సంక్రాంతి

ఎండిపోయిన ఆకుల్లాంటి
అలవాటైన మూసపోసిన రోజుల్లో
చిగురించిన పత్ర స్వప్నం పండగ దినం
శిబిరంలో పలకరించే సూర్యకిరణం

అందరూ కలిసి చేసే పిండివంటల సందర్భంలో
బొమ్మల కొలువుల పేరంటాలలో
సామూహిక ఆనంద సంరంభం సంక్రాంతి
ఆకాశానికి చాచే జ్వాలల చేతుల
భోగిమంటల చుట్టూ
ఒకరి పక్క ఒకరు వలయాకారంలో కూర్చున్నప్పుడు
పరస్పర స్పర్శలోని వెచ్చదనం మానవత్వం
ఒక నిశ్శబ్ద సమైక్యతా రాగం

ఒకప్పుడు సంక్రాంతి అంటే
ముంగిట్లో ముత్యాల ముగ్గులు
ముగ్గుల్లో గొబ్బిళ్ళు
గొబ్బిళ్ళలో గుమ్మడిపూల కిరీటాలు
హరిదాసులు గంగిరెద్దులు కోళ్లపందేలు

ఇప్పుడు
దుక్కిటెద్ల స్థానంలో ట్రాక్టర్లు
ఇంటి నెత్తిపైన డిష్ ఏంటినా
ప్లాట్లుగా మారిన పంటపొలాలు
పల్లెల్లోనూ సాధారణ దృశ్యాలు
డాలరు గేలానికి చిక్కి
పడమటి చెరువుకు వలసవెళ్లిన చేపలు
ఎదిగిన పిల్లలు లేక ముగ్గులు లేని ఇళ్ళలో
పలకరించే దిక్కులేని పండుటాకులు
ఇక నగరాల్లో
అపార్టుమెంటు అరణ్యంలో
ముగ్గు పెట్టడానికి ముంగిళ్ళెక్కడ
ఆరు గజాల ఖాళీలో
ఆరున్నొక్క కొట్లు కట్టే నగరంలో
ఇంటి తలుపు తెరిస్తే
వీధి వాకిలే ముంగిలి
ముగ్గే గగనమైనచోట గొబ్బిళ్ళకు తావెక్కడ
ఇక- సంక్రాంతినాడు ఉదయం
ఎక్కడో ఓ మైదానంలో
భోగిమంటలు రగిలించి
గంగిరెద్లను అలంకరించి
హరిదాసులను పిలిపించి
ఆదే సంక్రాంతి వైభవమంటారు
నానాటికీ పండగల ప్రాభవం చిలక ఎగిరిపోయి
కొత్త కొత్త పండుగల పావురాలు వచ్చి వాలుతున్నాయి

తెలుగువారి పండుగలన్నీ
రేపటి జ్ఞాపకాలుగా మిగిలిపోతాయేమో
అందరం కలసి కలగందాం
రంగుల సంక్రాంతిని.

- మందరపు హైమవతి, 9441062732

తన పంట పండింది.

తిలక్ నిద్ర మత్తులో వుంటాడు కాబట్టి తను దర్జాగా బీరువాలో దొరికిన డబ్బు తీసుకుని ఉడా యించవచ్చు. నెల రోజులు దిగుల్లేదు.. ఆ డబ్బు ఖర్చుపెట్టుకుని సరదాగా తిరగొచ్చు...

శబ్దం రాకుండా బీరువా తలుపులు తీశాడు. పైఅరలో నోట్ల కట్టలు దొరికేయి. ఆ నోట్ల కట్టలు తీసుకుని ప్యాంటు జేబుల్లో కుక్కుకున్నాడు.

ఆ అరలో ఇంకా ఏమన్నా నోట్ల కట్టలు, బంగారం వస్తువులు ఉన్నాయేమోనని చేతితో తడి మాడు.

నోట్ల కట్టల దగ్గర వెండి వినాయకుడి ప్రతిమ వుంది. ఆ ప్రతిమ శేషగిరి చేతికి తగిలి కింద గచ్చు మీద పడింది.

తండ్రి మంచం ప్రక్కన కింద చాపమీద పడు కున్న తిలక్ కొడుకులకు ఆ శబ్దానికి మెలకువ వచ్చింది.

బీరువా దగ్గర ఎవరో తచ్చాడుతున్నట్లుగా కన్పించింది.

ఆ కుర్రాళ్ళు ఇద్దరూ చీకట్లో కదలాడుతున్న శేష గిరి మీదకు సింహాల్లా దూకారు. వాళ్ళనుంచి తప్పించుకోవాలని ప్రయత్నించినా శేషగిరి వల్ల కాలేదు.

తిలక్ కొడుకులు ఆ గదిలో పడుకుంటారని శేషగిరి ఊహించలేదు. బీరువాలో పది లక్షల దాకా డబ్బు ఉందని, ఎందుకైనా మంచిదని ఇద్దరి కొడుకులను గదిలో పడుకోమన్నాడు.

కొడుకుల కేకలకు మెలుకువ వచ్చి లేచి లైటు వేశాడు తిలక్. లైటు వెలుగులో తన కొడుకుల చేతుల్లో పిడిగుద్దులు తింటున్న శేషగిరిని చూశాడు.

''చివరకు ఈ స్థాయికి దిగజారిపోయావా?'' శేషగిరి వైపు అసహ్యంగా చూస్తూ అన్నాడు తిలక్.

''పోలీసులను పిలిచి వాళ్ళకు అప్పగిద్దాం'' అన్నాడు తిలక్ పెద్దకొడుకు.

''ఒకసారి జైలుకు వెళ్ళి బెయిల్‌మీద బయటకు వచ్చాడు. ఏడేళ్ళ జైలుశిక్ష ఎటూ పడుతుంది వీడికి.. కొత్తగా వీడికి వచ్చే అపకీర్తి ఏమీ లేదు. భార్యాపిల్లల ముందు వీడిని అవమానించి చితక బాది వదిలేద్దాం. అంతకుమించిన పెద్ద శిక్ష లేదు. వీడి భార్య, పిల్లలు జన్మలో వీడి మోహం చూడ కూడదన్నంత విరక్తి పుట్టాలి'' అన్నాడు తిలక్.

కాళ్ళు, చేతులు కట్టి గదిలో ఓ మూల పడేశారు అతన్ని.

తెల్లవారగానే ఇంటిముందు నిలబెట్టి అందరికీ తెలిసేటట్లు శేషగిరి నిర్వాకం గూర్చి పెద్దగా కేకలు



వ్యూహం

20 అలపర్తి రామకృష్ణ

వేశారు. చుట్టుప్రక్కలవాళ్ళంతా గుమిగూడేరు. పక్కింట్లో వున్న అన్నపూర్ణ, పిల్లలు కూడా ఆ కేక లకు బయటకు వచ్చి చూశారు.

దొరికిన దొంగ అందరికీ లోకువే!

చుట్టుప్రక్కల వాళ్ళు శేగిరిని చూసి ''పక్కిం ట్లోనే దొంగతనానికి సిద్ధపడటమా? కాయకష్టం



చేసుకుని భార్యాబిడ్డలను పోషించవచ్చు కదా! రిక్షా లాక్కొనేవాడు, చెప్పులు కుట్టేవాడు, రోడ్డు మీద కాయగూరలు అమ్ముకునేవాళ్ళు ఎంతో గౌర వంగా బ్రతకడంలేదూ.. అలా బ్రతకొచ్చుగదా! ఇదేం పని?'' ముక్కుమీద వేలేసుకున్నారు.

తల్లిదండ్రుల ఆస్తి స్వాధీనంలోకి తెచ్చుకుని ముసలివాళ్ళను మూలకు నెట్టినవాడు, మోసాలు చేసి బ్రతికేవాళ్ళు, అన్నెం పున్నెం ఎరుగని ఆడపిల్ల మీద అఘాయిత్యం చేసినవాడు- వీళ్ళందరూ చేతి దురద తీర్చుకున్నారు.

వాళ్ళందరూ తనను కొడుతున్నా, తిడుతున్నా శేషగిరి పట్టించుకోలేదు. కళ్ళల్లో నీళ్ళు నింపుకుని తనవైపు చూస్తున్న అన్నపూర్ణనుచూసి తట్టుకోలేక పోయాడు. పిల్లలు అమాయకంగా, బేలగా తన వైపు చూస్తున్నారు.

గుండెల్లోనుంచి దుఃఖం పొర్లుకు వచ్చింది.

వెక్కి వెక్కి ఏడ్చేశాడు.

జనంలో మళ్లీ జాలి పొంగిపొర్లింది.

అతడిని ఒంటరిగా వొదిలేసి వెళ్లిపోయారు.

అతని భార్యాపిల్లలు కూడా ఇంట్లోకి వెళ్లిపో యారు.

ఇంట్లోకి వెళ్ళడానికి మొహం చెల్లలేదు.

సికింద్రాబాద్ స్టేషన్‌కు వచ్చి కన్పించిన ట్రైన్ ఎక్కాడు- ఆ ట్రైన్ ఎక్కడకు వెళ్తుందో పట్టించుకో కుండానే. అది విజయవాడ వెళ్ళే రైలు.

దిగులుగా తలొంచుకుని కూర్చున్నాడు. ప్రక్కన కూర్చున్న అరవైయ్యేళ్ళ పెద్దాయన గమనిస్తూనే ఉన్నాడు శేషగిరిని.

''ఏం అలా తలొంచుకుని కూర్చున్నావ్? ఆరోగ్యం బాగాలేదా?'' అడిగాడు.

సమాధానం ఇవ్వకుండా కూర్చున్నాడు.

''మంచినీళ్ళు త్రాగుతావా? తన దగ్గరున్న వాటర్ బాటిల్ ఇవ్వబోయాడు పెద్దాయన.

''వద్దండీ?''

ఆ పెద్దాయన పేరు బలరామయ్య. నూజివీడు దగ్గర కోళ్ళఫారంలు వున్నాయి. శేషగిరిని చూస్తూ ''ఇబ్బందుల్లో వున్నట్లున్నాడు.. వదిలెయ్యకూ డదు'' అనుకున్నాడు. వ్యవసాయం చేసి అప్పుల్లో మునిగిపోయి ఆత్మహత్య చేసుకున్న తమ్ముడు గుర్తుకు వచ్చాడు. తమ్ముడు ఆర్థిక ఇబ్బందుల్లో వున్నప్పుడు తనదగ్గర డబ్బు లేదు. తను నిలదొ క్కుకున్నాక, తన పరిధిలో తాను సహాయం చేస్తూనే ఉన్నాడు.

శేషగిరిని నూజివీడు తీసుకువెళ్లాడు. పౌల్ట్రీ ఫారం దగ్గర అతన్ని వుంచి పనివాళ్ళమీద అజమా యిషీ, కోళ్ళ గుడ్ల అమ్మకం అతనికే అప్పగిం చాడు. లక్ష, రెండు లక్షలు శేషగిరికి ఇచ్చి బ్యాంకులో జమ చేయమనేవాడు. ఆ డబ్బు తీసు కుని పారిపోలేదు.

బలరామయ్యగారు తనమీద వుంచిన నమ్మ కాన్ని వమ్ము చెయ్యలేదు. ఎన్నో తప్పులు చేసి ఇప్పటికే నరకం అనుభవించాడు. మళ్లీ తప్పులు చేయకూడదనుకున్నాడు. రెండేళ్ళు సజావుగా సాగిపోయాయి.

భార్యా పిల్లలను చూడాలనిపించింది. హైదరా బాద్ వెళ్ళాడు. ఇంటికి వెళ్ళాలనిపించలేదు. వెంక టేశ్వర స్వామి ఆలయంకు శనివారం సాయంత్రం పూట భార్య, పిల్లలు వచ్చే అలవాటు వుంది. ఆలయం దగ్గర ఓ ప్రక్కన నిలబడి భార్యా పిల్లల కోసం ఎదురుచూస్తూ నిలబడ్డాడు. 'వాళ్ళకు కన్పించకుండా దూరంనుంచి వెళ్లిపోవాలి'! అదీ అతని ఆలోచన. పోలీసుల కళ్ళ బడ్డాడు. అప్పటికే అతనిమీద వున్న డ్రగ్స్ సరఫరా కేసు విచారణ పూర్తిఅయ్యింది. శేషగిరికి ఏడేళ్ళు జైలుశిక్ష పడింది. అతని కోసం గాలిస్తూ వున్నారు పోలీ సులు. వాళ్ళకు దొరికిపోయాడు.

ఏడేళ్ళ శిక్ష అనుభవించి బయటపడ్డాడు.

- ఇంకా ఉంది

నేర్చుకుందాం



శ్రీ నరసింహ శతకములోని పద్యము

సీ. లోకమందెవఁడైన లోభి మానవుఁడున్న
భిక్షమర్థికి c జేతc బెట్టలేఁడు
తాను బెట్టకయున్న దగవు పుట్టదు గాని
యొరులు పెట్టcగ జూచి యోర్వలేఁడు
దాత దగ్గఱ జేరి తనములెల్లచెడునట్లు
జిహ్వతోc జాడీలు చెప్పుచుండు
ఫలమువిఘ్నంబైన బలుసంతసంబంధి
మేలు గల్గిన c జాల మిడుకుచుండు

తే. శ్రీరమానాథ! యిటువంటి క్రూరునకును
భిక్షుకుల శత్రువని పేరుపెట్టవచ్చు
భూషణ వికాస ! శ్రీధర్మపురనివాస!
దుష్టసంహార! నరసింహ! దురిత దూర!

భావం: ఓ నరసింహ ప్రభూ! ఈ లోకంలో పిసినారి యాచకుల కేమి ఇవ్వడు. తాను పెట్టకపోతే విచారించవలసిందేమీ లేదు కాని ఇతరులు దానం చేస్తే చూచి సహించలేడు. దాత పంచచేరి తనముల్లె జారిపోయినట్లు యాచకులపై చాడీలు చెబుతాడు. ఇచ్చేవారు దానఫలం ఇవ్వకుండ మానివేస్తే ఎంతో సంతోషిస్తాడు. వారికి మేలు జరిగితే మిక్కిలి బాధపడుతాడు. ఇటువంటి నేటికాలంలోను తారసిల్లుతుంటారు.

మాటాట : 1538

నిర్వహణ: సుధామ

1		2	■	3		4
	■		■		■	
	■		■		■	
■	5	■	6	■	7	■
8		■		■	9	10
	■	11		12	■	
13			■	14		

ఆధారాలు

అడ్డం:
1. చూడుము, ప్రపమిచుము
3. పూర్వము
8. మాత
9. శిష్యుడు, దాసుడు
11. నోటినిండుగా
13. పండుగ
13. స్త్రీ

నిలువు:
1. కాటుక
2. వేణువు
3. గజ్జెలు వంటిదే
4.కీటకము
5. మార్జాలము
6. తోడు
7. కాగు, బాన
8. పట్టగా నుండు నార
10. నాగమాత
11. వ్రతము
12. లక్ష్మి

మాటాట - 1537 సమాధానం

1 సం	కు	2 రా	తి	3 రి	■	4 ప
బు	■	యి	■	రం	■	డ
5 రం	భ	■	6 వ	సు	మ	తి
■	■	7 గా	■	వు	■	■
8 బీ	■	9 రె	క్క	■	10 భం	11 గు
12 రా	శు	లు	■	13 చే	■	మ్మ
లు	■	■	14 గా	లి	ప	టం



మంచిమాట

సంక్రాంతి

జ్యోతిషశాస్త్రం ప్రకారం సూర్యుడు మకరరాశిలోనికి పరివర్తనం చెందే రోజు సంక్రాంతి. మకర సంక్రమణం అని కూడా అంటారు. ఆ రోజు నుండి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. సంస్కృతీ సంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం సంక్రాంతి. మకర రాశిలో సూర్యుని ప్రవేశంతో పండుగ ప్రారంభమైన సంక్రాంతి పండుగ ముచ్చటగా మూడు రోజులు సాగుతుంది.

ఇంటిముందరపండుగవేళ ప్రత్యేకమైన రంగురంగుల రంగ వల్లులను తీరుస్తారు. ఈ రంగవల్లులల్లో సంస్కృతీ సంప్రదాయాలకు చిహ్నంగా చేస్తుంటారు. తొలిరోజు చిన్ననాటినుంచి శ్రీహరి పై ప్రేమపాశాన్ని పెంచుకుని మాలాకైంకర్యం చేసి కోరి శ్రీవారి మెప్పు పొందిన ఆండాళ్ తల్లి శ్రీరంగనాయకులను వివాహమాడుతుంది. భోగాలను తాను పొంది సర్వమానవాళికి భోగాలను ప్రసాదిస్తుంది కనుక ఆ రోజు భోగి పండుగదినంగా జరుపుకుంటారు. పొద్దుపొద్దున్నే భోగిమంటలు వేసిఅందులో పాత చేట, చీపురు లాంటవి వేసి తమకు పట్టిన దృష్టిదోషం, చీడపీడలు దూరమయ్యాయని భావిస్తారు. ఇంటిముంగిట నెలరోజులనుంచి పెట్టిన గొబ్బిళ్లచుట్టూ గొబ్బియల్లో అంటూ పాటలు పాడుతూ కన్యలంతా ప్రదక్షిణలు చేస్తూ గౌరీదేవిని పూజిస్తారు. సాయంవేళ చిన్నపిల్లలకు భోగిపళ్లు పోసి పేరంటం చేస్తారు.

రెండవనాడు మరక రాశిలోసూర్యుని ప్రవేశంతో సంక్రాంతి ఈరోజు జానపద కళాకారులను సన్మానించేరోజు. వారి జానపద కళలను ప్రదర్శించేరోజు, పిల్లపెద్దా అంతా అభ్యంగన స్నానాలు చేసి సంక్రాంతి నూతన వెలుగు తమ జీవితాల్లోకి ఆహ్వానిస్తారు. పెద్దలంతా తిలతర్పణాలు వదిలి తమ పితరులను స్మరిస్తారు.

పిల్లలంతా జానపద కళారూపాలైన బుడుబుక్కలవాళ్ల పాటలు, దాస రుల వైష్ణవ సంకీర్తనలు, జంగందేవర శైవనామాలు, గంగిరెద్దుల వాళ్ల ఆట పాటలు, సన్నాయి మేళాలు వాయించేవారిని చూస్తూ, రంగురంగుల గాలిపటాలను ఎగుర వేస్తూ ఆకాశాన్ని పగలే నక్షత్రాలు వెలిగేట్టు చేస్తారు. దశవిధదానాలు కూడా సంక్రాంతిరోజున ఇస్తారు. నువ్వుల ఉండలను చేసి ఒకరికొకరు పంచు కోవడమూ ఆచారమే. ఇక మూడవ రోజు పశువుల పండుగ కనుమ. సంక్రాంతి మూడుదినాలలో బొమ్మల కొలువులను అమరుస్తారు.ముత్తైదువులను పిలిచి తాంబూలాలను పంచుతారు. కొత్త అల్లుళ్ళను, కూతుర్లను పిలుస్తారు. వారికి కొత్తబట్టలు పెడతారు. బంధు జనంతో కూడి మూడురోజులు విందుభోజనాలు చేస్తారు. వ్యవసాయంలో సాయపడిన పశువులకు కొత్తపంటతో వండిన పొంగళ్లను పెట్టి కొమ్ములకు రంగులు పూసి ఉత్సవాలు చేసే పండుగే కనుమ. ఈరోజున కోడి పందేలు, పొట్టేలు, దున్నపందేలు ఇలా రకరకాల జంతువులకు పందేలు వేస్తారు. పశువులను కడిగి అలంక రించి వాటిని పూజించి సాయంత్రంవేళ ఎడ్లబండ్లకు కట్టి ఊరు ఊరంతా తిప్పుతారు. దీన్ని బండ్లు తిప్పేపండుగ అని కూడా అంటారు. జాజు, సున్నం పట్టీలతో తీరుస్తూ బండ్లకు అలంకారం చేస్తారు.

స్త్రీలు సావిత్రి గౌరీవ్రతం చేస్తారు. సంక్రాంతి నోములను నోస్తారు. కొంతమంది దేవునికి ఇంటిలోని చిన్నపిల్లలకు సంక్రాంతికి హారతుల నిస్తారు. సంక్రాంతినాడు నువ్వులు బియ్యం కలిపి శివుణ్ణి అభిషేకిస్తారు. సంక్రాంతి రోజున శివునికి నువ్వుల నూనెతో దీపం పెడితే శని దోషాలు దూరమవుతాయని అంటారు.

ఇవేకాక శ్రీమద్భగవద్గీత పఠనం, గంగాస్నానం, త్రికాల గాయత్రి సంధ్యావందనం, గోవిందనామ స్మరణం చేయాల్సిన పనులుగా నిర్ణయసింధు, ధర్మసింధువులు చెప్తున్నాయి. ఈరోజున కూష్మాండం, కంబళి, ధాన్యాదులు, లోహాలు, వస్త్రాలు, తైలదీపదానాలు చేస్తే మంచిదని శాస్త్ర వచనం. బూడిద గుమ్మడికాయను దానంచేసిన వారికి భూదానం చేసిన ఫలం వస్తుందని శాస్త్రాలు చెబుతున్నాయి. పెరుగును దానం చేయడం వల్ల అనారోగ్యబాధలు తీరుతాయి. బుద్ధివికాసం కలుగుతుంది. శబరిమలైమీద వెలిసిన హరిహరపుత్రుడు స్వామి అయ్యప్ప జ్యోతిరూపంలో మకరసంక్రాంతి రోజు దర్శనమిస్తాడు. ఈరోజున ఈ జ్యోతిస్వరూపుణ్ణి దర్శనం చేసుకొంటే ఎంతో పుణ్యమని అంటారు.

- జంగం. శ్యామసుందరి

యాజ్ఞసేని



- త్రోవగుంట వేంకట సుబ్రహ్మణ్యము 12

''పాంచాల రాజకుమారి!'' అని మళ్లీ పిలిచింది. అయినా సమాధానం లేదు.

''రాజకుమారి ద్రౌపదీదేవి! ద్రౌపదీ దేవి!'' అని రెట్టించింది.

ఉలిక్కిపడిన యాజ్ఞసేని పైకి చూచింది ఏమిటన్నట్లు.

ఏమి ఆలోచిస్తున్నావు? అంది చిలుక.



నీకెందుకు? అన్నది ద్రౌపది.

అర్జునా! అర్జునా! పార్థా! పార్థా! అని పిలిచింది చిలుక.

''ఏం? పరిహాసంగా ఉన్నదా!'' చిరున వ్వుతో అన్నది ద్రౌపది.

''లేదు రాకుమారి! అర్జునుడు కనప డ్డాడా? ఎక్కడ ఉన్నాడు. రోజూ ఎక్కడు న్నాడో ఎక్కడున్నాడో అని ఆరాటపడు తుంటావుగా! ఏమయినా తెలిసిందా? తెలిస్తే చెప్పుము. రాయబారం నడపగ లను'' అంది చిలుక.

అబ్బా అంత గొప్పదానివా? అన్నది ద్రౌపది.

మా పక్షులు రాయబారాలు నడుపు తాయి. తెలియదా! శుచిముఖి పేరు విన లేదా? అదే హంస రాయబారం. నలద మయంతులను కలిపింది మా పక్షులే కదా!'' అని అన్నది చిలుక.

ఓహో! అలాగా! ఆ కథ ఏమిటో చెప్ప వచ్చు గదా?

అబ్బో అది చాలా పెద్ద కథలే! అది యిప్పుడెందుకు! నీ సంగతేదో చెపితే వెంటనే రాయబారం నడుపుతాం! నాకు చాలా పనులున్నాయి! నేను కొంత మంది మా పక్షి సమూహాన్ని ఏర్పాటుచేసి కోవాలి! నాలా ఆకా శంలో వేగంగా ఎగురగలిగే వాటిని'' అని అన్నది చిలుక.

పెద్దగా నవ్వింది యాజ్ఞసేని 'పెద్ద ఆరిందవే! మా తండ్రి వేగులను పంపాడు. అతడి ఉనికి తెలిస్తే నీకు తప్పక చెబు తాను. రాయబారం నడుపుదువుగాని''' అని నిట్టూర్పు విడిచింది ద్రౌపది.

సరే అలాగయితే తొందరగా చెప్పు అని పంజరంలోని గింజలను నోట కరచి తినడం మొదలుబెట్టింది చిలుక.

నిగనిగలాడే వన్నెగాడు, పాండవులలో నడిపివాడు, ధనుర్ధారలలో మేటి వీరుడు అయిన అర్జునుని గురించి ఆలోచిస్తున్న ద్రౌపది.

తన తండ్రి, అర్జునుడికి భార్య కాగల ఒక కూతురు కొరకై పుత్ర కామేష్టియా గాన్ని నిర్వహించి తనను పొందాడు. ఇపుడు ఆ అర్జునుడు ఎక్కడ ఉన్నాడో తెలియదు. అతడి గురించి వినడమే కానీ ఎట్లా ఉంటాడో ఏమో ఎరుగను అని పరి పరివిధాల ఊహాంబరవీధిలో విహరి స్తున్న ద్రౌపది 'రాజకుమారీ' అన్న శబ్దాన్ని విని కళ్ళు తెరిచి చూచింది.

ఎదురుగా ఉన్న యశస్విని అనే తన చెలికత్తెను చూచింది. ఏంటి అని కను లతో అడిగింది.

''అమ్మా! మహారాజుగారు తమను వెంటనిడుకొని రమ్మన్నారు'' అన్నది యశస్విని.

ఎందుకు? అన్నది నింపాదిగా ద్రౌపది.

రాజుగారు, మీ తల్లిగారు, మీ సోదరు లైన దృష్టద్యుమ్నులవారు ఏదో విష యమై చర్చించుకుంటున్నారు. తమని తోడ్కొని రమ్మని ఆజ్ఞాపించారు అని అన్నది.

సరే! పదా. నెమ్మదిగా లేచింది ద్రౌపది.

యశస్విని ముందు నడువగా వెనుక మెల్లగా నడుచుకుంటూ వచ్చింది పాంచాల రాజకుమారి. చెలికత్తెతో నడచి రాజాంతఃపురంలోనికి కాలుపెట్టింది. ఎదురుగా ఆసీనులైయున్న తండ్రిని, తల్లిని, సోదరుని చూచింది. తాను కూడా ఒక ఆసనంపై తల్లి చెంతన మెల్లగా కూర్చుంది. కొంతసేపు అంతా నిశ్శబ్దం ఆవహించింది.

అమ్మా ద్రౌపదీ! నిశ్శబ్దాన్ని చీలుస్తూ అన్నది కోకిలాదేవి.

తలెత్తి చూచింది ద్రౌపదీ.

మహారాజు వారు నీ వివాహం కొరకై స్వయంవరాన్ని ప్రకటించాలని అనుకుం టున్నారు అని అన్నది.

ఆ మాటలు విన్న యాజ్ఞసేని మిన్న కుండింది.

కొంతసేపు మళ్లీ వారిమధ్య నిశ్శబ్దం ఆవహించింది.

అంతవరకు చింతాక్రాంతుడై కనపడు తున్న ద్రుపదుడు మెల్లగా అన్నాడు.

పాండవుల ఉనికిని కనిపెట్టటానికై నా శాయశక్తులా వినియోగించాను. వారి జాడ ఎక్కడా కనిపించలేదు. వారు జీవి తులై ఉన్నారా లేదా అన్న విషయం నిర్ధా రించడం కష్టంగాయున్నది. అంతటి మహావీరులు మృత్యువాత పడ్డారన్నది నమ్మశక్యంగా లేదు. ప్రస్తుతానికి మనం చేయగలిగింది ఏమీయూ లేదు! అని.

పాంచాలి ఒక దీర్ఘమైన నిట్టూర్పు విడి చింది. అర్జునుడు తప్పక వస్తాడన్న ఆశ నశిస్తున్నది. పాంచాలి మౌన వేదనను గమనిస్తున్నాడు దృష్టద్యుముడు. చెల్లె లని చూచి ఆమెతో పాండవులు తప్పక వస్తారు. విధాత నిర్ణయించిన ప్రకారం నేను ద్రోణుని చావుకు కారకుణ్ణి కావాలి. ద్రౌపది అర్జునుని వివాహమాడాలి. అట్లా ఏ విధంగా కాకుండా పోతుంది. అందువ లన మనం అధైర్యపడకుండా ముందుకు సాగాలి.

- ఇంకా ఉంది

రచనలు పంపవలసిన చిరునామా: ఎడిటర్, ఆంధ్రభూమి దినపత్రిక, 36, సరోజినీదేవి రోడ్, సికింద్రాబాద్-500 003

రాశిఫలం



- గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

● **మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)**
చంచలం అధికమవుతుంది. గృహంలో మార్పులు కోరుకుంటారు. స్వల్ప అనారోగ్య కారణంతో నిరుత్సాహంగా ఉంటారు. స్త్రీలతో తగాదాలేర్పడే అవకాశాలుంటాయి.

● **వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)**
ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు.

● **మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)**
విదేశయాన ప్రయత్నం సులభంగా నెరవేరుతుంది. మనోవిచారాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. స్త్రీల మూలకంగా లాభం వుంది. పేరు, ప్రతిష్ఠలు లభిస్తాయి.

● **కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)**
కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా లభిస్తుంది. ధనలాభంతో ఆనందాన్ని పొందుదురు. ఇతరులకు ఉపకారం చేసే కార్యాల్లో నిమగ్నులవుతారు. ఋణబాధలు తొలగును. ఆరోగ్యం మెరుగవుతుంది.

● **సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)**
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. సహనం వహించుట అన్ని విధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. ధనవ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సి వస్తుంది.

● **కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)**
మానసిక చంచలంతో ఇబ్బంది పడతారు. సోమరితనం ఆవహిస్తుంది. పిల్లల పట్ల జాగ్రత్త వహిస్తారు. ధైర్యసాహసాలతో నూతన కార్యాలు ప్రారంభిస్తారు.

● **తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)**
వృత్తి ఉద్యోగ రంగాల్లో అభివృద్ధి ఉంటుంది. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశాలుంటాయి. ఏ విషయంలోను స్థిర నిర్ణయాలు తీసుకోలేకపోతారు.

● **వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)**
నూతన వ్యక్తులను నమ్మి మోసపోరాదు. సంఘంలో అప్రతిష్ఠ రాకుండా జాగ్రత్తపడుట మంచిది. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవడంతో ఇబ్బంది పడతారు. దైవదర్శనానికి ప్రయత్నిస్తారు.

● **ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)**
మనస్సు చంచలంగా వుంటుంది. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అకాల భోజనంవల్ల అనారోగ్య బాధలనుభవిస్తారు.

● **మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)**
ప్రయత్నం మేరకు స్వల్పలాభముంటుంది. ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాలుంటాయి. ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది.

● **కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)**
వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం వుంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధసేవ తప్పదు.

● **మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)**
ఇతరులకు ఇబ్బందిని కలుగజేసే పనులను మానుకోవాల్సి వస్తుంది. వృత్తిలో ఇబ్బందుల అధిగమిస్తారు. వ్యతిరేక ఫలితాలు కలుగకుండా జాగ్రత్త అవసరం.

మకరజ్యోతి దర్శనం
పూర్వజన్మ పుణ్యఫలం



శబరిమలై స్వామియే శరణం అయ్యప్ప అన్న నినాదాలతో మారు మ్రోగుతుండగా అయ్యప్ప స్వామి ఆలయంలో స్వామిని ఆభరణాలతో అలంకరించి, హారతి ఇచ్చే సమయంలోనే, ఆలయానికి ఈశాన్య దిశలో ఉండే పర్వతాలపై మకర జ్యోతి దర్శనమిస్తుంది. స్వయంగా ఆ జ్యోతి దర్శనం చేసుకోవాలని మాలలు ధరించి స్వాములు కోటానుకోట్లమంది జనం శబరిమలైలో వేచి ఉంటారు. అందరూ చేతులెత్తి స్వామి శరణం అయ్యప్ప శరణం అంటూ గొంతెత్తి తన్మయత్వంతో పలుకుతుంటారు. సాయం సంధ్యవేళ ఈ మకరజ్యోతి దర్శనం వేయి జన్మల పుణ్యఫలంగా భావిస్తారు. ఆధునిక విజ్ఞానశాస్త్రాల వల్ల దూరదర్శన్లూ ఈ మకరజ్యోతి దర్శనం కావిస్తారు.

మకరజ్యోతిని దర్శించిన అయ్యప్ప భక్తులు నిలువెల్లా పులకించిపోతారు. తమ తమ జన్మధన్యమైందని భావిస్తారు.

మకరజ్యోతి భగవత్ లీలగానే భక్తులు భావిస్తారు. 'ప్రజలను రక్షించేందుకు నేను తపస్సులోకి వెళుతున్నాను, ప్రతి ఏడాది మకర సంక్రాంతి రోజు నా కళ్లను తెరిచి ఈ విశ్వాన్ని వీక్షిస్తాను, ఆ రోజు నా విగ్రహాన్ని ఆభరణాలతో అందంగా అలంకరించి, పూజించే అవకాశం కల్పిస్తున్నాను, అదే రోజు 'పొన్నాంబల మేడు' పర్వతాలపై మకరజ్యోతి దర్శన భాగ్యం కల్పిస్తాను' అంటూ స్వామి అయ్యప్ప పాంథాళ దేశ రాజైన రాజశేఖరుడితో చెప్పాడట. రాజశేఖరుడి వద్ద కొంత కాలం పెరిగిన అయ్యప్ప అడవుల్లోకి వెళ్లే సమయంలో ఈ విషయాన్ని వెల్లడించాడని అయ్యప్ప జీవిత చరిత్ర చెబుతుంది.

పాంథాళ దేశ రాజైన రాజశేఖరుడికి బిడ్డలు లేరు. ఈ కారణంగానే ఈ రాజుకు భగవంతుడే స్వయంగా శిశువురూపంలో పంపానదీ తీరాన లభ్యమయ్యాడు. ఆశిశువును రాజశేఖరుడు భగవత్‌ప్రసాదంగా భావించి పెంచుకున్నారు. ఎన్నో ఆటంకాలు మరెన్నో చిక్కులను ఎదుర్కొని స్వామి అయ్యప్ప యవ్వనంలో అడుగు పెట్టాడు. తాను బ్రహ్మచారిగానే ఉంటానని తనను అందరూ పూజిస్తారని, తనను నమ్మినవారిని కంటికి రెప్పగా కాపాడుతానని తన్ను పెంచిన తండ్రికి చెబుతూ రాజశేఖరడను రాజును వదిలి వేసి స్వామి అయ్యప్ప శబరిమలై కొండలపైకి వెళ్లాడు. పవిత్రమైన శబరికొండలపై (పొన్నాంబల మేడు) శాశ్వతంగా విగ్రహరూపంలో నిలిచిపోయాడని చారిత్రిక కథనం. అయ్యప్ప కోరిక మేరకు ప్రతి ఏడాది మకర సంక్రాంతి రోజు పాంథాల రాజు రాజశేఖరుడు స్వయంగా చేయించిన ఆభరణాలను తన రాజప్రాసాదం నుండి తీసుకువచ్చి, అయ్యప్పస్వామికి అలంకరిస్తారు. అప్పటినుంచీ పాంథాల రాజ కుటుంబీకుల నివాసం నుండే ప్రతి ఏటా మకర సంక్రాంతికి ఆభరణాలను శబరిమలైకి తీసుకురావడం పరిపాటైంది. మకర సంక్రాంతికి రెండు రోజుల ముందు ఆభరణాలతో ఉన్న పెట్టెలను పాంథాళ రాజప్రాసాదం నుండి తీసుకుని వళియ కోయిక్కాల్, అయిరూర్ పుతిక్ కెరు ఆలయం, పెరున్నత్తిల్ ఆలయం, నలైక్కల్ శివాలయం, వెల్లచిమ్మల, పంపానది మీదుగా శబరి పీఠానికి తీసుకువస్తారు. మకర సంక్రాంతిరోజు సాయంత్రం సరిగ్గా ఆరు గంటలకు ఈ ఆభరణాలు అయ్యప్ప సన్నిధికి చేరతాయి. ఆభరణాలు ఉన్న పెట్టెలను తీసుకువచ్చే సమయంలో అయ్యప్ప భక్తులు 'స్వామియే శరణం అయ్యప్ప' అంటూ చేసే నినాదాలతో ఈ ప్రాంతం పర్వతాలు మార్మోగుతాయి.

ఆభరణాలు ఉన్న పెట్టెలను స్వామి సన్నిధికి తీసుకువచ్చే సమయంలో పెట్టెల వెంట ఆకాశంలో ఒక గరుడపక్షి కూడా వస్తుంది. ఆభరణాలను మకర సంక్రాంతి రోజు సాయంత్రం స్వామి సన్నిధికి చేర్చిన తర్వాత స్వామికి అలంకరించగానే ఈ గరుడపక్షి ఆలయం చుట్టూ ఆకాశంలోనే మూడు పర్యాయాలు ప్రదక్షణలు చేసి అడవుల్లోకి వెళ్లిపోతుంది. అయ్యప్ప విగ్రహాన్ని ఆభరణాలతో అలంకరించిన వెంటనే పూజారులు స్వామికి హారతి ఇస్తారు. ఇదే సమయంలో ఆలయానికి ఈశాన్యంవైపు పర్వతాలపై మకరజ్యోతి కనిపిస్తుంది. కొన్ని సెకన్లపాటు మాత్రమే జ్యోతి ఉంటుంది. మకరజ్యోతి కనిపించేందుకు ఒక రోజు ముందు ఒక నక్షత్రం (ఉత్తరానక్షత్రం) దేదీప్యమానంగా కనిపిస్తుంది. ఆ రోజు వరకు ఈ నక్షత్రం జాడ ఆకాశంలో కనిపించదు. ఉత్తరానక్షత్ర దర్శనం, ఆభరాణలను తీసుకురావడం, మకరజ్యోతి దర్శనం సందర్భంగా శబరమలై కొండలు 'స్వామి శరణం-అయ్యప్ప శరణం', 'స్వామియే శరణం అయ్యప్ప' నినాదాలతో మార్మోగిపోతాయి. అత్యంత అరుదైన, అత్యద్భుతమైన మరకజ్యోతి దర్శనం పూర్వజన్మ పుణ్యఫలం.

- చివుకుల రామమోహన్

నవ్యకాంతులు వెదజల్లే సంక్రాంతి



భారతీయులు జరుపుకొనే పండుగలలో ముఖ్యమైనది.. పెద్దపండుగగా చెప్పుకునేది 'సంక్రాంతి' ఇదే 'పెద్దల పండుగ' కూడా...

పెద్దలను స్మరించుకొని, వారికి తర్పణములు, పిండ ప్రదానములు జరిపే రోజు సంక్రాంతి. సం, క్రాంతి- అను రెండు సంస్కృత పదముల కలయికతో ఏర్పడేది సంక్రాంతి. 'సం' అంటే మంచి, 'క్రాంతి' అంటే పరివర్తనము. మనిషిలో మంచి పరివర్తనము కలిగించడమే 'సంక్రాంతి' పరమార్థము.

జ్యోతిషశాస్త్రం ప్రకారం సూర్యుడు మకరరాశిలోనికి పరివర్తనం చెందే రోజు సంక్రాంతి. మకర సంక్రమణమే సంక్రాంతి ఇక నుంచి ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమన్నమాట. సంక్రాంతికి క్రొత్త పంటలు చేతికొచ్చి రైతులు నివసించే పల్లెలు కళకళలాడుతుంటాయి. నిన్నటి దాకా ధనుర్మాసం తిరుప్పావై పూజలు పాటలు గోదాదేవి కల్యాణంతో ముగుస్తాయి. సంక్రాంతి రోజు స్త్రీలకు నోముల పండుగ, కుటుంబసౌఖ్యం, అన్యోన్య దాంపత్యం ఆశించి స్త్రీలు చేసే నోములు ప్రత్యేకతను సంతరించుకుంటాయి. బుడుబుక్కలవాళ్లు పాటలు దాసరుల వైష్ణవ సంకీర్తనలు, జంగందేవర శైవనామాలు, గంగిరెద్దుల వాళ్ల ఆట పాటలు, సన్నాయి మేళాలు, విప్రవినోదులు, అర్ధనారీశ్వర కథలు, పటం కథలు ఇలాంటి వన్నీ ప్రదర్శించే జానపద కళాకారులను గౌరవించే పండుగ సంక్రాంతి.


మకర సంక్రాంతి రోజు శబరిమలై అయ్యప్ప ఆలయంలో స్వామిని ఆభరణాలతో అలంకరించి, హారతి ఇచ్చే సమయంలోనే, ఆలయానికి ఈశాన్య దిశలో ఉండే పర్వతాలపై మకరజ్యోతి దర్శనమిస్తుంది. స్వామి అయ్యప్పకు దేవతలు, ఋషులు ఇచ్చే హారతియే ఈ మకరజ్యోతి అని భక్తులు భావిస్తారు, విశ్వసిస్తారు. ఈ జ్యోతి దర్శనం ఎన్నోజన్మల పుణ్యఫలంగా భావిస్తారు.

సంక్రాంతి రోజు బొమ్మల కొలువులు, గాలిపటాల ఎగురవేయడాలు, బొంగరాలు తిప్పడాలు ఇలాంటివి పిల్లల ప్రత్యేకతలు.. పిన్నపెద్ద తేడా లేకుండా కొత్తధాన్యంతో అరిసెలు, పొంగలి, పులగం మొదలైన పిండివంటలు వండి పదిమందితోకలిసి పంచుకుని తిని సంక్రాంతి రోజు ఆనందిస్తారు.

కనుమపండుగ పశుగణాన్ని పూజించే రోజు. పశువుల కడిగి, ఒళ్ళు నిమిరి, నీరు త్రాగించి, వాటిని ఆనందింపజేసి, వాటియెడ తమ కృతజ్ఞతను ప్రకటించే రోజు ఇది. వాటిని అలంకరించి పశువులను పూజించడమే కనుమ ప్రత్యేకత. ఎడ్లు కట్టిన బండ్లను ఊరు ఊరంతా తిప్పుతారు. జాజు, సున్నం పట్టీల అలంకరణతో ఈ బండ్లు ఎంతో కన్నుల పండువుగా ఊరేగింపులో పాల్గొంటాయి. కోడి, పొట్టేళ్లు, ఎద్దుల ల్లాంటి పశువులకు పందేలు కూడా నిర్వహిస్తుంటారు. ఇలా మూడు రోజులు ముచ్చటగా సంక్రాంతిని జరుపుకుంటారు.

- దాసరి రాణి

కోరితే కాదనేది లేదు



పురాణ వ్యక్తులు పూర్వజన్మలు

కేవలం పాపకర్మవల్లనే జననమరణచక్రంలో బంధీలు అవుతామని అనుకోనక్కర్లేదు. కోరిక అనేది ఉంటే చాలు మళ్లీ జన్మ తప్పకవస్తుంది. మనం ఎన్ని పుణ్యకార్యాలు చేసినా కూడా ఆ పుణ్యఫలాన్ని అందుకోవడానికి కూడా జన్మలు వస్తూనే ఉంటాయి. ఇక కోరికలు ఉంటే అవి తీరేదాకా జన్మల పరంపర కొనసాగుతూనే ఉంటుంది. అట్లాంటి కథే ధ్రువుని కథ. సునీతి ఉత్తానపాదుల ముద్దుల కుమారుడు ధ్రువుడు. ఉత్తానపాదులకు సురుచి అను మరో భార్యకూడా ఉండేది. ఇద్దరు భార్యలతో ఉత్తానపాదుడు ఆనందంగా కాలం గడుపుతుండేవాడు. కాలక్రమంలో సునీతి దూరమై సురుచి రాజుగారికి దగ్గరైంది. రాజుగారికి సురుచి మాటే వేదంగా ఉండేది. ఆమె ఏం చేసినా అతడు మారు మాట్లాడేవాడు కాదు. దానితో సురుచిలో అహంకారం పెరిగింది. ఆ అహంకారంతో తన కొడుకైన ఉత్తముడు మాత్రమే తండ్రి ప్రేమానురాగాలను పొందాలని అనుకొనేది. ఒకరోజు ఉత్తముడు తన తండ్రి అంకంపై కూర్చుని ఉండడం చూసి తాను కూడా అట్లా కూర్చోవాలనే కోరికతో ధ్రువుడు ఉత్తానపాదుని దగ్గరకు వచ్చాడు. తన కోరికను తండ్రితో చెప్పాడు. ఆ విషయం సురుచికి తెలిసింది. వెంటనే ఆమె కోపావేశంతో వచ్చి ధ్రువుని దూరంగా నెట్టివేసి'తండ్రి అంకపీఠంపై కూర్చోవాలంటే నా కడుపున పుట్టాలి. దానికి ఎంతో అదృష్టం ఉండాలని దూరంగా తొలిగిపో ఇంకెప్పుడు ఇంతటి సాహసాన్ని చేయకు. నీవు దురదృష్టవంతునివి కనుకనే ఈ సునీతి కడుపున పుట్టావు'అని తిట్టింది. జరిగినదానికి ఎంతో బాధపడుతూ తన తల్లి దగ్గరకు ధ్రువుడు వెళ్లాడు. సునీతి ధ్రువుని బాధ తెలుసుకొంది. మీ పినతల్లి చెప్పిన విషయం నిజమే కనుక నీవు ఏమీ బాధపడకు. మన దుఃఖానికి ఇతరులను నిందించాల్సిన అవసరం లేదు. పూర్వజన్మల పాపమే ఈ జన్మలో దుఃఖహేతువు అవుతుంది. కనుక నీవు మీ తాతగారిలాగా శ్రీమన్నారాయణుని సేవ చేయుము. ఆయనే అన్నింటికీ సర్వాధికారి. ఆ మహావిష్ణువు అనుగ్రహం దొరికితే శాశ్వతమైన శ్రీవారి సాయుజ్యమే మనదౌవుతుంది. నీవు ఇక ఏమీ ఆలోచించకుండా వెంటనే స్వామిని వేడుకో అని అంది. అమ్మమాట ప్రకారం అడవి బాట పట్టాడు. మనస్సంతా ఆవేదనతోను, ఆక్రోశంతోను నిండి పోయింది. ఎట్లాగైనా ఆ శ్రీమన్నారాయణుని చూడాలి. ఆయన్నే నా ఈ స్థితిని మెరుగుపర్చుమని అడగాలి అనుకొంటూ ముందుకుపోతున్నాడు.

నారదుడు ఈ బాలుడిని చూశాడు. 'అయ్యోపసివాడని మొగ్గలాంటి వాడు ఈ బాలుడు. పౌరుషవంతుల వంశంలో పుట్టినవాడు. ఆ వాసన వల్లనే నేడీ పినతల్లి దుర్వాక్కులను విని సహించలేక వెళ్తున్నట్టు ఉన్నాడు. ఇతనికి నేను సహాయం చేయాలి' అని మనసున అనుకొన్నాడు. త్రిలోకసంచారి అయిన నారదుడు ధ్రువుని ఎదుట నిల్చాడు.

- డా. రాయసం లక్ష్మి

ఏకాదశ రుద్రుల కొలువే ప్రభల తీర్థం

కోనసీమలో తరతరాలనుండి సంక్రాంతికి వెలుగుల్లో వైభవోపేతంగా ప్రభలీనుతున్న ఉత్సవాలు జగ్గన్నతోట ప్రభల తీర్థాలు.

మకర సంక్రమణ ఉత్తరాయణ మహా పుణ్యకాలంలో సంక్రాంతిపండుగమూడవ రోజున జరుపుకునే కనుమపండుగదినాన కోనసీమలోని అంబాజీపేట మండలం, మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో జరిగే ప్రభల తీర్థం అత్యంత ప్రాచీనమైనది, చారిత్రాత్మకమైనదీ ప్రభల తీర్థం.

జగ్గన్నతోటలో ఏ విధమైన గుడిగానీ, గోపురంగానీ లేవు. అక్కడంతా ఉన్నది కొబ్బరి తోటే. ఏకాదశ రుద్రులు కొలువుతీరడం వల్ల జగ్గన్నతోట ఎంతోప్రాముఖ్యతను సంతరించుకున్నది.

ఏకాదశరుద్రులు ఒకచోట కొలువుతీరేది ఈ ఒక్క కోనసీమలోని జగ్గన్నతోటలోనే. లోక కళ్యాణార్థం ప్రతీ సంవత్సరం కనుమ రోజున ఏకాదశ రుద్రులు జగ్గన్నతోటలో సమావేశము అవుతారని పెద్దలంటారు. సుమారు 400 సంవత్సరాల క్రితం 17వ శతాబ్దములో సంక్రాంతిలో కనుమ రోజున ఏకాదశ రుద్రులు లోక కళ్యాణార్థం జగ్గన్నతోటలో సమావేశమై లోక పరిస్థితుల గురించి చర్చించారనీ, అప్పటినుండి కనుమ రోజున జగ్గన్నతోటలో ప్రభల తీర్థము నిర్వహించబడుతున్నదని ఇక్కడి పెద్దలు చెబుతారు. పూర్వం పెద్దాపురం సంస్థానాధీశులైన రాజావత్సవాయి జగన్నాథ మహారాజు (జగ్గన్న) గారు ప్రభల తీర్థమునకు విచ్చేశారు. ఏకాదశ రుద్రులను దర్శించి, ప్రభల తీర్థం ఘనంగా నిర్వహించేందుకు అవిరళ కృషిసల్పారని ఆరోజు మహారాజు చేసిన జగ్గన్న పూజల ఫలితంగానే ప్రభల తీర్థం జరుగు ప్రదేశం 'జగ్గన్న' తోటగా పిలవబడుతున్నది ఇక్కడి వారి విశ్వాసం.



ప్రభల తీర్ణం రోజున ఏకాదశ రుద్ర గ్రామములలో కొలువున్న స్వామివార్లు గంగలకుర్రు అగ్రహారం - వీరేశ్వరస్వామి, గంగలకుర్రు- చెన్నమల్లేశ్వరస్వామి, వ్యాఘ్రేశ్వరం- వ్యాఘ్రేశ్వరస్వామి, పెదపూడి- మేనకేశ్వరస్వామి, ఇరుసుమండ- ఆనందరామేశ్వరస్వామి, వక్కలంక- కాశీ విశ్వేశ్వర స్వామి, నేదునూరు- చెన్నమల్లేశ్వరస్వామి, ముక్కామల- రాఘవేశ్వరస్వామి, మొసలపల్లి- మధుమానంత భోగేశ్వరస్వామి, పాలగుమ్మి- చెన్నమల్లేశ్వరస్వామి, పుల్లేటికుర్రు- అభినవ వ్యాఘ్రేశ్వరస్వామి వార్లను ప్రభలపై మేళతాళాలతో, బాజా భజంత్రీలతో, మంగళ వాయిద్యాలతో జగ్గన్నతోటకు ఊరేగింపుగా తీసుకొని రావడం ఇక్కడి ఆచారం.

ప్రభల తీర్థమునకు ఆతిధ్యమిచ్చు మొసలపల్లి- మధుమానంత భోగేశ్వరస్వామివారు అన్ని ప్రభలకన్నా ముందుగా జగ్గన్నతోటకు చేరుకొని, ప్రభలు అన్నింటికీ ఆహ్వానం పలుకుతారు. అంతేకాక తిరిగి వెళ్ళేవరకూ ఇక్కడే ఉండడమూ సంప్రదాయమే.

జగ్గన్నతోట ప్రభలతీర్థమునకు అధ్యక్షత వహించు వ్యాఘ్రేశ్వరం- వ్యాఘ్రేశ్వరస్వామి వారి ప్రభ తీర్థం లోనికి ప్రవేశించినపుడు మిగిలిన రుద్ర ప్రభలను ఒకసారి పైకి లేపడం సంప్రదాయం. అలాగే జగ్గన్నతోట ప్రభల తీర్థములో ప్రత్యేక విశిష్టతను సంతరించుకున్న గంగలకుర్రు అగ్రహారం- వీరేశ్వరస్వామి, గంగలకుర్రు- చెన్నమల్లేశ్వరస్వామివార్ల ప్రభా వాహనములను కౌశికలో నుండి అవతలి ఒడ్డుక చేర్చడం వంటి రమణీయ దృశ్యాలు చూడటానికి రెండు కన్నులూ చాలవు.

ముఖ్యంగా జగ్గన్నతోట ప్రభల తీర్థములో ప్రత్యేక ఆకర్షణగా విరాజిల్లుతూ, చారిత్రాత్మక ప్రాముఖ్యతను కలిగి ఉండి, అన్నిప్రభలకన్నా ఆఖరుగా వచ్చు గంగలకుర్రు అగ్రహారం- వీరేశ్వర స్వామి ప్రభా వాహనం తీర్థంలోనికి వచ్చు వరకూ మిగిలిన ప్రభలు కూడా ఎదురుచూస్తూ ఉండడం ఈ ప్రభలల్లో విశేషం. నిండు ప్రవాహంలో వీరేశ్వరస్వామి వారిని ఓలలాడిస్తూ కౌశికను దాటించే తీరు కన్నులారా తిలకించే భక్త జన సందోహ ఆనందానికి అవధులుండవు. అలా ఏకకాలంలో ఏకాదశరుద్రులను ఒకే వేదికపై దర్శించి తరించవచ్చు ననే సంకల్పంతో భక్తులు తండోపతండాలుగా విచ్చేస్తారు.

జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని వీక్షించడానికి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు, దేశ విదేశాలలో స్థిరపడిన ఈ ప్రాంతవాసులందరూ ఈ తీర్థంలో పాల్గొంటారు. ఈ ఏకాదశ రుద్రుల అనుగ్రహంకోసంఎక్కడెక్కడినుంచో భక్తుజన సందోహం జగ్గన్నతోట ప్రభల ఉత్సవములో లక్షలాది మందిగా వచ్చి పూజలు నిర్వర్తిస్తారు

- చోడిశెట్టి శ్రీనివాస్



పార్వతీ తనయ నమోస్తుతే

ప్రథమ పూజలందు పార్వతి తనయుండు
విఘ్నములను బాపి విద్య నొసగ
వక్రతుండ రూప వరసిద్ధి గణపతీ
చేరికొలుతు నిన్ను శివకుమార

శతకపద్య విద్య సంప్రాప్త మందగ
రచన జేసినాడ రమ్యమొప్ప
భక్తి సుమములిడుతు బ్రహ్మపురంధ్రికి
నాదు కవిత క్రియ నవ్యదీప్తి

పాలసంద్రమందు పవళింప విష్ణువు
శేషపాన్పు పైని సేవ సల్పు
క్షీరసాగర సుత శ్రీమహాలక్ష్మికి
ప్రణతులిడగ జన్మ పావనంబు

రచన: కవిశ్రీ మోహన్ ప్రసాద్
బాలాజీ నగర్ వీరభద్రపురం వేల్పూర్
చరవాణి: 9347993020

కలియుగ వైకుంఠం.. రంగనాథ ఆలయం



ఉత్తర శ్రీరంగంగా కీర్తిపొందిన నెల్లూరు శ్రీరంగనాయకుల ఆలయం కథాసారాంశం స్కాంద పురాణంలో ప్రస్తుతించారు. పెన్నానదీ ప్రాంతమైన పినాకిని నదీ తీరాన కొలువైన రంగనాథస్వామికి శయన నారాయణుడు (పళ్లికొండ పెరుమాళ్ళు)గాను ఈ ప్రాంతాన్ని శ్రీ వైకుంఠం (చిత్తరమేళ విణగళ్)గా చరిత్ర ప్రసిద్ధి చెందింది. పురాణ గ్రంథాల పుటలు తిరగవేస్తే వైకుంఠవాసియగు శ్రీమన్నారాయణుడు మహాలక్ష్మి సమేతంగా భూలోక విహారమే సంకల్పించి ఆదిశేషుని క్రీడా శైలముగావలసినదిగా ఆజ్ఞాపించాడు. అంతట ఆదిశేషుడు పినాకిని నదీ తీరాన గంగా ప్రభవించ సత్యలోక పర్యంతం ప్రవర్ధమానుడయ్యెను. శ్రీమన్నారాయణుడు గరుడ వాహనదారుడై తన పాదంతో ఆ గిరి స్పృశించెను. ఆనాటి నుండి ఆ ప్రాంతం తల్పగిరిగా ప్రసిద్ధి చెందింది. ఈ ప్రాంతంలో తపస్సు చేసిన కశ్యప మహాముని పుండరీక యాగము చేయుచుండ ఏకాదశి పుణ్యదినాన కశ్యప ముని కోర్కె మేరకు కలియుగ శ్రీవైకుంఠంగా ఖ్యాతి చెందేలా శ్రీమన్నారాయణుడైన రంగనాథస్వామి ఈ క్షేత్రంలో వెలిశాడు. కశ్యప మహర్షి ప్రార్థన మేరకు ఆదిశేషుడు శేషసాయి కాగా శ్రీమన్నారాయణుడు శ్రీదేవి భూదేవి సహితంగా శయనించెను. నాభి నుండి బ్రహ్మ ఉద్భవించెను. ఉత్తర ముఖుడైన శ్రీరంగనాథుడును సేవించిన భక్తులకు కోరిన వరాలిచ్చే భక్త వల్లభుడిగా కీర్తిపొందుతున్నాడు.

చరిత్ర పుటలు తిరుగవేస్తే ఏడవ శతాబ్దంలో పల్లవ రాజులు సింహపురి (నెల్లూరు) ప్రాంతాన్ని సందర్శించి దేవాలయ నిర్మాణం చేశారు. క్రీ.శ. 12వ శతాబ్దంలో రాజేంద్ర ఉభయకులోత్తన చోళ కాలంలో గర్భాలయాన్ని నిర్మించారు. 1849లో ఎర్రగుడిపాటి వెంకటాచలం పంతులు ఏడు అంతస్తుల రాజగోపురాన్ని నిర్మించాడు. తొమ్మిది దశాబ్దాల పూర్వం శ్రీమాన్ ముప్పిరాల నరసింహాచార్యులు ఈ దేవాలయాన్ని బంగారు గరుడ వాహనం, అద్దాల మండపం, నగలు కానుకలుగా సమర్పించారు.

ఉత్తర భారతదేశంలో ఎంతో ప్రసిద్ధి చెందిన ఈ దేవాలయంలో వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తూ స్వామివారిని ఉత్తర ద్వారంలో దర్శించే విధంగా ఏర్పాట్లు చేస్తారు. ప్రతి సంవత్సరం మే నెలలో భగవాన్ రామానుజాచార్యుల జన్మదినాన పూల పల్లకి ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖలో 'ఎ' గ్రేడ్ ఆలయంగా గుర్తింపు వున్న ఈ ఆలయంలో శ్రీరంగనాథస్వామి తెప్పోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేయమని నీటిపారుదల శాఖను కోరామని ఆలయ ధర్మకర్తలు తెలిపారు. ప్రస్తుతం మంచికంటి సుధాకరరావు ఆలయ చైర్మన్‌గా భక్తుల సేవలో భాగం పంచుకొనగా కోవూరు జనార్దన్ రెడ్డి కార్యనిర్వాహణాధికారిగా దేవాలయ నిర్వహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భోగి పండుగ రోజున కళ్యాణం, కనుమ పండగ రోజున కనుమ పార్వేటి ఉత్సవం జరుపుతారు. ధనుర్మాసంలో స్వామి వారికి అధ్యయనోత్సవం (పగల్‌పత్తు- రాపత్తు) అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. సింహపురి వాసులకు ఇలవేల్పుగా పూజలు అందుకుంటూ ఉత్తర శ్రీరంగంగా విరాజిల్లుతోంది.

-మురళీధర్

ధేనుకుని గర్వభంగం



శ్రీకృష్ణామృతం
చరణ శ్రీ

''ఆగండి ఆగండి ముందుకు వెళ్లకండి. ఇక్కడికి దగ్గరలోనే తాటివనం ఉంది. అందులోనుండి ఈ పండ్ల వాసన వస్తోంది. కాని మనం అక్కడికి వెళ్లవద్దు. అక్కడ ఒక గొప్ప రాక్షసుడు వున్నాడు. వాని పేరు ధేనుకాసురుడు. అందుకే మనం అక్కడికి వెళ్లవద్దు. అసలే మన పెద్దవాళ్లు ఆపదలదగ్గరకు వెళ్లవద్దు అని చెప్పి పంపారు కదా'అన్నారు.

ఆ మాట వినడంతోనే 'ఓహో మన కృష్ణుడు మన దగ్గర ఉంటే ఇక మనకు భయమెందుకు పెద్దలు ముసలి వారు కనుక వారికి భయమెక్కువ. అంతే మనం ముందుకు వెళ్లవచ్చుకదా'అంటూ ఒకరిని ఒకరు తోసుకొంటూ ముందుకు వచ్చారు. 'బలరామా మీరిద్దరూ మా దగ్గర ఉంటే మాకు భయమనేది తెలీదు. మేము చెప్పేది నిజమే కదా. పదండి వెళ్దాం'అన్నారు.

'ఓ కృష్ణా! ఓ బలరామా! మీరు చెప్పండి. మనకు భయం లేదని ఒకవేళ ఆ ధేనుకాసురుడు వస్తే వాని రెండూ కాళ్లు వెనుక నుంచి పట్టుకొని తాటి చెట్టు కేసి కొట్దాం. అనిచెప్పండి' అన్నారు.

కృష్ణబలరాములు వారి ఉత్సాహం చూసి బలరామ కృష్ణులూ 'సరే మీ ఇష్టాన్ని మేము ఎందుకు కాదంటాం పదండి ' అంటూ ముందుకు వెళ్లారు.

ఆ వనం అంతా మాగిని తాటిపండ్ల వాసనతో గుబాళించిపోతోంది. బలరాముడు ఓ చెట్టును చూసి దాన్ని పట్టుకొని గట్టిగా ఊపాడు. టపటపా తాటిపండ్లు ఒక దానిపైన ఒకటి పడ్డాయి. ఆ శబ్దానికి నిద్రపోతున్న ధేనుకాసురుడు భయపడి కండ్లు తెరిచాడు. 'ఏమిటీ నా వనం లోకి ప్రవేశించిన అర్భకులు ఎవరు? 'అంటూ గట్టిగా గాండ్రిస్తూ పరుగెత్తి గోపబాలుర చెంతకు వచ్చాడు. అంతే గాడిద శరీరంతో ఉన్న ధేనుకుడ్ని చూసి అమితమైన కోపంతో బలరాముడు రెండు కాళ్లు పట్టు గిరగిరా తిప్పి తాటి చెట్లకేసి కొట్టాడు. వాడి శరీర బరువుకు ఒక చెట్టు వెనుక మరోచెట్టు అలా వంద చెట్లు ఒకదానిపై ఒకటి పడ్డాయి. వాటికింది ధేనుకాసురుడు పడ్డాడు. ఒక్క దెబ్బతోనే వాడు అసువులు బాసాడు. దాన్ని చూసి గోపాలురంతా ఆనందంతో వెర్రి కేకలు వేసారు. ఈ ధేనుకాసురుని అరుపు, గోపబాలుర కేరింత విని ధేనుకాసురుని బంధుగణమంతా తమ రాక్షసబలంతో బలరామకృష్ణులపైకి పరుగెత్తి వచ్చారు. వారినంతా అన్నదమ్ములిద్దరూ చీల్చి చెండారు. వారి పీడ విరగ డ అయింది. గోపాలురు ఆనందంతో బలరామకృష్ణులను తమ చేతులతో ఎత్తుకొని వీపులపైన ఎక్కించుకుని అమితానందంతో ఊరేగారు. మీరే అందరికన్నా బలవంతులూ అంటూ వారిని మెచ్చుకున్నారు. ఇక ఎంతోమంది ఈ తాటివనంలోకి యథేచ్ఛగా తిరుగుతారు. దానికి కారణం మీరిద్దరే అంటూ వారిని మరీ పొగిడారు. అట్లా ధేనుకాసురుని బలరామ కృష్ణులు యమపురికి పంపారు.

గోపాలురంతా కలసి ఇంటికి బయలుదేరారు.

గోపాలుర రాకకోసం ఎదురుచూస్తున్న గోపకాంతలంతా వారికి ఎదురేగి తీసుకువచ్చి స్నానపానాదులు చేయించారు. పొద్దుటినుంచి కష్టపడి వచ్చారని ఎంతో ఆత్మీయంగా, ప్రేమగా అన్నాదులను తినిపించారు. రకరకాల పిండివంటలు పెట్టారు. వారి అమ్మల దగ్గర గోరుముద్దులు తింటున్న గోపబాలురు అడవిలో బలరాముడు ధేనుకాసురుణ్ణి చంపిన వైనాన్ని కథలు కథలుగా చెప్పారు.విన్నవారంతా భయపడి పోయారు. వారికేమీ కాలేదుగా అని వారిని తడిమి చూసుకున్నారు. వెంటనే యశోదమ్మ దగ్గరకు పరుగెత్తివచ్చారు. వారు వచ్చేటప్పటికీ రోహిణీ యశోదలు ఇద్దరికీ అన్నం తినిపిస్తున్నారు. 'అమ్మా యశోదమ్మా నీ ముద్దుల పట్టీ కృష్ణయ్య ఏం చేశాడో చెప్పాడా లేదా? అతగాడు ఎలా ఉన్నాడు. బలరాముడు ఎలా ఉన్నాడు. వీరిద్దరూ కలసి అక్కడ ఒక రాక్షసుణ్ణి చంపారట. ఆ సంగతి మీకు తెలిసిందా. మనం ఇంత దూరం వచ్చినా ప్రతిరోజు ఏదో ఒక ఆపద మన పిల్లల్ని చుట్టుముట్టుతూనే ఉంది. ఏరి వారిని ఒకసారి మా కనులారా చూసుకోనివ్వండి' అంటూ దగ్గరకు వచ్చి కృష్ణుని బలరాముని దగ్గరకు తీసుకొని ముద్దులు పెట్టారు. వారి ఒళ్లంతా తడిమి చూశారు.

మీకు ఆపద వస్తుందని కదా మేము వెళ్లద్దు అంటే వినకుండా వెళ్లారు. ఆ రాక్షసుని వల్ల మీకు ఏ కష్టమూ కలుగలేదు కదా అని అడుగుతున్న గోపకాంతల వల్ల నిజమేదో తెలుసుకొని మ్రాన్పడిపోయారు అమ్మలిద్దరూ. వారిద్దరూ తమ బిడ్డలకు దిష్టితీసేశారు. ఎంతో పెద్ద ఆపదను తిరిగి ఆ దేవుడే తీర్చాడని దేవునికి పదే పదే మొక్కుకున్నారు.

★★★

ఆంధ్రభూమి

చిత్ర

సోమవారం, 15 జనవరి 2018



మెగా అతిథిగా 'ఛలో'



నాగశౌర్య, రష్మిక మండన్న జంటగా వెంకి కుడుముల దర్శకత్వంలో ఉషా మూల్పూరి సమర్పణలో ఐరా క్రియేషన్స్ బేనర్‌పై శంకర్‌ప్రసాద్ మూల్పూరి నిర్మిస్తున్న చిత్రం 'ఛలో'. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని ప్రస్తుతం ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఈనెల 25న జరగనున్నది. మెగాస్టార్ చిరంజీవి ముఖ్యఅతిథిగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా నిర్మాతలు వివరాలు తెలియజేస్తూ, ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలకు మంచి రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా పాటలను ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈనెల 25న మెగాస్టార్ ముఖ్య అతిథిగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను భారీ స్థాయిలో చేయనున్నాం. చిత్రాన్ని ఫిబ్రవరి 2న విడుదల చేస్తామన్నారు. దర్శకుడు వెంకి మాట్లాడుతూ, టెక్నికల్ అంశాలు హైలెట్‌గా నిలిచే ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుని ప్రీప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. నాగశౌర్య నటన కొత్తగా వుంటుంది. తన కెరీర్‌లో ఈ చిత్రం నిలిచిపోతుంది. తప్పకుండా ఈ చిత్రాన్ని ఆదరిస్తారని కోరుకుంటున్నాం అన్నారు. నరేష్, పోసాని, రఘుబాబు, వెన్నెల కిషోర్, మైమ్‌గోపి, ప్రవీణ్, సత్య, వైవాహర్ష, ప్రగతి తదితరులు నటిస్తున్నారు.




అజ్ఞాతవాసి వెంకీ!

పవన్ కళ్యాణ్ హీరోగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఇటీవలే విడుదలైన అజ్ఞాతవాసి చిత్రం విజయవంతంగా ప్రదర్శించబడుతుంది. ఈ చిత్రంలో మరో నటుడు వెంకటేశ్ కూడా నటించాడు. అయితే ఇన్ని రోజులు ఆయనకు సంబంధించిన సన్నివేశాలేవి సినిమాలో పెట్టలేదు, తాజాగా నేటి నుండి వెంకటేశ్ నటించిన సన్నివేశాలను కలుపుతున్నారు. ఇప్పటివరకు అజ్ఞాతవాసిగా ఉన్న వెంకి ఈ చిత్రంలో కొద్దిసేపే కనిపిస్తాడట. మరోసారి పవన్‌తో కలిసి వెంకటేశ్ కనిపిస్తుండడంతో ఈ సినిమాపై మరింతో ఆసక్తి పెరిగింది.

మళ్లీ శర్వాకు జోడీగా

ప్రస్తుతం టాలీవుడ్‌లో వున్న హీరోయిన్‌లలో నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది నిత్యామీనన్. గ్లామర్ పాత్రలకు ఆమడ దూరంలో వున్న ఈ భామ, నటిగా తనదైన సత్తా చాటుకునే పాత్రల్లో మాత్రమే నటించేందుకు ఆసక్తి చూపిస్తోంది. ఈమధ్యే అల్లు అర్జున్ సరసన 'సన్నాఫ్ సత్యమూర్తి'లో నటించిన నిత్య, మరోసారి శర్వానంద్ సరసన హీరోయిన్‌గా నటించేందుకు సిద్ధమైంది. ఇదివరకే శర్వానంద్‌తో మళ్ళీ మళ్లీ ఇది రానిరోజు చిత్రంలో నటించి మెప్పించిన నిత్య, మరోసారి శర్వాతో కలిసి సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కే చిత్రంలో నటించనుంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రంలో మరో హీరోయిన్ కూడా వుంటుందట. ఆ పాత్ర కోసం కాజల్‌ని తీసుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారట. ఇక నిత్యామీనన్ పాత్ర ఆమెకు మంచి పేరు తెచ్చేదిగా వుంటుందట.



సాహో సెట్లో అనుష్క సందడి..!

అనగనగా ఓ రాజకుమారుడు



నవీన్‌బాబు, సంజన, అమృత హీరోహీరోయిన్లుగా శ్రీమతి రమాదేవి సమర్పణ లో రామ్‌సాయి గోకులం క్రియేషన్స్ బేనర్‌పై షాలినీ ఫేమ్ షేరాజ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'అనగనగా ఓ రాజకుమారుడు'. పి.వి.రాఘవులు నిర్మాత. కమెడియన్ సుమన్‌శెట్టి ప్రధానపాత్ర పోషిస్తున్న ఈ చిత్రం మొదటి షెడ్యూలును గోవాలో పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దర్శకుడు వివరాలు తెలిపారు- లవ్, కామెడీ, థ్రిల్లర్ అంశాలతో పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా సాగే చిత్రమిది. ఇటీవలే మొదటి షెడ్యూల్‌ని గోవా, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో చిత్రీకరించాం. సరికొత్త పాయింట్‌తో రూపొందించే ఈ సినిమా గోవా నేపథ్యంగా సాగుతుంది. కామెడీతోపాటు థ్రిల్లర్ అంశాలు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. త్వరలో రెండవ షెడ్యూల్‌ని హైదరాబాద్‌లో మొదలుపెట్టనున్నామని అన్నారు. ఈ చిత్రానికి కెమెరా మరియు ఎడిటింగ్-ఏకరి లక్కి, కథ-100 డేస్ మూవీస్, పాటలు-బాషాశ్రీ, సమర్పణ-రమాదేవి, నిర్మాత-పి.వి.రాఘవులు, సంగీతం, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం-షేరాజ్.

డార్క్ కామెడీ నేపథ్యంలో..



గాయత్రి గుప్త, శ్వేతావర్మ, రాహుల్ రామకృష్ణ, ప్రియదర్శి ముఖ్య పాత్రల్లో ప్రశాంత్‌కుమార్ దర్శకత్వంలో రెడ్ యాంట్స్ బేనర్‌పై తెరకెక్కుతున్న 'మిఠాయి' చిత్రం ఆదివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ముహూర్తం సన్నివేశానికి విజయ్ దేవరకొండ క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమంలో దర్శకులు క్రాంతి మాధవ్, సందీప్ వంగా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ప్రశాంత్ మాట్లాడుతూ, డార్క్ కామెడీ నేపథ్యంలో రూపొందే సినిమా ఇది. ఈ తరహా చిత్రాలు తెలుగులో తక్కువగా వచ్చాయి. మంచి టీమ్‌తో పనిచేస్తున్నాం. తప్పకుండా అందరికీ నచ్చేలా వుంటుందన్నా రు. శ్వేతావర్మ మాట్లాడుతూ, సంక్రాంతి పండుగ రోజున ఈ చిత్రాన్ని ప్రారంభించడం ఆనందంగా వుంది. ఈ చిత్రంలో అవకాశం ఇచ్చిన దర్శకుడు ప్రశాంత్‌కు ధన్యవాదాలు అన్నారు. గాయత్రి మాట్లాడుతూ, సినిమా అంటే పాషన్ వున్న వ్యక్తులు కలిసి చేస్తున్న సినిమా ఇది. విలక్షణ కథ, కథనంతో సాగుతుందన్నారు. హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ, ఈ సినిమాకు పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ నాకు చాలా కాలంగా తెలుసు. దర్శకుడు ప్రశాంత్ మంచి మిత్రుడు. మంచి కాన్సెప్ట్‌ను ఎంచుకున్నాడు. ఈ టీమ్‌కు ఆల్‌ది బెస్ట్ చెబుతున్నానని అన్నారు. ఈ చిత్రానికి సంగీతం-వివేక్‌సాగర్, కెమెరా-సాకేత్ సౌరబ్, ఎడిటింగ్-వీను భూషణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్-కృష్ణ వోడపల్లి, నిర్మాత దర్శకత్వం-ప్రశాంత్‌కుమార్.

మహిళా దర్శకురాలితో..



తమిళ హీరో అయినా తెలుగు హీరోలతో సమానంగా మార్కెట్‌ను, అభిమానాన్ని సంపాదించుకున్న నటుడు సూర్య. ఆయన సినిమాలంటే తెలుగు ప్రేక్షకులకూ అంతే ఆసక్తి. సూర్య నటించిన 'తానా సెరెందాకూట్టమ్' తమిళ చిత్రాన్ని 'గ్యాంగ్' పేరుతో తెలుగులో విడుదల చేశారు. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం మంచి టాక్‌ను తెచ్చుకుంది. ఈ సినిమా తరువాత సూర్య, సెల్వరాఘవన్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. దాంతోపాటు కె.వి.ఆనంద్ దర్శకత్వంలో మరో సినిమా చేయనున్నాడు. తాజాగా ఆయన మరో చిత్రానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు వార్తలొస్తున్నాయి. ఈసారి ఆయన మహిళా డైరెక్టర్‌తో పని చేస్తాడట. ఈమధ్యే వెంకటేష్‌తో 'గురు' చిత్రాన్ని తెరకెక్కించి దర్శకురాలిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న సుధా కొంగర దర్శకత్వంలో ఈ చిత్రం ఉంటుందట. ఇటీవలే సుధ సూర్యకు కథ చెప్పిందని, లైన్ నచ్చడంతో స్క్రిప్ట్ సిద్ధం చేయమని చెప్పాడట సూర్య. త్వరలోనే వీరి కాంబినేషన్‌లో సినిమా పట్టాలెక్కే అవకాశం వుంది.

ఓంకార్ మరో చిత్రం

ఆట టీవీ షో ద్వారా పాపులారిటీ సంపాదించుకున్న నటుడు ఓంకార్, ఆ తరువాత దర్శకుడిగా మారి రాజుగారి గది సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. దానికి సీక్వెల్‌గా వచ్చిన రాజుగారి గది-2 కూడా మంచి విజయం సాధించడంతో ఓంకార్ వెనక్కి తిరిగి చూసుకునే అవకాశం లేదు. తాజాగా ఆయన మరో చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. అయితే ఈసారి హర్రర్ నేపథ్యంలో కాకుండా ఓ ఆట నేపథ్యంలో సినిమా చేయడానికి ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఇప్పటికే ఈ సినిమాలో హీరో కూడా కన్‌ఫర్మ్ అయినట్టు తెలుస్తోంది. ప్రస్తుతం 'సాక్ష్యం' చిత్రంలో నటిస్తున్న బెల్లంకొండ శ్రీనివాస్ హీరోగా నటిస్తాడని, కథ నచ్చడంతో ఆయన ఓకె చెప్పినట్టు తెలుస్తోంది. అయితే ఇది ఓ ఆట నేపథ్యంలో సాగే కథ అని, త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి రానున్నదట. ఇప్పటికే బెల్లంకొండ శ్రీనివాస్ నటిస్తున్న 'సాక్ష్యం' సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకుంది. కాబట్టి త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి రానుంది. మరి ఈ యువ హీరోతో ఓంకార్ ఏమి ఆట ఆడిస్తాడో చూడాలి!

ఎంఎల్‌ఏ ఎంట్రీ

పటాస్ చిత్రంతో మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన నందమూరి కల్యాణ్‌రామ్ ఆ తర్వాత నటించిన రెండు చిత్రాలు ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేక పోయాయి. అందుకే ఈసారి కొత్తగా ఆ కట్టుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈసారి ఆయన ఎంఎల్‌ఏ అవతారం ఎత్తాడు. ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్‌ను ఆదివారం విడుదల చేసారు. ఈ చిత్రంలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తుంది.



ఫస్ట్ లుక్స్



కృష్ణుడొచ్చాడు

యువ హీరో నాని దూకుడు మామూలుగా లేదు. ఇప్పటికే డబుల్ హ్యాట్రిక్ విజయాలను అందుకున్న నాని మరో హ్యాట్రిక్ కోసం సిద్ధమవుతున్నాడు. తాజాగా ఆయన నటిస్తున్న కృష్ణార్జున యుద్ధం చిత్రానికి సంబంధించిన ఫస్ట్‌లుక్‌ని సంక్రాంతి కానుకగా విడుదల చేసారు. ఇందులో నాని ద్విపాత్రాభినయం చేస్తుండడంతో కృష్ణ పాత్రకు సంబంధించిన పోస్టర్ విడుదలైంది. మెర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం ఏప్రిల్ 12న విడుదల కానున్నది.

గ్లామర్ డోస్

బాలీవుడ్‌లో విక్కీ డోనార్ సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయిన యామి గౌతమ్ అంతకంటే ముందు తెలుగు, తమిళ భాషల్లో నటించింది. తెలుగులో నితిన్ సరసన కొరియర్‌బాయ్ కళ్యాణ్, గౌరవం చిత్రాల్లో నటించిన ఈమెకు తెలుగులో పెద్దగా కలిసిరాలేదు. దాంతో హిందీలోనే సెటిల్ అయి అక్కడే ప్రయత్నాలు సాగిస్తోంది. ఈమధ్యే కాబిల్ లాంటి ప్రయోగాత్మక చిత్రంలో అంధరాలిగా నటించి మెప్పించిన యామి, నటిగా మంచి గుర్తింపే తెచ్చుకుంది. అయితే గ్లామర్ హీరోయిన్‌గా రాణించేందుకు కసరత్తులు మొదలుపెట్టిన యామి, ఈమధ్య రెచ్చిపోయి ఘాటు అందాలతో పిచ్చెక్కిస్తోంది. ముఖ్యంగా హాట్ హాట్‌గా ఫొటో షూట్లతో క్రేజ్ పెంచుకునేందుకు సిద్ధమైంది. యామి ఫొటోలు చూసినవారంతా షాక్ అవుతున్నారు. యామి అందాల డోస్‌లకు వరుస అవకాశాలు క్యూ కట్టేలా వున్నాయని బి టౌన్ మీడియాలో చర్చాంశనీయమైంది. ప్రస్తుతం ఓ మాగజైన్ కోసం యామి హీటెక్కించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.



గౌతమ్‌యామి